# మదన కామరాజు కథ

&

# పెళ్లికి పది నిమిషాల ముందు

రెండు హాస్య నాటకాలు


**మొదలి నాగభూషణ శర్మ**



రసరంజని ప్రచురణ

2011

◆ మదన కామరాజు కథ & పెళ్ళికి పది నిమిషాల ముందు
(రెండు హాస్య నాటకాలు)
రచన : **మొదలి నాగభూషణ శర్మ**

◆ ప్రచురణ : **జూన్ 2011**

◆ వెల : **రూ.80/-**

◆ ప్రతులకు :
**ఆచార్య మొదలి నాగభూషణ శర్మ**
1-8-702/32/39, పద్మ కాలనీ, నల్లకుంట,
హైదరాబాద్-500044. ఫోన్: 04-27624765.
E-mail : modalisarma@rediffmail.com
&
**రసరంజని**
6-1-132/132, ఫ్లాట్ నెం.201, శృతకీర్తి రెసిడెన్సీ,
పద్మారావ్‌నగర్, హైదరాబాద్-500061.

◆ ముఖచిత్రం : **చంద్ర**

◆ రూపకల్పన :
**క్రియేటివ్ లింక్స్**
1-8-725/ఎ/1, 103సి, బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్,
నల్లకుంట, హైదరాబాద్-500044. ఫోన్ : 9848506964.

◆ ముద్రణ :
**కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్**
విద్యానగర్, హైదరాబాద్.

**చెట్టంత మనిషికి**

**పువ్వంత కానుక**



**రామ్మూర్తీ !**

నిత్యమూ భేదించినా, ఒకే ఆశయంతో బతికిన

యాభయ్ ఏళ్ల మన రంగస్థల అనుబంధానికి

అంతరంగ సాన్నిహిత్యానికి గుర్తుగా –

నువ్వు మెచ్చిన ఈ నాటకాలు నీకే అంకితం.

**నాగభూషణ శర్మ**

# కృతజ్ఞతలు

ఈ నాటక విజయానికి దోహదం చేసిన

మా రసరంజని

కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు

# మదన కామరాజు కథ

## (హాస్య నాటకం)

### ఇందులో పాత్రలు

| | | |
|---|---|---|
| కేశవచంద్ర కామరాజదేవ్ (కామరాజు) | : | జమిందారు |
| వత్సల | : | భార్య |
| గోపాలం | : | కార్యదర్శి |
| మదన | : | గోపాలం కాబోయే భార్య |
| కిశోర్ | : | వత్సల ఊరివాడు |
| రామనాధం | : | జమిందారీలో పెద్దగుమాస్తా మదన పినతండ్రి |
| ముత్యాలు | : | రాజావారి తోటమాలి |
| పాప | : | ఆయన కూతురు |
| జయప్ప భాగవతార్ | : | సంగీతం మాస్టరు జమిందారుకు దగ్గరివాడు |
| కరణం | : | ఆ ఊరి కరణం |
| ఇన్‌స్పెక్టరు పోతునాయుడు | : | వేషాల మనిషి |
| వెంకటి | : | ఆడవేషాలు వేసేవాడు |
| బుద్ధుడు | : | పోతునాయుడు బావమరిది |
| సింహాద్రి | : | జమిందారుకు ఆంతరంగిక నౌకరు |

**2003 నవంబరు 16, 17 & 18 తేదీలలో రవీంద్రభారతి, హైదరాబాద్‌లో**

**రసరంజని ప్రదర్శించిన**

## 'మదనకామరాజు కథ' తొలి ప్రదర్శనలలో పాల్గొన్న

## నట బృందం

| | | |
|---|---|---|
| కేశవ చంద్ర కామరాజదేవ్ | : | యం. ఫ్రాన్సిస్ |
| వత్సల | : | శ్రీమతి యం.జయశ్రీ |
| గోపాలం | : | కె.నటరాజ్ |
| మదన | : | శ్రీమతి జయశ్రీ |
| కిశోర్ | : | వెంకన్నబాబు |
| రామనాథం | : | వై.మల్లికార్జున్ |
| ముత్యాలు | : | యస్.మోహన్ |
| పాప | : | స్వర్ణగౌరి / ప్రభావతి |
| జయప్ప భాగవతార్ | : | యస్.కామేశ్వరశర్మ |
| మునసబు | : | ఎం.భజరప్ప |
| ఇన్‌స్పెక్టరు పోతునాయుడు | : | బి.నారాయణ |
| వెంకటి | : | వెంపటి రాధాకృష్ణ |
| బుద్ధుడు | : | పుండరీకాక్షశర్మ |
| సింహాద్రి | : | వై.శ్రీనివాస్ |

## సాంకేతిక బృందం

| | | |
|---|---|---|
| స్టేజ్ ఇన్‌ఛార్జ్ | : | సురభి నాగేంద్రప్రసాద్, మల్లికార్జున్ |
| రంగస్థల నిర్వహణ | : | వెంపటి రాధాకృష్ణ, స్వర్ణగౌరి, వేణుగోపాల్ |
| సంగీతం | : | మధుసూదనాచారి |
| మేకప్ | : | గోపాలస్వామి |

సాంకేతిక నిర్వహణ, ప్రయోగ సహకారం

**గరిమెళ్ల రామమూర్తి**

రచన-దర్శకత్వం

**మొదలి నాగభూషణ శర్మ**

# మదన కామరాజు కథ

## మొదటి రంగం

(**జ**మిందారుగారి దేవిడీలో ఒక పెద్దహాలు.........ప్రస్తుతం అది మదన కిచ్చిన విడిది. ఒక పక్క ఒక దివాను. హాలుకు ఒక పక్కగా పాతకాలం పెద్ద పేము పడక కుర్చీ. మరో పక్క రెండు కుర్చీలు. జమిందారు తన గదిలోకి వెళ్ళడానికి ఒకదారి ఈ హాలుగుండా. ఆయన తచ్చాడుతూ మదన కోసం చూస్తాడు. కనిపించదు. పక్కగదినుంచి మాటలు, నవ్వులు....'ఓహో! అక్కడ వున్నారా?' అనుకుంటూ వాకిట్లోకి వెడుతూ వుండగా 'నగుమోము......'అని అరవయాసలో పాడే జయప్ప భాగవతార్ గొంతు వినిపిస్తుంది..... ఆయన్ని పిలుస్తాడు....... "జయప్పా...... జయప్పా....." అని. జయప్ప వస్తూ "నగుమోము" లేదేమని అడుగుతాడు. విసుగ్గా ఉన్న కామరాజు–)

**కామరాజు:** జయప్పా! ఆ పాట ఆపి నేను చెయ్యమన్న పని ఎంతవరకు వచ్చిందో చెప్పు.

**జయప్ప :** అయ్యా!..మీ సేవకుణ్ణి. మీ ఆస్థానంలో ఉండుకున్న సంగీత విద్వాంసుణ్ణి. మీరు ఆజ్ఞాపించడమూ, నేను –

**కామరాజు :** ఊరికే మెరమెచ్చులు చెప్పకు.....ఏమయింది? మదనకు నా మనసులో మాట చెప్పావా?

**జయప్ప :** చెప్పకుండా ఉంటానా? సంగీత పాఠం సగంసేపు, మీ కీర్తిగానం మరో సగంసేపూనూ.......కొంచెం కొంచెంగా మన దారిలోకి –

**కామరాజు :** (కోపంగా) ఆ!

**జయప్ప :** అహ! అదే! మీ దారిలోకి వస్తున్నదనుకోండి..........అయినా ఈ నిశ్చయ తాంబూలాల తతంగం వాయిదా పడేటట్టు చూడండి – అంటే నా మాట ఖాతరు లేదు మీకు.

**కామరాజు :** ఎట్లాగయ్యా? ఒక పక్క రాణీ గారు వాళ్ళ పెళ్ళి చెయ్యాలని ఊ.... తొందరపడి పోతుంటే – అదీ గాక – మదన మన రామనాథంగారి అన్నగారి కూతురు కావడం, ఆవిడ రాణీగారికి కాలేజీ రోజుల్నుంచి తెలియడం – ఇవన్నీ మనకు అడ్డంకులే! అందుకే గదయ్యా – నిన్ను అడగడం..

**జయప్ప :** అయ్యా....తాంబూలాలు తప్పకపోతే మనం తప్పించుకుపోవడమే మార్గం! మీరు చెబుతున్న దాన్ని బట్టి రాణీగారు ఈ పెళ్ళి చెయ్యక మానరు. సరే! ఇహ అట్నుంచి నరుక్కు రావాల్సిందే! నిశ్చయ తాంబూలాలయితే యేం ముంచుకుపోయిందండీ? రేపు పెళ్ళే అవుతుందనుకోండి. అయితే మాత్రం యేం? ఏ అమ్మాయి అయినా మీమీద మనసు పడకుండా ఉండడం ఎట్లా? మీ ఆస్థి, మీ అంతస్థు, మీ దర్జా, మీ దర్పం.....

**కామరాజు :** అబ్బా! ఇవన్నీ మదనమీద పనిచేస్తున్నట్టు కనిపించదు.

**జయప్ప :** ఆడవాళ్ళు ఒక పట్టాన బయటికితేలరు సుమండీ!.....అందుకే అట్నుంచి నరుక్కు రావాలండీ అని ఘోష పెడుతున్నాను...మదన, గోపాలాల పెళ్ళి మీరు స్వయంగా పూనుకుని చేస్తున్నట్లు కనిపించాలి. వాళ్ళమీద వరాల వర్షం కురిపించాలి.

**కామరాజు :** ఓరి నీ యిల్లు నేలగట్టా! సరిగ్గా అట్లాగే చేస్తున్నాను కదయ్యా!

**జయప్ప :** ఆ అమ్మాయి మిమ్మల్ని "అమ్మో! ఈయన మా పాలిటి దేవుడు" అనుకోవాలి.

**కామరాజు :** అదే గదయ్యా ప్రయత్నం! నువ్వు వచ్చేముందరే – ఈ హాలు – వాళ్ళిద్దరికీ పడక గదిగా ఇచ్చేశాను.

**జయప్ప :** (ఆశ్చర్యంగా) ఈ హాలు! పడక గది! (ఆ తరువాత తట్టింది – పక్కనే రాజాగారి గది – అని) ఓహోహో!......చెప్పరూ!

**కామరాజు :** మంచిదేనంటావా?

**జయప్ప :** ఇంకా అడుగుతారా?.......అమ్మయిక్కడ...అయ్య అక్కడ –

**కామరాజు :** గోపాలం ఒప్పుకున్నాడు....

**జయప్ప :** ఇహనేం? ఆ తరువాత –

**కామరాజు :** తరువాత గోపాలం నా హైదరాబాద్ ఆఫీసుకు మానేజరు! వాళ్ళ మకాం హైదరాబాదు!

**జయప్ప :** ఓహోహో! ఇహ అయ్యగారు కాంపులకి – ఈ అయ్యగారు –

**కామరాజు :** తొందరపడి మాట జారకు....అసలే రాణీగారి స్నేహితురాలు.....ఈ లోగా నీ ప్రయత్నం ఫలించి మదన నేనంటే ఇష్టపడేటట్టు చూసే భారం నీది........

**జయప్ప :** ఆ మాట మీరు చెప్పాలా?.....మీ ఉప్పు తింటున్నవాణ్ణి..... ("అయ్యో నా మాట నమ్మరేం?" అంటూ వాకిట్లో మాటలు వినిపిస్తాయి) గోపాలం వస్తున్నట్టున్నాడు! అటుకేసి వెడదాం – (ఇద్దరూ అప్‌స్టేజ్ లెఫ్ట్‌కి వెళతారు. వాకిట్లో నుంచి రామనాథం, గోపాలం వస్తారు.)

**గోపాలం :** (వస్తూ) ఇదేనండి, రామనాథంగారూ, రాజావారు మాకిస్తానన్న గది.

**రామనాథం :** ఇదా! ఇదా మీకిస్తానన్నది!.....రాజా, రాణీ గార్ల గదుల తర్వాత ఇంత బ్రహ్మాండమైన గది ఈ దివాణంలోనే లేదనుకో! అంతా మా మదన అదృష్టం!

**గోపాలం :** ఇస్తానన్నది నాకండి!

**రామనాథం :** అదే లేవయ్యా! ఇద్దరి అదృష్టమూ అనుకో!.......అమ్మాయి వాళ్ళ నాన్నపోయాక "బాబాయి, నేను నీ దగ్గరే ఉంటాను.... వత్సలమ్మగారు కూడా ఉండిపో అంటోంది" అంటే సంబరపడి పోయాననుకో! ఇహ మీ పెళ్ళి కూడా అయిపోతే –

**గోపాలం :** అంతా మీ ఆశీర్వచనం –

**రామనాథం :** (చుట్టూ కలియచూసి) అవునూ – ఇటు పక్క రాజావారూ, అటు పక్క రాణీగారూ ఉంటారుగదా – గొప్పవారికి పొరుగునే ఉండడం పాముతో చెలగాటం అంటారు –

**గోపాలం :** అబ్బా! ఇప్పుడు మీ అమ్మాయికో కొత్త భయం పెట్టకండి.

**రామనాథం :** అయినా అమ్మాయితో ఓ ముక్క చెప్పి –

**గోపాలం :** నేను చెబుతానుగా! ఇహ మీరు తరువాత కార్యక్రమం చూడండి......

**రామనాథం :** 'తరువాత కార్యక్రమం' ఏమిటోయ్, నీ తొందర దొంగలుతోలా!...... గుర్రాన్ని కట్టెయ్యి.

**గోపాలం :** అబ్బా! నేనన్నది 'ఆ తరువాత' కార్యక్రమం కాదండీ! 'ఈ తరువాత' కార్యక్రమం! రాజావారు గది మాత్రమే కాదు మాకిచ్చింది. అందులోకి జమిందారులు వంశపారం పర్యంగా వాడుకుంటూ వచ్చిన పందిరి పట్టె మంచం కూడా!

**రామనాథం :** ఏమిటేమిటి! ఆ నగిషీలు చెక్కిన, అద్దాల పందిరి మంచాన్ని....మిమ్మల్ని వాడుకోమన్నారూ! (గభాలున) నాయనా! ఇవన్నీ చూసి ఎవరి కళ్ళయినా కుట్టవచ్చు మరోసారి ఆలోచించుకో!....

**గోపాలం :** ఏమీ అక్కర్లేదు....మీరు ఆ పట్టెమంచాన్ని చూపింతురూ!

**రామనాథం :** అయినా, ఆ పట్టెమంచం ఈ గదంతా ఆక్రమిస్తే ఇహమీరు అటూ ఇటూ మసలడం ఎట్లాగయ్యా?

**గోపాలం :** అంత పెద్దదా?

**రామనాథం :** అడగకు....ఈ జమిందారుల రాసలీలలకి ఆ మంచమే సాక్ష్యం! పాపం! ఈ రాజాగారి తండ్రిగారు దాన్ని ఎట్లాగయినా తోట బంగళాలోకి మార్చాలని ఊ! ప్రయత్నం చేశారు కాని పడకపోయింది...ఇహ ఈ జమిందారు గారు –

**గోపాలం :** మామగారూ! హిస్టరీ వద్దు, జాగ్రఫీ సంగతి చూడండి...

**రామరాజు :** అయితే ఈ గది పొడుగు వెడల్పులు కొలుస్తూ ఉండు. నే వెళ్ళి భూగారం తాళం చెవులు తెస్తాను. (వాకిట్లోకి వెడతాడు.)

**గోపాలం :** ఈ ముసలాళ్ళంతా యింతే! ఒకటే నస!! (అని కాలుతో కొలతలు కొలుస్తూ) ఒకటి, రెండు, మూడు......

(మదన వస్తుంది. చురుకైన పిల్ల...ఆనందంగా ఉంది. చేతిలో కొత్త చీరె.)

**మదన :** గోపాలం! గోపాలం! (తీరా అతన్ని చూసి సిగ్గుపడుతుంది.)

**గోపాలం :** ఏమిటి పెళ్ళికూతురుగారు! ఏమిటీ హడావుడీ?

**మదన :** ఈ చీరె చూడు...నిశ్చయ తాంబూలాలకి వత్సల యిచ్చింది.

**గోపాలం :** చూడు! నేనిప్పుడు రాజాగారి దగ్గర ఉద్యోగస్థుణ్ణి. నువ్వు రాణీగారిని పేరుపెట్టి పిలవకూడదు.

**మదన :** సరే, అట్లాగే!.....ముందు ఈ చీరె ఎట్లా వుందో చెప్పు.

**గోపాలం :** చాలా బాగుంది!.....నువ్వు ఏ చీరె కట్టుకున్నా రంభలాగా ఉంటావు! కట్టుకోకపోతే ఇంకా –

**మదన :** ఏయ్!....(అతన్ని కొట్టడానికి పరిగెత్తి, పట్టుకోలేక) ఛీ! (బుంగమూతి పెడుతుంది)

**గోపాలం :** సారీనోయ్! చీరె నిజంగా బాగుంది – నీ బుంగమూతి అంత అందంగా!

**మదన :** చాల్లే పొగడ్తలు –

**గోపాలం :** పొగడ్త కాదు....నిజం. (దగ్గరకు వచ్చి) కొత్త చీరెను మెచ్చుకున్న సందర్భంలో ఓ చిన్న కానుక ('ముద్దు' అన్నట్టు సూచిస్తాడు)

**మదన :** (నవ్వుతూ) అమ్మో! ఇప్పుడు నీకు అటువంటి కానుకలిస్తే రేపు మా ఆయనొచ్చి ఏమంటాడు? ('తప్పు' అని సంజ్ఞ చేసి, లోపలికి పోబోతూ) అవును.....నేను వచ్చినప్పుడు ఒకటి, రెండు, మూడు – అంటూ కొలతలు వేస్తున్నావ్? రాజాగారు నీకీ కొత్త ఉద్యోగం ఇచ్చారా?

**గోపాలం :** కాదోయ్......పెళ్ళయ్యాక – సాక్షాత్తు ఈ గదిని మన పడక గదిగా వాడుకోమన్నారు రాజావారు!

**మదన :** ఆ! ఎందుకట?

**గోపాలం :** ఎందుకేమిటి? నేను రాజావారి ఆంతరంగిక కార్యదర్శిని – నువ్వు రాణిగారి ప్రాణ స్నేహితురాలివి!

**మదన :** (సాలోచనగా) ఓహో! అలాగా?

**గోపాలం :** అంతేనా? తమ పెద్దలు తరతరాల నుంచి వాడిన పేద్ద పందిరి మంచాన్ని కూడా మనల్ని వాడుకోమన్నారు... తామువాడ్డంలేదట!... అది ఇక్కడ సరిపోతుందో లేదో చూడమన్నాడు మీ బాబాయి.

**మదన :** (గోపాలం మళ్ళీ కొలవబోతూ ఉండగా) నాకేం ఇష్టంలేదు.

**గోపాలం :** ఇష్టం లేదా? రాజుగారి రాణీగారి గదుల తర్వాత ఇంత మంచి గదిలేదని–

**మదన :** (చురుగ్గా చూస్తూ) నాకిష్టం లేదని చెప్పానా?

**గోపాలం :** మీ బాబాయే చెప్పాడు.

**మదన :** నాకిష్టం లేదు అంతే!

**గోపాలం :** ఎందుకో చెప్పొచ్చుగా!

**మదన :** చెప్పకపోతే ఈ గది తీసేసుకుంటావా? (గోపాలం మాట్లాడడు) గోపాలం! రేపోమాపో మనం పెళ్ళిచేసుబోతున్నాం. నా మాటకు ఆ మాత్రం గౌరవం లేకపోతే –

**గోపాలం :** అయ్యో, గౌరవం లేకకాదు మదనా! ఈ గది ఎంత సౌకర్యంగా ఉంటుందో ఆలోచించు.

**మదన :** ఏమిటిట అంతోటి సౌకర్యం?

**గోపాలం :** మనం రాజావారి, రాణీవారి గదుల పక్కనే ఉంటాం గదా?

**మదన :** అవునుగదా!

**గోపాలం :** రాజావారు – 'ఏమోయ్ గోపాలం' – అనగానే రెండంగల్లో ఆయనముందు ఉండొచ్చు గదా!

**మదన :** –డొచ్చు గదా!

**గోపాలం :** అలాగే రాణీగారు తమ యిష్టసఖితో మాట్లాడడానికి "ఓహో! మదనా!" అనగానే –

**మదన :** రెండంగల్లో ఆవిడ ముందు ఉండొచ్చు గదా!

**గోపాలం :** ఆ! ఇహమరి నీ సందేహం దేనికి?

**మదన :** చెప్పనా?

**గోపాలం :** చెప్పు.

**మదన :** తమరు రాజావారి ఆంతరంగిక కార్యదర్శి కదా?

**గోపాలం :** (గర్వంగా) అవునుగదా!

**మదన :** వారి పనుల పురమాయింపు మీద మీరు కాంపులకు వెడుతూ వుంటారు గదా!

**గోపాలం :** (మరీ గర్వంగా) అవునుగదా!

**మదన :** అప్పుడు – ఆ అదను చూసుకుని – రాజావారు రెండంగల్లో ఈ గదిలో ఉండొచ్చు గదా! (గోపాలం నోరు తెరిచి చూస్తూ ఉంటాడు) (రెట్టిస్తూ) ఉండొచ్చు గదా!

**గోపాలం :** (గాభరాగా) గదా!

**మదన :** ఆయన మీ భార్యతో ఏకాంతంగా ఉండొచ్చుగదా?

**గోపాలం :** (ఏడుపుగొంతుతో) వచ్చుగదా!

**మదన :** అందుకని మనకీ గది వద్దు.

**గోపాలం :** మరికొంచెం వివరంగా చెప్పొచ్చుగదా!

**మదన :** ఇంకేం వివరాలు కావాలి? ....ఇదంతా రాజావారి కుట్ర! ఆయనకి నా మీద మనసుందట! రోజూ జయప్ప చేత కబురు చేస్తున్నాడు...మన పెళ్ళితో ఈ బెడద తప్పుతుందనుకున్నాను...కాని రాజావారు కోటలోనే పాగా వేద్దామనుకుంటున్నారు...మన మీద అవ్యాజమైన ప్రేమ చూపించి రాణీగారి మన్ననా పొందొచ్చు...తనకి కావలసిన వస్తువును అందుబాటులోనూ ఉంచుకోవచ్చు.

**గోపాలం :** అమ్మో! అమ్మో! ఎంత పన్నాగం!......ఎంత తీపిగా మాట్లాడాడు?

**మదన :** అదే గొప్పవాళ్ళ రాజకీయం!

**గోపాలం :** అమ్మో! అందుకా ఈ ఆర్నెల్లలో రెండు ప్రమోషన్లు!......ఆయన వ్యాపారాలన్నింటికి మానేజర్ని చేస్తాననడం! చూస్తా! చూస్తా!

**మదన :** అవేం చూడొద్దుకాని ముందు నిశ్చయతాంబూలాల సంగతి చూడు–

(లోపలనుంచి 'మదనా' 'మదనా' అని వత్సల పిలుపు)

**మదన :** అదుగో! లోపల్నుంచి వత్సల – అదే వత్సలమ్మగారు పిలుస్తున్నది. పడక గది సంగతి మరిచిపోయి ఇప్పుడు ఏం చెయ్యాలో ఆలోచించు– (ఎడమకు వెడుతుంది)

**గోపాలం :** నన్ను తక్కువ అంచనా వెయ్యకు డియర్.....పల్లెటూరి ఘటాన్ని.... దీని దుంప తెగ – ఎత్తుకు పైఎత్తు వేస్తే గాని తోచి ఏడవదు...... రాజావారూ!....... ఇహ చూసుకోండి.... కాచుకోండి...... (వాకిట్లోకి వెడతాడు)

**మదన :** (చేతినిండా బట్టలతో వస్తూ) గోపాలం! గోపాలం! అరె, ఇప్పటిదాకా ఇక్కడే వున్నాడే! మళ్ళీ ఏం తొలిచిందో! (బట్టల్ని పేము కుర్చీ మీద పడేస్తూ) వత్సలకి ఈ పిచ్చేమిటో! ఇన్ని చీరెలు, డ్రస్సులు తెచ్చింది!

ఏమన్నా అంటే – నాకో చెల్లెలుంటే ఇవి అన్నీ చెయ్యనూ అంటుంది! రాజాగారే మనుకుంటారో ఏమో–

(కిశోర్ వస్తాడు....... నూనూగు మీసాల నవయువకుడు..... ఊహాలోకంలో..... విహరించే మనిషి..... ప్రస్తుతం విచారంలో ఉన్నాడు.)

**మదన :** ఏమిటి మై డియర్ షేక్స్‌పియర్! మొహం అలా వేలవేసినావ్!...మళ్ళీ ఏ ప్రేయసయినా చెయ్యిత్తిందా?

**కిశోర్ :** నీకు వేళాకోళంగానే వుంటుందిలే!......నీకేం? నీకు నచ్చినవాడిని నువ్వు పెళ్ళాడుతున్నావ్! నేనేమో ఊరొదిలి పోతున్నాను.

**మదన :** అదేమిటి? నాకు నచ్చినవాడ్ని నేను పెళ్ళిచేసుకుంటే నువ్వూరొదిలి పోవడం ఎందుకూ?

**కిశోర్ :** రాజవారు నన్ను తక్షణం ఊరొదిలి పొమ్మన్నారు.

**మదన :** ఎందుకు? ఏమయింది.

**కిశోర్ :** నువ్వే చెప్పు. నిశ్చయంతాంబూలాలు కాగానే పార్వతీకల్యాణం నాటకం అన్నాడా గోపాలం. నేను మన్మధుడు. పాప రతీదేవి కదా! నిన్న సాయంకాలం పాపా వాళ్ళింట్లో ప్రాక్టీసు చేస్తున్నాం. ఇంతలో రాజావారొచ్చారు. నన్ను చూడగానే గుడ్లెర్రజేసి నువ్విక్కడేం చేస్తున్నావ్? రోజురోజుకీ నీ ఆగడాలు ఎక్కువైపోతున్నాయి....నువ్వు తక్షణం మీ ఊరు వెళ్ళిపో – రేప్పొద్దునకల్లా నీ మొహం నాకు కనిపించకూడదు – అన్నారు.

**మదన :** రాజగారికి కోపం ఎందుకు వచ్చినట్టు?

**కిశోర్ :** అదే నాకు అర్థం కావండంలేదు.

**మదన :** నువ్వు పాప దగ్గర ఏం కవిత్వాలు చెప్పావో ఏమో –

**కిశోర్ :** నిజంగా జరిగింది చెబితే నమ్మవేం?...మేం రిహార్సలు చేస్తున్నాం. నేను ఇట్లా పాప దగ్గరకు పోయి, ఆమె బుజంమీద చెయ్యి వేసి (అని మదన బుజంమీద చెయ్యి వేస్తాడు) ఓ ప్రాణేశ్వరీ!...ఓ నా హృదయరాణీ!... నా... హృదయ...హృదయ...చచ్చాంరా దేవుడా! (వాకిట్లో భూతాన్ని చూసినట్టు భయపడి చుట్టూ దాక్కోవడానికి చోటుకోసం పరిగెత్తి చివరకు కుర్చీ కింద దాక్కుంటాడు.)

**మదన :** చచ్చాంరా దేవుడా–నా?.......ఏమిటి నీవాగుడు? (అంటూ గుమ్మం వైపుచూసింది) (అంటూ వెనక్కి తిరిగింది.... ఎదురుగా గదిలోకి వస్తూ రాజావారు........తత్తరపడ్డది. కుర్చీకి అడ్డంగా నిలబడి కుర్చీమీద ఉన్న ఓ చీరెను కిందికి జారుస్తుంది.)

**కామరాజు :** ఏమిటి మదనా! నీలో నువ్వే మాట్లాడుకుంటున్నావ్?

**మదన :** (మాట్లాడదు)

**కామరాజు :** ఏమిటంత గాభరాగా కనిపిస్తున్నావ్? (నవ్వి) గాభరాగానే ఉంటుందిలే! పెళ్ళంటేనే పెద్ద గాభరా వ్యవహారం!..... ఏమంటావ్?

**మదన :** రాజావారు! మీరు....ఇక్కడికి!......మీకిక్కడేం పని?

**కామరాజు :** (కుర్చీలో కూర్చుంటూ) ఏమీలేదు....ఇవ్వాళ మీ నిశ్చయ తాంబూలాలు కదా! ఈ లోగా స్వయంగా నీతో ఓ విషయం మాట్లాడాలని –

**మదన :** ఇక్కడ....నాతో........మీకేం మాటలు?......వత్సలమ్మగారున్నప్పుడు రండి.

**కామరాజు :** నో.....నో.....ఆ మాటలు నీకు మాత్రమే చెప్పాల్సినవి........జయప్ప నీకు చెప్పే ఉంటాడు, నువ్వంటే నాకెంత యిష్టమో!......ఆ మాటే నీకు స్వయంగా చెప్పాలని వచ్చాను. గోపాలంతో నీ పెళ్ళికి ఒప్పుకున్నదెందుకో తెలుసా? నువ్వు నా ఎదురుగానే ఉంటావని!

**మదన :** మీరిట్లా మాట్లాడడం బాగోలేదు.........ఎవరన్నా వింటే –

**కామరాజు :** ఎవరు వింటారు?.....ఇక్కడ మనమిద్దరమే గదావున్నది!........సరే! నీకంత భయమయితే ఒంటరిగానే కలుద్దాం. నీకు నేనంటే ఏ మాత్రం యిష్టం ఉన్నా రాత్రికి అందరూ ఆటపాటల్తో హడావుడిగా ఉన్నప్పుడు – తోటలోకి రా – పొగడచెట్టు దగ్గరకి – చాలా ముఖ్యమైన విషయాలు చెప్పాలి.........

**మదన :** ఇహ మీరు వెళ్ళండి......మీకు దణ్ణం పెడతాను.

(వాకిట్లో 'రాజగోపబాల........' అన్న పాట వినిపిస్తుంది)

అయ్యో! జయప్ప వస్తున్నాడు!

(మళ్ళీ "రాజాగారు ఇటుకూడా వచ్చినట్టులేరే!" అన్న జయప్ప మాటలు)

**కామరాజు :** ఇంకెవరో కూడా ఉన్నట్టున్నారు. నువ్వు బయటకు పోయి లోపల ఎవ్వరూ లేరని చెప్పు.

**మదన :** మీరు ఇక్కడ ఉండగానా? అమ్మో!

**కామరాజు :** ఏం చేద్దాం?......ఇక్కడ దాక్కోడానికి కూడా చోటు లేదే!........ఈ కుర్చీ కింద – (అని పోబోతూ వుండగా మదన అతనికి అడ్డం వచ్చి)

**మదన :** (తరుముతూ) రాజావారూ! ఇది భావ్యంగా లేదు...ఒంటరిగా ఉన్న ఆడపిల్ల గదిలోకి వచ్చి –

(గది బయటకు వెళ్ళాలని పరిగెడతాడు కామరాజు......పాట వినిపిస్తుంది. తిరిగి వెనక్కు పరిగెత్తుకు వస్తాడు. ఇంతలో కుర్చీ కింద ఉన్న కిశోర్ కుర్చీమీదకు వచ్చి దాక్కొని చీరెలు మీద కప్పుకుంటాడు....వాకిట్లో "రాజాగారున్నారా?" అన్న పిలుపు...కామరాజు కుర్చీ కిందకు వచ్చి దాక్కుంటాడు.)

**కామరాజు :** అమ్మో! వాడొచ్చేస్తున్నాడు....వచ్చాడా చచ్చామే! (దాక్కుంటాడు)

**మదన :** అయ్యో!.......

**జయప్ప :** (వస్తూ) రాజాగారుగాని ఇటు కేసి వచ్చారేమోనని –

**మదన :** (కిశోర్ మీద చీరెలు కప్పుతూ) రాజాగారేమిటి? ఇక్కడకు రావడమేమిటి?

**జయప్ప :** కోపం వద్దు మదనమ్మా!..రాజాగారితో జరూరుపనివుంది.....ఎక్కడా కనిపించలేదు......ఇక్కడ వున్నారేమోనని –

**మదన :** రాజాగారిక్కడ ఎందుకుంటారు?......ఏమిటి మీ మాటలు?....

**జయప్ప :** కోపం తెచ్చుకోకు.....రాజాగారికి కావలసినదానివి!....

**మదన :** మాటలు జాగ్రత్తగా రానివ్వండి.....ముందు బయటకు నడవండి......

**జయప్ప :** సరేనమ్మా సరే!.......(అని వెళ్ళబోయి, వెనక్కి తిరిగి) అన్నట్టు ఇందాక కిశోర్‌బాబు ఇటు రావడం చూశాను! అతగాడేమన్నా ఉన్నాడా ఇక్కడ? ఓ జరూరు విషయం అతనికి –

**మదన :** కిశోర్ ఇటురావడం చూశారా? శుద్ధ అబద్ధం......

**జయప్ప :** ఓ కాగితాల కట్ట పట్టుకుని నీ గదిలోకి రావడం కళ్ళారా చూశాను.

**మదన :** ఇక్కడికెందుకొస్తాడు?

**జయప్ప :** ఏమో, నాకేంతెలుసు? (నసుగుతూ) అతను రాసే ప్రేమగీతాలన్నీ ఎవరి మీదో అందరికి తెలుసు....

**మదన :** జయప్పగారూ! ఇవా, మీరు ఓ పసివాడిని గురించి అనవలసిన మాటలు! జాగ్రత్త! రాణీగారితో చెప్పగలను.

**జయప్ప :** మీమీద కాకపోతే రాణీగారి మీద...రాణీగారు ఎక్కడ కనిపించినా కళ్ళప్పగించి చూస్తాడని –

**మదన :** (కోపంతో) జయప్పగారూ! ఏమిటా మాటలు? రాణీగారికి తెలిస్తే–

**జయప్ప :** ఇది నేనన్నమాటకాదమ్మా! దివాణంలో అందరూ అనుకునే మాట!

**కామరాజు :** (కోపంగా కుర్చీ కిందనుంచి బయటకు వస్తూ) ఎవడ్రా ఆ మాటలు అన్నది? ఎవడు?

**మదన :** అయ్యో!.......అయ్యో!...........

**జయప్ప :** ఆ....హా.....

**కామరాజు :** ఎవరా అన్నది? చెప్పు......

**జయప్ప :** అబ్బే!....ఎవ్వరూ అనలేదు.....ఊరికే – మదనమ్మ ఏమంటుందో చూద్దామని –

**కామరాజు :** ఇహ లాభంలేదు....జయప్పా! ఆ కిశోర్‌ను ఉన్న పళంగా వాళ్ళ ఊరు పంపెయ్.......రాణీగారి ఊరివాడు గదా అని వాడికి మా దివాణంలో చోటిచ్చాను......అతని మొహం నాకు కనిపించ కూడదు.... రామనాథంగారితో చెప్పు –

**మదన :** మధ్య అతనేం చేశాడు?

**కామరాజు :** ఏం చేశాడా? దివాణంలో వచ్చే అపవాదులన్నింటికీ కారణం అతనే!.....నిన్నటికి నిన్న! నేను తోటలోకి వెడితే – అక్కడ ముత్యాలు కూతురు పాపతో –

**మదన :** తమరు తోటలో ముత్యాలు ఇంటికి ఎందుకు వెళ్ళవలసివచ్చిందో?

**కామరాజు :** (తడబడుతూ) ఎందుకేమిటి?...అతనికేదో పని పురమాయించాలని వెళ్ళాను.

**జయప్ప :** (ఆశ్చర్యం కనబరుస్తూ) వెడితే – అక్కడ కిశోర్.....పాపతో –

**మదన :** (కోపంగా) జయప్పా!

**కామరాజు :** అతన్ని కోప్పడతావేం! నేను పనివుండి ముత్యాలు యింటికి వెళ్ళాను.....తలుపు వేసి వుంది..... ముత్యాలూ, ముత్యాలూ అని పిలిచాను. పలకలేదు. మెల్లగా తలుపు తట్టాను. తెరుచుకుంది...పాప కంగారుపడుతూ నిలుచుని వుంది........ఇంకా ఎవరో ఉన్నట్టనిపించింది నాకు......దండెం మీద ఆరేసిన బట్టల వెనక ఓ నీడ......ఆ బట్టల్ని మెల్లగా తప్పించి చూద్దునుగదా – అక్కడ – (అని కుర్చీమీద ఉన్న బట్టల్ని తొలిగిస్తాడు. అక్కడ ఒణికిపోతూ కిశోర్) ఆ! అక్కడ కాదు.......ఇక్కడ!!

**జయప్ప :** ఆహా! ఏం రసవత్తరంగా ఉంది!

**కామరాజు :** భేష్, మదనా!...అటుచూస్తే నిశ్చయతాంబూలాలా?...ఇటు ఏకాంతంలో ప్రియుణ్ణి దాచిపెట్టడం!! ఆహా! (కిశోర్‌తో) నువ్వు!.... నువ్వు!...... చూస్తే ఇరవై యేళ్ళు లేవు......అప్పుడే ప్రేమపాఠాలు. విషాదగీతాలు. దొంగతనంగా దాక్కోవడాలు.......కాని, కాని, గోపాలం నా కార్యదర్శి. అతన్ని ఇటువంటి మోసం పెళ్ళి చేసుకోనివ్వను....

**మదన :** ఇందులో మోసం ఏమిటండీ? మీరు వచ్చేటప్పటికే అతను ఇక్కడ ఉన్నాడు.....అర్ధాంతరంగా మీరు వెళ్ళిపొమ్మంటే, రాణీగారికి సిఫార్సు చేసి ఇక్కడే ఉండేటట్లు చెయ్యమని నన్ను అడగడానికి వచ్చాడు..... ఇంతలో మీరు రావడం చూసి కుర్చీ కింద దాక్కున్నాడు.......

**కామరాజు :** కుర్చీకిందనా?.......అసంభవం – నేను –

**మదన :** ఆ! మీరు దాక్కోవాలని ప్రయత్నం చేస్తున్నప్పుడే అతను కుర్చీమీదకు వచ్చి ఆ చీరెలు కప్పుకుని దాక్కున్నాడు.

**కామరాజు :** అంటే....అంటే.....నేను నీతో చెప్పిన మాటలన్నీ –

**కిశోర్ :** (వణికిపోతూ) లేదు......లేదు....మహారాజా! నాకు ఒక్క మాట కూడా వినబడలేదు.......

**కామరాజు :** ఓహ్! ఇంత జరిగాక.....నువ్వు...గోపాలాన్ని పెళ్ళిచేసుకోవడం కుదరదు.

**జయప్ప :** (మెల్లగా) నెమ్మది...నెమ్మది..నిదానమే ప్రధానం...తొందరపడకే మనసా అన్నాడు త్యాగరాజ స్వామి.......

(బయట ఎవరో వస్తున్న అరుపులు, మాటలు, నవ్వులు)

**జయప్ప :** అయ్యా! నేను సెలవు తీసుకుంటాను......(వెడతాడు)

**కామరాజు :** (కిశోర్ చొక్కా పుచ్చుకుని) వాళ్ళంతా వస్తున్నారుగా!...నీ సంగతేదో ఇప్పుడే తేల్చేస్తాను.

(రామనాధం, గోపాలం, వత్సలాదేవి ఇంకా కొందరు జనం వస్తారు.)

**గోపాలం :** అమ్మగారూ! మీరే ఒప్పించాలి రాజావారిని.

**వత్సల :** విన్నారా, రాజవారూ! మీరు నేను చెబితే వింటారని, పాపం, వీళ్ళందరికీ అపోహ! వాళ్ళడిగింది కూడా నాకు కూడా సబబుగానే కనిపించింది.

**కామరాజు :** ఏమిటది?

**గోపాలం :** ఏమీ లేదు రాజావారూ!.....మీరిద్దరూ మాకందరికీ తల్లి దండ్రుల్లాంటి వాళ్ళు –

**కామరాజు :** సంబంధాలు కలపకు. అసలు సంగతి చెప్పు.

**వత్సల :** వీళ్ళ పెళ్ళితో ఒక మంచి సంప్రదాయాన్ని మన జమీలో మొదలుపెట్టాలని –

**కామరాజు :** ఏమిటది?

**గోపాలం :** మా అందరిదీ ఒకటే కోరిక. ఈ జమీలో ఏ ఆడపిల్లకి పెళ్ళి అయినా మీ ఉభయులూ ఆ అమ్మాయికి కన్యాదానం చెయ్యాలి.

**అందరూ :** అవునండీ.......అవునండీ.......

**కామరాజు :** ఎట్లాగయ్యా? ఆ పిల్లల తల్లిదండ్రులు ఒప్పుకోవద్దూ?

**అందరూ :** అందరికీ ఇష్టమే దొరవారూ!

**రామనాధం :** అందరూ ఇది తమ భాగ్యం అంటున్నారు....

**అందరూ :** ఒప్పుకోండీ.....ఒప్పుకోండీ.......

**కామరాజు :** (గోపాలాన్ని పక్కకులాగి) నువ్వేనా వీళ్ళచేత ఈ మాటలు అనిపిస్తున్నది?

**గోపాలం :** (నవ్వుతూ మెల్లగా) మీరంటే మాకున్న భక్తి శ్రద్ధలు అటువంటివి!....

(బిగ్గరగా) ఈ సంప్రదాయం ఇవ్వాళ మా నిశ్చయతాంబూలాలతోనే ప్రారంభం కావాలని మా కోరిక......ఇంత అందమైన అమ్మాయికి కన్యాదానం చేసే అదృష్టం –

**మదన :** నా అందం సంగతి ఇందులోకి తీసుకురాకు......రాజావారి మంచితనం సంగతి చెప్పు చాలు –

**వత్సల :** నేను కూడా వాళ్ళ పక్షమేనండీ.....మన జమిందారీ ప్రజలు మనల్ని యింత మన్నన చేస్తున్నారంటే అది ఎంత గౌరవవెూ ఆలోచించండి....

**కామరాజు :** సరే, సరే! అట్లాగే కానివ్వండి.....(వత్సలతో) నీ యిష్టమే కానీ!

(అందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు – కిశోర్ తప్ప)

**గోపాలం :** ఏం కిశోర్! మొహం అట్లా పెట్టావు?......ఇదంతా నీకు ఆనందంగా లేదా?

**మదన :** పాపం! అతను చాలా విచారంలో ఉన్నాడు. రాజావారు అతన్ని వెంటనే ఇక్కణ్ణుంచి వెళ్ళిపొమ్మన్నారు.

**వత్సల :** ఏం? ఎందుకని?

**కామరాజు :** అతన్నే అడగండి....

**వత్సల :** అతనేదన్నా తప్పు చేస్తే, అతని తరుఫున నేను క్షమాపణ అడుగుతున్నాను.... మా వూరి పిల్లాడు –

**కామరాజు :** అటువంటి క్షమాపణలకు అతను తగడు.

**వత్సల :** పసిపిల్లవాడండీ!......ఈ ఒక్కసారికీ క్షమించండి.......

**గోపాలం :** క్షమించండి రాజావారూ!

**కామరాజు :** ప్రతివాళ్ళు అతన్ని క్షమించమనే వాళ్ళే!.....సరే! ఈసారికి క్షమిస్తున్నాను. కాని అతను ఇహ ఇక్కడ ఉండకూడదు.....మన హైదరాబాదు ఆఫీసుకు వెళ్ళి అక్కడ పని చేయాలి. వెంటనే –

**గోపాలం :** కనీసం మా పెళ్ళి అయ్యేదాకానన్నా –

**కామరాజు :** నేను చెప్పేది చెప్పేశాను.......ఇహ అతను దివాణంలో కనిపించ కూడదు...... జయప్పా........జయప్పా.... (రామనాథంతో) జయప్ప కనిపించడేం?

**పాప :** ఇప్పుడే ఓ బుఱ్ఱ మీసాలాయన వస్తే ఆయనతో మాట్లాడుతున్నాడు– తోటలో –

**కామరాజు :** (మొహం విప్పారించి) అట్లాగా!........(అంటూ గబగబా వెళతాడు)

**గోపాలం :** (మదనను పక్కకులాగి) ఎట్లా కొట్టాను దెబ్బ?

**మదన :** ఆ!..ఆ!...ఇల్లలకగానే పండగకాదు....

**గోపాలం :** ఇల్లూ అలుకుతాను, పండగా చేస్తాను. సరా?

**వత్సల :** మదనా! వెదదాం, పద.........(అందరూ వెడతారు. కిశోర్, గోపాలం తప్ప)

**గోపాలం :** కిశోర్! రాత్రికి నాటకంలో నీ వేషం –

**కిశోర్ :** ఎట్లా? వెంటనే వెళ్ళిపొమ్మన్నారు కదా రాజావారు!

**గోపాలం :** ఏదో ఒకతస్సా వేద్దాం......నువ్వు ఇంకో వేషం కూడా వెయ్యాలి ఈలోగా –

**కిశోర్ :** నేను సిద్ధమే!..........కాని పోర్షను?

**గోపాలం :** పాత పోర్షన్ చదివి సిద్ధంగా ఉండు. కొత్తదాని సంగతి నే చెబుతాగా! నువ్వు పాపా వాళ్ళింట్లోనే దాక్కుని వుండి నాటకం వేళకి వద్దువు గాని–

**జయప్ప :** (వస్తూ) రాజావారూ.......రాజావారూ –

**గోపాలం :** రండి రండి. యజమానీ పనిమనిషీ అంటే మిమ్మల్నిద్దర్నే చెప్పుకోవాలండీ! జయప్పా, జయప్పా – అంటూ ఆయన మీ కోసం! రాజావారూ రాజావారూ అంటూ మీరు ఆయన కోసం –

**జయప్ప :** నీ వేళాకోళేలకేం గాని – రాజావారేరీ? వారితో జరూరు పనివుంది.

**గోపాలం :** మీకు రాజవారితో జరూరు పని లేనిదెప్పుడండీ?...ఇప్పుడే తోటకేసి వెళ్ళివుంటారు..... మీరు తోటలో ఉన్నారంటేనూ –

**జయప్ప :** నేనా? ఎవరన్నారూ?......నేనసలు తోటచాయలకే వెళ్ళలేదివ్వాళ!

**గోపాలం :** ఏమోలెండీ. పొరపాటు పడివుంటారు. (జయప్ప వెళ్ళబోతూ వుండగా) జయప్పగారూ! సాయంకాలం నిశ్చయతాంబూలాల తరువాత నాటకం – మీది అందులో నారదుడి పాత్ర –

**జయప్ప :** నేను వెయ్యనయ్యా అంటే –

**గోపాలం :** అమ్మో! అట్లా అనకండి......మీ పాట, ఆట, మీ చాకచక్యం, కలహ భోజనం..

**జయప్ప :** అదుగో! అదే వద్దనేది –

**గోపాలం :** అబ్బే! ఊరికే అన్నాను.....రాత్రి నాటకంలో మీ పాత్ర అమోఘం అనుకోండి –

**జయప్ప :** సరేలేవోయ్......నవ్విన నాపచేనే పండుతుంది. (అని గబగబా వెళ్ళిపోతాడు.)

**(తెర)**

# రెండో రంగం

(వత్సల గది. వత్సల, మదన)

**వత్సల :** చివరికి రాజాగారు ఇంతకి తెగించారన్నమాట!...ఇంత బాహాటంగా! అదీ నీతో!!

**మదన :** (మాట్లాడదు)

**వత్సల :** ఆయన చపలత్వాన్ని గురించి విన్నాను. ఒకటి రెండు సార్లు చూశాను కూడా....ఏదోలే అని సరిపెట్టుకున్నాను... ఇహ దీని సంగతి తేల్చుకోవాల్సిందే!

**మదన :** మీరు తొందరపడకండి......గోపాలంతో కూడా ఆలోచించి –

**వత్సల :** పోనీ, జయప్పని పిలిచి ఉద్వాసన చెప్పేయనా?

**మదన :** ఆయనేం చేస్తాడు, పాపం! సత్తరకాయ...ఈ జయప్ప కాకపోతే మరోగురప్ప –

(వాకిట్లో అమ్మగారు, అమ్మగారూ అని గోపాలం పిలుపు. ఆ తర్వాత ప్రవేశం.)

**మదన :** ఏమిటి ఇంత ఆలస్యం?...ఏమన్నా ఆలోచించావా?

**గోపాలం :** ఆలోచించడమే కాదు.....ప్లాను ఆరంభం కూడా చేసేస్తే!

**వత్సల :** అదేమిటి?

**మదన :** ఏమిటి నీప్లాను?

**గోపాలం :** అమ్మగారూ! దీన్ని రెండుపక్కల నుంచి నరుక్కు రావాలి......రాత్రికి విందు జరుగుతూ వుండగా మదన రాజాగారిని కలవాలని రాజావారి కోరిక......కాదు కాదు.........హుకుం....సరే! అట్లాగే కలుస్తుంది.

**మదన :** గోపాలం!

**గోపాలం :** (ఆగు అన్నట్లు మదనను ఆపి) అది మొదటిది......అయితే దాన్ని తిప్పి కొట్టడానికి అదే సమయంలో రాణీగార్ని కలవడానికి ఒక మగాడు వస్తాడనుకోండి?

**వత్సల :** ఎవరు?

**గోపాలం :** ఎవ్వరూ రారు.......ఊరికే – రాజావారిని సందిగ్ధంలో పడెయ్యడానికి

ఓ ఆకాశరామన్న ఉత్తరం......రాణీగార్ని కలవడానికి ఇవ్వాళ రాత్రి ఒకడొస్తున్నాడని.

**మదన :** భలేవాడివే! ఒక అయినింటి ఆడపడుచు మీద అటువంటి అభాండాలు వేస్తే –

**గోపాలం :** అబ్బా! అది జరుగదు.....ఊరికే, రాజావారికి ఆయన సంగతి ఆయనకు తెలియచెప్పడానికే –

**వత్సల :** నీ ప్లాను బాగానే ఉంది.....కాని రాజావారు దాన్ని నమ్మి నన్ను అనుమానిస్తే – ఆయన అసలే అనుమానం మనిషి–

**గోపాలం :** అందుకోసమే కదమ్మా యీ ప్లాను....తీరా చూస్తే ఎవరూ ఉండరు.....తన భార్యని ఎవరో కలుస్తారని అనుకుంటేనే అనుమానించే మనిషి మరొకరి భార్యతో సరసాలాడ్డం –

**మదన :** ఇదంతా అయ్యే పనేనా?

**గోపాలం :** ఇంతవరకూ ఏమీ చిక్కులేదు.....ఆ తరువాతదే అసలు కష్టమైన పని....

**వత్సల :** ఇంతకంటే కష్టమైంది ఇంకోటుందా? ఏమిటది?

**గోపాలం :** మదన ఈ రాత్రికి తోటలో రాజాగార్ని కలుస్తానని ఆయనకి తెలియచెయ్యాలి.

**మదన :** చివరికి ఇదన్నమాట నీ ప్లాను! ఉత్తరం రాసి మరీ రాజాగార్ని రమ్మనడం!

**వత్సల :** రాజాగారు మదనని కలిస్తే ఇహ నీ ప్లానేమిటి?

**గోపాలం :** కలవరుగా!

**వత్సల :** మరి?

**గోపాలం :** ఈ లోగా ఎవరో ఒకర్ని మదనలాగా అలంకరించి తోటలోకి పంపుతాం.

**వత్సల :** (నవ్వుతూ) నన్ను కాదుగదా!

**గోపాలం :** ఛ......మీరే చూస్తారుగా!

**మదన :** ఎవరో చెప్పరాదూ?

**గోపాలం :** అరుగో రాత్రికి రాజాగారిని కలవబోయే మదనాదేవి గారు!!

(కిశోర్ ఓ ముసుగువేసుకుని వస్తాడు – బురఖాలో)

**కిశోర్ :** (ఆడగొంతుతో) నమస్కారమండి.

**వత్సల :** అరె! అచ్చం మదన గొంతులా ఉంది.......ఎవరు?

**మదన :** ఎవరో చెబుదూ – చంపక!

**గోపాలం :** ఆ ముసుగు తొలగించండి మదనాదేవి గారూ! (కిశోర్ ముసుగు తీస్తాడు.)

**వత్సల :** నువ్వా!

**మదన :** నువ్వు హైదరాబాద్ వెళ్ళలా?

**గోపాలం :** నేనే వెళ్ళొద్దని ఆపాను......రాత్రికి ఎట్లాగూ నాటకం ఉంది...... అందులో కూడా వెయ్యాలి –

**మదన :** మరి రాజావారు అడిగితే –

**వత్సల :** రాజావారికి కోపం వస్తే?

**గోపాలం :** మనమే ఆపామని చెపుదాం.....కాని రాత్రికి జరగబోయే సంగతుల్ని ఊహించుకోండి. ఊరిజనం....పిల్లా, పాపా అందరి ముందు రాజావారు యీ మదనా దేవిగారితో సల్లాపాలాడ్డం – జనం అంతా చూడ్డం –.....ఇహ ఆ సమయంలో రాజావారు ఎవర్నన్నా ఏమన్నా అనే స్థితిలో ఉంటారా?

**మదన :** నాకు మాత్రం భయంగా ఉంది –

**గోపాలం :** చూడు! దివాణం దివాణం అంతా మన పక్కవుంది. సరా?.....ఇహ అట్టే సమయం లేదు. ఈ లోగా ఇతనికి మదనలా వేషం వేసి పాప యింటికి పంపించండి......నేను మిగిలిన విషయాలు చక్కపెట్టుకుని వస్తాను.....(కిశోర్‌తో) మదనని ఊరికే అనుకరిస్తావుగా ఎప్పుడూ! ఇప్పుడు చూపించు నీ ప్రతాపం – (అని వెడతాడు)

**కిశోర్ :** (రాణీగారితో, భయంగా) నేను వెడతాననే అన్నానండి........ గోపాలమే –

**వత్సల :** అది సరే! రాజాగారు నిన్నెందుకు వెళ్ళిపొమ్మన్నారు? నిజం చెప్పు–

**కిశోర్ :** నిజంగా అందులో నా తప్పేమీ లేదండీ అమ్మగారూ!..పాపా, నేను పోర్షను చదువుతున్నాం. ఇంతలో రాజాగారొచ్చి కేకలేసి, వెళ్ళిపో–

అన్నారు. జయప్ప హైదరాబాదు వెళ్ళే ఆర్డరు కూడా ఇచ్చి వెళ్ళాడండీ. (అని జేబులోనుంచి కాగితం తీసి వత్సలకిస్తాడు)

**వత్సల :** (చూసి) కిశోర్‌ని పంపించెయ్యాలన్న తొందర్లో దీనిమీద సీలు వెయ్యడం కూడా మరిచిపోయారు రాజావారు! (తిప్పి ఇచ్చేస్తుంది.)

**మదన :** ఎందుకింత తొందర?

**వత్సల :** (నవ్వుతూ) నా అనుమానం నిజమైతే – కిశోర్‌లో ఓ భయంకరమైన ప్రత్యర్థిని చూశారు రాజాగారు! పాపం!

**మదన :** ఛా! వూరుకోండి అమ్మగారూ!

**వత్సల :** నిజం మదనా! (కిశోర్‌తో) సరే! అవన్నీ మరిచిపోయి...... బాత్‌రూంలోకి పోయి శుభ్రంగా మొహం కడుక్కో. కాలేజీ నాటకాల్లో మదనకున్న అనుభవమంతా ఇవ్వాళ నీకు ఆడవేషం వెయ్యడంలో కనిపించాలి...ముందు ఆ తలుపు వెయ్యి.

(కిశోర్ తలుపులేసి వస్తాడు.)

**మదన :** నేను నా గదిలోకి వెళ్ళి చీరా, జాకెట్టు తెస్తాను....నా లాగా కనిపించాలిగా ఈయన గారు! (వెడుతూ) తలుపు జాగ్రత్త (అని మరో గుమ్మంగుండా లోపలికి వెడుతుంది.)

**వత్సల :** నువ్వీలోగా మొహం కడుక్కుని రెడీగా వుండు........చీకటి పడేదాకా ఇక్కడవుండి అప్పుడు పాపా వాళ్ళింటికి వెళ్ళి దాక్కో – రాత్రికి గోపాలం పిలిచినప్పుడు రా..........

**కిశోర్ :** అట్లాగేనమ్మగారూ! (అని బాత్‌రూమ్‌లోకి వెడతాడు)

(వాకిట్లో తలుపు చప్పుడు)

**వత్సల :** ఎవరది?

**బయటినుంచి కామరాజు :** నేనే – తలుపు తియ్యి –

**వత్సల :** అయ్యో రాజావారు! ఇప్పుడు వచ్చారేమిటి? కిశోర్ రావడం చూశారా? అయ్యో! లోపల తలుపు వేసుకుని మేం యిద్దరం – అయ్యో –

**కామరాజు :** (తలుపు కొడుతూ) వత్సలా– వత్సలా –

**కిశోర్ :** అమ్మగారూ–ఎవరో తలుపు– (మొహం నిండా సబ్బుతో బయటకి వచ్చి)

**వత్సల :** (ఏడుపు గొంతుతో) ఎవరా? నా మొగుడు?

**కామరాజు :** తలుపు తియ్యవేం?

**కిశోర్ :** అమ్మో!........నా పని అయిపోయింది.....నన్నిక్కడ చూస్తే గొంతుపిసికి చంపుతారు –

(అని పరుగెత్తుకొని బాత్‌రూంలోకి పోయి దభాల్న తలుపు వేసుకుంటాడు)

(బయట తలుపు చప్పుడు)

**వత్సల :** వస్తున్నానంటే వినరేం? (వెళ్ళి తలుపు తీస్తుంది)

**కామరాజు :** (లోపలికి వచ్చి, చుట్టూ చూస్తూ) పగటి పూట కూడా తలుపులు వేసుకుని ఏం చేస్తున్నారో?

**వత్సల :** ఏముంది? ఏమీ లేదు....ఏవో చీరెలు.....నగలూ –

**కామరాజు :** ఎవరిదో మరో గొంతు వినిపించింది –

**వత్సల :** అదే –నేను, మదనా –

**కామరాజు :** మదనా? ఏది?

**వత్సల :** ఇప్పుడే...త...త...తన గదిలోకి వెళ్ళినట్టుంది.

**కామరాజు :** ఎందుకు ఊరికే గాభరా పడిపోతున్నావ్?

**వత్సల :** గాభరానా?....ఏం లేదే! (నవ్వే ప్రయత్నం చేస్తూ) నా...నా... నాకెందుకు గాభరా?

(లోపల పెద్దగా చప్పుడు)

**కామరాజు :** ఏమిటా చప్పుడు?

**వత్సల :** చప్పుడా?......నాకేం వినిపించలేదే!

**కామరాజు :** (నిదానంగా వత్సలను చూసి) ఆ నీళ్ళ గదిలో ఎవరున్నారు?

**వత్సల :** నీళ్ళగదిలోనా? అక్కడెవరుంటారండీ?

**కామరాజు :** అదే నేనడుగుతున్నాను.......ఎవరున్నారక్కడ?

**వత్సల :** ఎవరుంటారండీ?...మ...మ....మదన.....మదన ఉంది......అవీ యివీ సర్దుతూ –

**కామరాజు :** మరి మదన తన గదికి వెళ్ళిందన్నావ్!

**వత్సల :** తన గదికే వెళ్ళిందో నీళ్ళగదిలోనే వుందో–

**కామరాజు :** మదనే అయితే నీకెందుకంత కంగారు?

**వత్సల :** భలేవారే! నాకెందుకు కంగారు?

(ఈలోగా మదన తన గదినుంచి వెనక గుమ్మం ద్వారా లోపలికి వచ్చింది...... అక్కడ రాజాగార్ని చూసి సర్వమూ అర్థం చేసుకుంది. అక్కడున్న బీరువా పక్కన దాక్కుంది.)

**కామరాజు :** అయితే మదనను వెంటనే బయటకు రమ్మను......మదనా! బయటకు రా!

**వత్సల :** ఎట్లా వస్తుందండీ! బట్టలు వేసుకుంటోంది –

**కామరాజు :** అయితే మాట్టాడ్డానికేం?....మదనా! మాట్లాడు! నువ్వేనా లోపల? (మదన బీరువా వెనకాల నుంచి తొంగి చూస్తుంది) వత్సలా.......ఆ గదిలో ఎవరున్నారో నేను చూసితీరాలి.

**వత్సల :** ఏమిటండీ మీ ధాష్టీకం? మదనరాదు....ఇంకా డ్రెస్ చేసుకుంటోంది.

**కామరాజు :** (కోపంగా) చేసుకుంటున్నా సరే, వెంటనే బయటకు రావాలి.

**వత్సల :** అవ్వ!.....అవేం మాటలండీ? మీకు రాను రాను మతిపోతున్నది.

**కామరాజు :** అంటే ఆవిడరాదు......నువ్వు రమ్మనవు....అంతేనా? .......లోపల తాళం పడిపోయింది కదా అని నీ ధీమా! అంతేనా? ......ఆ గది తలుపులు బయటినుంచి తీసే డూప్లికేటు తాళాలు నాగదిలో ఉన్నాయి. క్షణంలో తెస్తాను. (వెళ్ళడానికి గుమ్మందాకా పోయి తిరిగివచ్చి) కాని ఇక్కడ ఉన్నది ఉన్నట్టుగానే ఉండాలంటే, గదిలో ఉన్నవాళ్ళు అక్కడే వుండాలంటే (వత్సలను పట్టుకుని) నువ్వు కూడా నాతో రావాలి......ఈ తలుపుకి బయట గొళ్ళెం పెట్టాలి. పద –

**వత్సల :** ఏమిటండీ ఈ పనులు?

**కామరాజు :** (వెడుతూ, నీళ్ళ గదివైపు తిరిగి) ఇహ నీళ్ళగదిలో ఉన్న మదనాదేవి గారూ! మేం వచ్చేటంత వరకు విశ్రాంతి తీసుకోండి. (వత్సలతో) ఏమంటావ్?

(ఇద్దరూ వెళ్ళిపోతారు)

(ఇంతలో బీరువా వెనకదాక్కుని ఉన్న మదన బయటకు వచ్చి, నీళ్ళ గది తలుపులు కొడుతూ)

**మదన :** కిశోర్! కిశోర్!.....నేను మదనని......తలుపు తియ్యి.

**కిశోర్ :** (తలుపు తీసి) మదనా!.......ఇప్పుడేం దారి? రాజాగారు నన్నిక్కడ చూశారంటే –

**మదన :** అందుకే నువ్వు వెంటనే ఇక్కణ్ణుంచి తప్పించుకోవాలి.

**కిశోర్ :** (తలుపులు చూస్తూ) అయ్యో! తలుపులన్నీ తాళాలు.....పారిపోవడం ఎట్లా?

**మదన :** పారిపోకపోతే నీ పని గోవింద!...ఇహ వత్సలమ్మగారి గతి –? అయ్యో!

**కిశోర్ :** కిటికీలోంచి కిందికి దూకితే?

**మదన :** మొదటి అంతస్థునుంచా? ప్రాణాల మీద ఆశలేదా?

**కిశోర్ :** ఇక్కడ ఉన్నట్టు చూస్తే రాజావారు చంపుతారు.....దూకితే నేను ఛస్తాను.....చావు తప్పనప్పుడు దూకి చావడమే మంచిది....కనీసం రాణీగారన్నా బావుంటారు (అని కిటికీలోంచి దూకిన 'ధబ్' మన్న శబ్దం)

**మదన** : కిశోర్! కిశోర్!....అయ్యో! ఇప్పుడేం చెయ్యడం? నా పెళ్ళి తాంబూలాలేంకాను?.... (అక్కడ కూలబడుతుంది. ఇంతలో చక్కని ఆలోచన వచ్చింది) ఆ! ఇప్పుడు మనం నీళ్ళ గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంటాం! రాజావారూ! ఇహ అరవండి.....తలుపులు బద్దలు కొట్టండి.....చూద్దాం –

(అని నీళ్ళ గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంటుంది.)

(కామరాజు, వత్సల వస్తారు. వత్సల చేతిలో పెద్ద తాళపు చెవుల గుత్తి.)

**కామరాజు :** గుడ్! మనం వెళ్ళేటప్పుడు ఎట్లావుందో ఇప్పుడు అట్లానే ఉంది. భేష్! నీళ్ళ గది తలుపులు మీరు తీస్తారా, నన్ను తియ్యమంటారా?

**వత్సల :** ఈ అనుమానాలేమిటండీ?....నలుగురిలోనూ నా పరువు ప్రతిష్టల సంగతే పట్టదా మీకు?

**కామరాజు :** నువ్వేమయినా అను....ఆ గదిలో ఉన్నది ఎవరో నేను చూసితీరాలి.

**వత్సల :** ఆ పని చేసేముందు, నేను చెప్పేది ఒక్క క్షణం వినండి.

**కామరాజు :** (ధాష్టీకంగా) ఏమిటది?

**వత్సల :** మీరు శాంతంగా వినాలి.

**కామరాజు :** అంటే – ఆ గదిలో ఉన్నది మదనకాదు – అవునా? (మదన మాట్లాడదు) (ఇంకా ఆవేశంగా) అవునా?

**వత్సల :** (అవునని తలూపుతుంది)

**కామరాజు :** చెప్పు...అవునా, కాదా?

**వత్సల :** అక్కడ.....ఒట్టి అమాయకుడండీ!

**వత్సల :** అమాయకుడు....పుంలింగం! ఎవడువాడు?

**వత్సల :** పసివాడండీ!

**కామరాజు :** ఎవడువాడు? పనివాడైనా, ముసలాడైనా సరే, వాడి అంతు చూస్తాను...ఎవడువాడు?

**వత్సల :** మన కిశోర్ అండీ –

**కామరాజు :** 'మన' కిశోర్! జిత్తులమారి వెధవ! అమాయకుడన్నావే!...... నేనెక్కడికి వెడితే అక్కడికి తయారు!......ఇవ్వాళ చెబుతాను వాడిపని!

**వత్సల :** మీరు కాస్తంత దాన్ని గంపెడంత చేస్తున్నారు!........ఆ కుర్రవాడిని అనుమానించకండి.....మేమే! రాత్రి నాటకంలో వేషం వెయ్యాలని ఉంచేశాం.....ఆడవేషంవెయ్యడానికి రమ్మన్నామండీ!

**కామరాజు :** ఇన్ని జరిగాక ఇంకా వాడి పక్షాన మాట్లాడుతున్నావ్!...కాసేపు ఆగితే నేనేం చేస్తానో నాకే తెలియదు....ముందు తలుపు తియ్యి –

**వత్సల :** ఆ పసివాడిని ఏమీ చెయ్యనని మాటివ్వండి –

**కామరాజు :** హు!..(అని వత్సల చేతిలోంచి తాళా గుత్తి లాక్కుని తాళం తీస్తాడు) ఇప్పుడు రారా బయటికి.....ఇవ్వాళ నీ అంతు చూస్తాను....రా, బయటికి –

(నవ్వుతూ మదన బయటకి వస్తుంది)

**మదన :** ఊ! కానివ్వండి.......మీ అంతు చూడ్డం ఏమిటో!

**కామరాజు :** నువ్వా! (మదనని, వత్సలని మార్చి మార్చి చూస్తాడు) నువ్వా లోపల! (వత్సలతో) నువ్వుకూడా ఆశ్చర్యపోయినట్టున్నావ్!! (ఆలోచించి) బహుశా లోపల ఇంకో మనిషి ఉన్నాడేమో! (అని లోపలికి వెడతాడు)

**వత్సల :** (రహస్యంగా) కిశోర్?

**మదన :** (రహస్యంగా) కిటికీలోంచి దూకి –

**వత్సల :** (రహస్యంగా) అమ్మయ్య! బతికాను........

**కామరాజు :** (వస్తూ) ఎవ్వరూ లేరే!....వత్సలా! ఎందుకు ఇంత నాటకం ఆడావు?

**వత్సల :** నన్నా అడుగుతారు!......మీ కెప్పుడూ అనుమానాలే కదా! అదేమిటో చూద్దామని –

**కామరాజు :** అనుమానం రాదా!..పొద్దున్నే ఎవడిదో ఆకాశరామన్న ఉత్తరం! ఆ వుత్తరం చూసి నా రక్తం ఉడికిపోయింది. హుటాహుటి ఇక్కడికి వచ్చాను. వస్తే ఇదీ!

**మదన :** ఉత్తరం ఏమిటీ?

**కామరాజు :** ఎవడో ఆకాశరామన్న – ఇవ్వాళ రాత్రి విందు జరుగుతున్నప్పుడు మా ఆవిడతో ఎవడో కుర్రవెధవ ప్రేమ కలాపాలు సాగిస్తాడని రాశాడు!...అనుమానం రాదూ! పైగా లోపల ఎవరున్నారో ఎంతసేపటికీ చెప్పవాయె!

**వత్సల :** అదేనండీ! మీ మనసు ఎంత వక్రంగా ఆలోచిస్తోందో చూపించడానికే!! చేసేదంతా మీరు, అనుమానాలన్నీ మా మీద!......నేనేగా మీకు లోకువ!

**కామరాజు :** క్షమించు వత్సలా!...పరిస్థితులన్నీ –

**వత్సల :** చేసేవన్నీ చెయ్యడం, ఆ తరువాత క్షమాపణలు –

**కామరాజు :** ప్లీజ్! వత్సలా – (అని రెండు చేతులూ పుచ్చుకుంటాడు) క్షమించు!

**గోపాలం :** (వస్తూ) ఏమిటి, అమ్మగారికి బాగాలేదని విన్నాను!.....(ఇద్దర్నీ చూసి) అమ్మయ్య! నేను విన్నది అబద్ధమేనన్న మాట!

**కామరాజు :** ఎంత జాలిగుండె గోపాలం నీది!

**గోపాలం :** అదేమిటండీ! మీకు బాగుండక పోతే మేం అంతా బాధపడంటండీ? సరే! అమ్మగారికి ఒంట్లో బాగుంది కనక మీరిద్దరు కిందకి రావాలి. ఊళ్ళోవాళ్ళంతా మీకోసం కాచుక్కూర్చున్నారు ...రండి రాజావారూ! (వెనగ్గా ఉండి మదనను లాగి 'కిశోర్?' అని అడుగుతాడు. కిటికీలోంచి దూకాడని సంజ్ఞచేస్తుంది. 'అమ్మయ్య' అంటాడు గోపాలం)

(అంతా బయలుదేరుతూ వుండగా ముత్యాలు వస్తాడు – చేతులో పగిలిన పూలకుండీ పట్టుకుని)

**ముత్యాలు :** దండాలండీ బాబుగారూ!

**కామరాజు :** ఏమిటి ముత్యాలూ? ఏం కావాలి?

**ముత్యాలు :** అమ్మగారూ! దండాలండీ!...మీ లోగిలికి నేనెప్పుడూ రాలేదండీ! ఇయాల జరూరు పని పడిందమ్మా!

**వత్సల :** చెప్పు.

**ముత్యాలు :** కామందుల కిటికీలకి ఇనపకడ్డీలు పెట్టించాలండీ! అందులో నుంచి ఎప్పుడేం ఇసిరేస్తారో ఆరికే తెల్దండి.

**కామరాజు :** ఏమిటా వాగుడు? అసలు విషయం చెప్పు.

**ముత్యాలు :** ఇందాక ఆ కిటికీలోనుంచి ఓ మడిసిని ఇసిరేశారండి.

**కామరాజు :** కిటికిలోనుంచా?...మనిషినా?

**ముత్యాలు :** (ఏడుస్తూ) ఈ చామంతి అంట్లు చూడండి....మీరేమో! ముత్యాలూ, నువ్వు తోటమాలివి కాదు; ఈ తోటకి కామందువే నంటారండి.....ఈ మొక్కల్నెట్టా సూసుకుంటున్నానండి! అవి నా పానంతో సమానం కాదండీ!.... మడుసులు పడి – ఇట్టా రోజుకొక్కమడి పాడయిపోతే నాకున్న పేరు ఏం కావాలండీ?...మీకు మొహమెట్టా సూపిత్తానండి? (గోపాలాన్ని మోచేత్తో పొడుస్తుంది మదన)

**గోపాలం :** రాజావారూ! పొద్దుట్నుంచీ తాగుతూనే వుంటాడండీ ఈ ముత్యాలు! ఎప్పుడేం మాట్లాడాలో తెలిసి ఏడవదు.

**ముత్యాలు :** గోపాలంబాబూ! తాగినోడు ఎప్పుడూ నిజమే చెబుతాడండీ....తాగకనేనండీ మడుసులంతా అబద్ధాలు సెప్పడం!! సత్తెప్పమానకంగా సెబుతున్నానండి – ఓ మడిసి ఆ కిటికీ లోంచి కిందపడ్డాడండి.

**కామరాజు :** ఆ మనిషిని నువు చూశావా?

**ముత్యాలు :** చూశావా అంటే చూశానండి....పట్టుకున్నాను కూడానండి.... తప్పించుపోయడు నాయాలు – (ఏడుస్తూ) ఆణ్ణి పట్టుకోవాలండీ.... కిటికీలోంచి దూకి నా మొక్కల్ని ఎందుకు పాడు చేశాడో కనుక్కోవాలండి, తమరే!

**కామరాజు :** గుర్తుపట్టగలవా అతన్ని?

**ముత్యాలు :** మొహం చూళ్ళేదండి....(అమ్మయ్య అని నిట్టూరుస్తారు గోపాలం, మదన) కాని పోలికల్ని బట్టి ఆనవోలు పట్టగల్ను బాబయ్యా!

**గోపాలం :** (మళ్ళీ మదన మోచేత్తో పొడిస్తే) భలేవాడివి ముత్యాలూ! నన్ను గుర్తుపట్టలా? నేనేగా దూకింది?

**కామరాజు :** (ఆశ్చర్యంగా) నువ్వా? ఎందుకు?

**ముత్యాలు :** కాని గోపాలం బాబుగోరూ!...నేను ఇందాక చూసినప్పటికి ఇప్పటికి బాగా ఒళ్ళు చేసినట్టున్నారు బాబూ!

**కామరాజు :** అదేమిటి?

**ముత్యాలు :** ఆకిందపడ్డాయన గోపాలం గోరికంటే సన్నం, పొట్టి – నేననుకోడం– ఆయన కిశోర్ బాబేమోనని!

**గోపాలం :** అవునులే! హైదరాబాదు వెళ్ళాడుగదా! నీ మొక్కల మీదికి దూకడానికి ఇక్కడ ప్రత్యక్షం అయివుంటాడు.

**కామరాజు :** అంతా అయోమయంగా ఉందే!....నువ్వు కిటికీలోనుంచి కిందికి ఎందుకు దూకావ్?

**గోపాలం :** ఏముందండి..నేను మదన కోసం అమ్మగారి గదికెళ్ళానండి....మీరు మాంఛి కోపంగా అరుస్తూ కనిపించారండి. నన్ను రాణీగారి గది ముందు చూస్తే ఏమనుకుంటారోనని – ఒక్కసారి కిందికి దూకేశానండి.... అబ్బ! అప్పట్నుంచి కాలు పట్టేసిందంటే నమ్మండి..... సరిగ్గా సడవనివ్వడం లేదు కూడా! (కుంటుతూ నడుస్తాడు)

**ముత్యాలు :** (ఇంకా నమ్మలేనట్లుగా) సరేలెండి....కిందపడ్డది మీరే అయితే పడ్డప్పుడు మీ జేబులోంచి ఈ కాగితం కిందపడ్డది. (ఇవ్వబోతూ ఉండగా కామరాజు లాక్కుంటాడు)

**కామరాజు :** ఈ కాగితం నీదే అయితే ఇందులో ఏముందో చెప్పు–

**గోపాలం :** అందులో....అందులో.....

**కామరాజు :** ఆ, చెప్పు (అని పక్కగా వెళ్ళి కాగితం చూసే ప్రయత్నం చేస్తాడు)

**వత్సల :** (మెల్లగా పక్కనున్న మదనతో) అది కిశోర్ ఆర్డరు కాయితం –

**మదన :** (మెల్లగా) కిశోర్ ఆర్డరు కాగితం –

**కామరాజు :** (గోపాలం దగ్గరగా వస్తూ) చెప్పు.....

**గోపాలం :** అది కిశోర్ ఆర్డర్ కాయితం.....

**కామరాజు :** తమ దగ్గర ఎందుకున్నదో?

**గోపాలం :** ఆ....అదే....చూపించడానికి యిచ్చాడు......

**కామరాజు :** తమరు తిరిగి ఇవ్వడం మరిచిపోయారు.......అవునా?

**గోపాలం :** అంతే!........ఆ, ఆ.........కాదు కాదు....

**కామరాజు :** మరి?

(వత్సల వెనకగా వెళ్ళి దానిమీద ముద్ర లేదని సంజ్ఞ చేస్తుంది. కామరాజు అటు కేసి తిరుగుతాడు. ఏమీలేనట్టు నవ్వుతుంది)

చెప్పు – అది నీ దగ్గర ఎందుకువుంది?

**గోపాలం :** అందులో.....ఏదో.....లేదన్నాడండి.....ఆ! రాజావారి ఆఫీసు ముద్రలేదు....వేయించి యివ్వమన్నాడు......

**కామరాజు :** (కోపంగా, తనలో) ఛీ!

**గోపాలం :** (ఆ కాగితాన్ని కామరాజు దగ్గరనుంచి తీసుకుంటూ) దీన్ని నేను వెంటనే కిశోర్‌కు పంపించాలి. పాపం! ఏం కష్టపడుతున్నాడో, ఏమిటో?.....అన్నట్టు నేను వచ్చిన సంగతే మరిచిపోయాను.... తాంబూలాలకి అట్టే ఆలస్యం లేదు......ఊళ్ళో జనం అంతా వచ్చారు.....మీదే ఆలస్యం –

(అందరూ వాకిట్లోకేసి నడుస్తూ వుండగా జయప్ప వస్తాడు)

**జయప్ప :** ('దొరవారూ దొరవారూ' అంటూ పిలుస్తూ, ఆదుర్దాగా వస్తూ) ఆయ్యా! మీరు వెంటనే దివాణం కచేరికి వేంచెయ్యాలి....ఒక జరూరు కేసు విచారణ చెయ్యాలి –

**గోపాలం :** అవతల ముహూర్తం దగ్గరకు వస్తుంటే ఇప్పుడు విచారణ ఏమిటయ్యా?

**జయప్ప :** అయ్యా! ఇది చాలా జరూరు! ఇక్కడివాళ్ళందరికి సంబంధించిన విషయం – (గోపాలంతో) నీకు కూడా–

**కామరాజు :** అట్లాగా! అయితే కచేరికి పనిలేదు....ఇక్కడే వింటా. ఏమిటో చెప్పు–

**గోపాలం :** ఏమిటి నారదులవారూ? అంత సంబరపడిపోతున్నారు?.. తొందరగా చెప్పండి....అవతల రాజావారికి పనివుంది.

**జయప్ప :** సంబరమే నాయనా! ఇన్నాళ్టికి నీ నిజ స్వరూపం తెలిసొచ్చిందని సంబరమే!....... ఈయనెవరో తెలుసుగదా? (అని తన వెనక వున్న మనిషిని చూపిస్తాడు)

**గోపాలం :** అది కూడా మీరే సెలవివ్వండి.

**జయప్ప :** నంగనాచిలా మాట్లాడకు......ఈయనెవరో నీకు నిజంగా తెలియదూ?

**కామరాజు :** ఏమిటోయ్? ఈయనెవరు?

**జయప్ప :** రాజావారూ! ఈయన గంగులపాలెం పోలీసు ఇన్‌స్పెక్టరు –

**ఇన్స్‌పెక్టర్ :** అయ్యా! మీరేనా రాజా కేశవచంద్ర కామరాజదేవుగారు! (గాద్గదికంగా) అయ్యా! మీ గొప్పతనం, మీ పేరుప్రతిష్టలు అన్నీ విన్నాను..నాకు న్యాయం దయచేయించండి మహాప్రభో!

**కామరాజు :** ఏమయింది? అసలు విషయం చెప్పు –

**ఇన్స్‌పెక్టర్ :** అయ్యా! ఇక్కడ ఆడంగులు ఉన్నారు...పోనీ కచేరీలో –

**జయప్ప :** అక్కరలేదు. చెప్పవయ్యా! రాజాగారే చెప్పమన్నారు కదా!

**ఇన్స్‌పెక్టర్ :** అయ్యా! మీ జమీలో చెట్టూపుట్టా కూడా మీ కీర్తిగానం చేస్తుందే, నా లాంటి సామాన్యుడికి అన్యాయం జరగడం న్యాయమా? అందులోనూ అసలు సిసలైన పోలీసువాణ్ణి. నన్నే మోసం చేసిన వ్యక్తికి మీ ఇలాకాలో పట్టం కట్టడం ఏమన్నా బావుందా?

**గోపాలం :** ఎవర్ని గురించయ్యా మహానుభావా నువ్వు చెప్పేది?....ఇంతడొంక తిరుగుడు మనిషివి నువ్వేం పోలీసు ఆఫీసరువయ్యా?

**ఇన్స్‌పెక్టర్ :** నువ్వు కాదూ దీనికంతా కారణం? ఏమీ తెలియనట్టు మాట్లాడుతున్నావ్!... నన్ను జాగ్రత్తగా చూడు..... ఈ పోలీసు డ్రస్సు వెనక ఉన్న అసలు మనిషిని చూడు..... గుర్తు పట్టావా? నేనయ్యా! గంగులపాలెం పోతునాయుణ్ణి! (గోపాలం ముఖముఖాలు చూస్తాడు) అట్లా చూస్తావేమిటోయ్. నువ్వు వరంగల్లులో ఉండగా రోజూ మాయింటికి వచ్చేవాడివి. మా చెల్లెలు వెంకటలక్ష్మి నువ్వూ

ప్రేమించుకుని, ఊళ్ళు తిరిగి, జాతర్లకి పోయి, ఊరుపొలాల మీద పాటలు పాడుకుని (విచారంగా) చివరకు మా చెల్లెలు కడుపుతో ఉంటే, చెప్పాపెట్టకుండా దాన్ని ఒదిలేసిరావడం ఏమన్నా బావుందా? గుళ్ళో ఆంజనేయస్వామి సాక్షిగా దాని మెళ్ళో తాళికట్టావ్! ఇట్లా చెయ్యడానికి నీకు మనసెట్లా ఒప్పిందయ్యా? (కంటతడి పెడ్తాడు)

**జయప్ప :** ఏమిటీ! ఈయనకి ఇది వరకే పెళ్లి అయిందా? మరి ఇక్కడికి వచ్చి మరోపెళ్ళికి తయారవుతున్నాడే! మాట్లాడరేం మహాప్రభూ?

**గోపాలం :** ఇదంతా మా పెళ్ళిచెడగొట్టడానికి ఎవరో పన్నిన పన్నాగం!......నేను వరంగల్లు వెళ్ళేవాడినే! కాని ఈయనతో కాని ఈయన చెల్లెలెతోకాని నాకేమీ సంబంధం లేదు, ఈయన్ని చూడడం ఇదే మొదటిసారి.

**ఇన్స్‌పెక్టర్ :** ఏమిటీ! మా చెల్లెలు వెంకటలక్ష్మిని కూడా ఎరగవూ?

**వత్సల :** గోపాలం! ఏమిటిది?

**గోపాలం :** గంగులపాలెం మా మేనమామగారి ఊరు. వాళ్ళు వరంగల్లులో ఉండేవాళ్ళు. నేను వాళ్ళింటికి తరుచు వెళ్ళేవాడినే! కాని ఈయనని మాత్రం ఎప్పుడూ చూడలేదు.

**మదన :** ఈయనతో పాటు వరంగల్లు వెళ్ళి ఆ వెంకటలక్ష్మిగార్నే అడిగితే సరి!

**గోపాలం :** ఆ పని చెయ్యండి. వీళ్ళ రంగు బయటపడుతుంది.

**ఇన్స్‌పెక్టర్ :** అవురా! పతివ్రతల్ని, పోలీసు వాళ్ళని అనుమానించే రోజులు వచ్చాయి గదా! అయితేయేం? మీక్కావలసిన సాక్ష్యాలన్నింటినీ యీ వూళ్ళోనే హాజరు పరచగలను మహాప్రభో! నాకు న్యాయం దయ చేయించండి.

**జయప్ప :** అవును రాజావారూ! దీన్ని మన పంచాయితీలో తేల్చుకోవలసిందే!

**వత్సల :** దీన్ని రచ్చకీడ్చడం ఎందుకండీ?

**మదన :** ఇన్స్పెక్టరుగారూ! మీరు పోలీసు ఇలాకా కదా?

**ఇన్స్‌పెక్టర్ :** అవును కదా అమ్మా!

**మదన :** మరి మరో నలుగురు పోలీసుల్ని తెచ్చి, యీనని అరెస్టు చేసి తీసుకుపోవచ్చుగా!

**ఇన్స్‌పెక్టర్ :** నిన్నటిదాకా అట్లా చేద్దామనే! కాని మా అమ్మాయి ససేమిరా అంటోందే! నలుగురిలోనూ యాగీ అయినాను. ఆ నలుగురిలోనే న్యాయం చెయ్యండి – అంటోంది కాని, పోలీసులు కోర్టులు అంటే సుతరామూ ఒప్పుకోవడం లేదండి.

**కామరాజు :** అట్లాగా! మంచి తెలివితేటలున్న అమ్మాయిలా ఉందే! అట్లాగే కానిద్దాం – జయప్పా! రామనాధంగారితో చెప్పి సాయంకాలం పంచాయితీ ఏర్పాటు చేయించు.... దీని సంగతేదో తేలేదాకా నిశ్చయతాంబూలాల సంగతి కట్టిపెట్టండి......

(అంటూ గబగబా వెళ్ళిపోతాడు.....ఆయన వెనకనే ఆనందంగా, జయప్ప, పోలీస్ ఇన్స్‌పెక్టర్ వెళ్ళిపోతారు. మిగిలిన వాళ్ళు నిర్ఘాంతపోయి నిలబడతారు.)

**రామనాధం :** (మదనతో) అయ్యో!.....అయ్యో! ఇదేమిటమ్మా!

**గోపాలం :** అయ్యో! మా నిశ్చయ తాంబూలాలు –

**రామనాధం :** ఇంకేం నిశ్చయతాంబూలాలయ్యా – (గబగబా వాకిట్లోకి వెడతాడు)

**(తెర)**

# మూడో రంగం

(పంచాయితీ జరిగే కామరాజుగారి ఆఫీసుగది...కామరాజు, సేవకుడు సింహాద్రి)

**కామరాజు :** చెప్పింది అర్థమయ్యిందా సింహాద్రీ?

**సింహాద్రి :** ఆయ్.....

**కామరాజు :** ఏం అర్థమయింది?

**సింహాద్రి :** కారు తీసుకుని అయిద్రాబాదు ఎల్లమన్నారండి........

**కామరాజు :** వెళ్ళి?

**సింహాద్రి :** మరిగల్తే...అక్కడ మనోల్లంతా ఎట్టవున్నారో సూసిబేగెల్లి రమ్మన్నారండి.

**కామరాజు :** ఓరి సన్నాసీ! అందరూ కాదురా! కిశోర్ బాబు అక్కడే ఉన్నాడేమో కనుక్కో.

**సింహాద్రి :** కిశోరుబాబేనా అండి?

**కామరాజు :** అవునురా ఏబ్రాసీ –

**సింహాద్రి :** అట్టాగేనండి.

**కామరాజు :** అక్కడే వుంటే, అక్కడికి ఎప్పుడొచ్చారో కనుక్కో.....

**సింహాద్రి :** మరిరాకపోతేనండి?

**కామరాజు :** (కోపంతో) నెత్తిన గుద్దేసుకుని తిరిగిరా. వెధవా! ఊరికే శొంఠన్నాలు చదువుతావు.....అవసరమైన పని మాత్రం చేసుకురావు.

**సింహాద్రి :** ఈ తూరి సూసుకోండి –

**కామరాజు :** ఏమిటి చూసేది?

**సింహాద్రి :** కిశోర్‌బాబు కనిపించారనుకోండి...(ధీమాగా) ఎప్పుడొచ్చారు – అని అడుగుతానండీ – (ఠీవిగా) బాబుగారు కనుక్కురమ్మన్నారు – అని కూడా అడుగుతానండి.

**కామరాజు :** అడుగుతావా?........ఆయన్నే?...(ఆయ్, ఆయ్ అంటూ వుంటాడు సింహాద్రి) ఏడవలేక పోయావ్! అక్కడ మన నాదమునిని అడుగు, కిశోర్‌బాబు వచ్చాడా, వస్తే ఎప్పుడు వచ్చాడు – అని. సంగతి తెలుసుకుని వెంటనే బయలుదేరు.

**సింహాద్రి :** ఆయ్.

**కామరాజు :** ఇహ ఫో – చూడు! మనం కిశోర్‌బాబు సంగతి వాకబు చేస్తున్నట్టు ఎవ్వరికీ తెలియకూడదు. రహస్యం.....జాగ్రత్త!

**సింహాద్రి :** నాకు తెలీదేటండీ? మీర 'రహచ్చం' అనగానే తెలిసిపోనాదండి.... ఇహ జూస్కోండి......... నా తడాఖా

(గోపాలం వచ్చాడు...)

**కామరాజు :** ఆ..ఆ..వెళ్ళు (సింహాద్రి ఆనందంగా వెడుతూ ఉంటాడు)

**గోపాలం :** ఏమిటి సింహాద్రీ! మాంఛి హుషారుగా వెడుతున్నావ్? ఎక్కడికి?

**సింహాద్రి :** ఆయ్....ఎక్కడికీ నేదండీ! దొరగోరూ...దొరగోరూ......మన నాద–

**కామరాజు :** అదే గోపాలం! మన నాద – నాదస్వరం సుబ్బారావును కేకేసుకురమ్మన్నాను.

**సింహాద్రి :** (వెనక్కి తిరిగి) అదేంటయ్యగోరూ! నాదస్వరం –

**కామరాజు :** చెయ్యమన్న పని చెయ్యవోయ్ చెవులయ్యా!...వెళ్ళు....(సింహాద్రి వెడతాడు)

**గోపాలం :** ఇప్పుడు నాదస్వరం ఎందుకు రాజావారూ! పెళ్ళితాంబూలాలకా?

**కామరాజు :** అట్లాగే అనుకో – అవి జరిగినప్పుడు –

**గోపాలం :** ఎక్కడో ఈ పెళ్ళి జరగకపోతే బావుండును – అని ఉన్నట్లుంది మీకు?

**కామరాజు :** మదన మంచి కోరేవాడిని, నాకా అభిప్రాయం ఉండడంలో ఆశ్చర్యం ఏముంది?...ఆ పోలీసు ఇన్‌స్పెక్టరు, ఆయన చెల్లెలు ఇక్కడే వున్నారు, తెలుసా?

**గోపాలం :** (అమాయకంగా) ఆ ఇన్‌స్పెక్టరు చెల్లెలు కూడా వచ్చిందాండీ?

**కామరాజు :** వచ్చిందోలేదో చూస్తావుగా!........సరే! పంచాయితీకి ఏర్పాట్లు చేశావా?

**గోపాలం :** నా మీద పంచాయితీకి నేనే ఏర్పాట్లు చేసుకుంటున్నాను కదా!...పూర్తయ్యాయి.....ఈ గది పంచాయితీ జరిగే గదే కదా! ఆ పెద్ద కుర్చీ జమిందారు గారికి.....ఇది కరణం గారికి....ఈ బెంచీలు వాద ప్రతివాదులకి.....

**కామరాజు :** చూడు గోపాలం!.....ఇప్పటికీ నువ్వన్నా, నీ తెలివితేటలన్నా నా కిష్టం. నాతో పాటు మీరు కూడా ఢిల్లీకి రండి.. అక్కడ నా ఆఫీసుకు నువ్వు మానేజరుగా ఉండు....నీవంటి వాడు పైకి పోవడానికి బోల్డు అవకాశాలు......

**గోపాలం :** ఏమిటి? పైకి – (నవ్వి) నాకంత తొందరలేదు రాజాగారూ!.....

**కామరాజు :** ఆలోచించుకో –

**గోపాలం :** నేవెళ్లి ఢిల్లీలో కూర్చుంటే – ఇక్కడ కొత్త పెళ్ళికూతురు?

**కామరాజు :** మదనా వస్తుంది...అక్కడ మన ఢిల్లీ ఇంటికి పెత్తందారుగా ఉంటుంది.

**గోపాలం :** ఇదేదో బాగానే ఉందే!

**కామరాజు :** (ఆశగా) ఆ!

**గోపాలం :** అయినా వద్దులెండి రాజాగారూ!.....నేను ఊళ్ళుపట్టుకు మీ పనుల మీద తిరుగుతూ ఉండడం, ఇంట్లో మదన ఒక్కతే –వద్దులెండి....ఆ! పంచాయితీకి టైం అవుతోంది.

**కామరాజు :** చూడు గోపాలం! నీమీద పంచాయితీ జరపడం నాకు బొత్తిగా ఇష్టం లేదనుకో!

**గోపాలం :** అమ్మమ్మ! అట్లా అనకండి!......మీరు ఎంత నిష్పక్షపాతంగా ఉండే న్యాయమూర్తులో నలుగురికీ తెలుస్తుంది కదా!....ఈ పాటికి కరణం గారు వచ్చి వుండాలే.....చూసొస్తాను.

(అని వాకిట్లోకి వెడతాడు)

**కామరాజు :** ఏమి చూసుకుని వీడికింత ధీమా?.....వీడి మాటలు వింటుంటేనే ఒళ్ళు మండుతోంది. వత్సలేమో వీళ్ళకి వెంటనే పెళ్ళి చేసేయ్యాలని!....నాకేమో ఎంత ఆలస్యం చేస్తే అంతమంచిది అని. ఈ నిశ్చయ తాంబూలాలు అయ్యేలోగా మదన మనసు ఏమిటో – తేల్చుకోవాలి......

(మదన వచ్చింది. తీరా వచ్చాక రాజాగార్ని చూసి నాలుక కరుచుకుంది)

**మదన :** రాజావారిక్కడున్నారా? (అని వెళ్ళబోయింది)

**కామరాజు :** ఏం కావాలి?

**మదన :** మీరు కోపంగా ఉన్నట్టున్నారు! ( అని వెళ్ళబోయింది)

**కామరాజు :** అబ్బే! అదేంలేదు.....ఏమిటి పని – అని.

**మదన :** రాణీగారికి తలనొప్పిగా ఉందిట.......ఇక్కడ ఆఫీసులో ఉడుకులాం చూశారుట! బాబాయినడిగి తెమ్మంటేనూ –

**కామరాజు :** రాణీగారిని ఇంత కంటికి రెప్పలా చూసుకుంటావ్! నా వంక కన్నెత్తయినా చూడవు.

**మదన :** మీరు జమిందారులు (సిగ్గుపడుతూ) మీ వంక అట్లా చూడకూడదు.

**కామరాజు :** అందరికీ జమిందారునే!.......కాని నీకు కాదు.....నీకు దగ్గర కావాలనే నా తాపత్రయం అంతా –

**మదన :** రాజాగారు అటువంటి మాటలు మాట్లాడకూడదు.

**కామరాజు :** మళ్ళీమళ్ళీ చెబుతున్నాను.....నువ్వు ఊ అంటే నా సర్వస్వం నీదే– (మదన చిరునవ్వుతో అతని వంక చూసి వెళ్ళిపోబోతుంది) మనం ఒంటరిగా కలిసి మాట్లాడుకోవడం ఎప్పుడు?...రాత్రికి ఇక్కడ విందు జరుగుతూ వుండగా – మనం తోటలో –

**మదన :** భలేవారే! ఉడుకులాం కోసం వచ్చి – వత్సలమ్మగారితో ఇక్కడ ఉడుకులాం లేదని చెబుతాను.

**కామరాజు :** జ్ఞాపకం ఉంచుకుంటావుగా!

(మదన వెడుతూవుండగా గోపాలం రెండో వైపు నుంచి వస్తాడు..)

**గోపాలం :** కరణంగారు వస్తున్నారు..(రెండోవైపున లోపలికి వెడుతున్న మదనని చూసి) మదనా! మదనా!

**మదన :** (వెడుతున్నది వెనక్కితిరిగి) మీరే గెలిచారులెండి. (అని పరిగెత్తుకు వెడుతుంది. ఆమె వెనకాలే గోపాలం కూడా లోపలికి వెడతాడు)

**కామరాజు :** "మీరే 'గెలిచారులెండి" అన్నదా? ఆ మాటనాతో చెప్పిందా, గోపాలంతోనా? గోపాలంతో "గెలిచారులెండి" అంటే – అమ్మో! వాళ్ళిద్దరూ కలిసి నన్ను ఏ రొంపిలోనో దించడం లేదు కదా?...ఆ! గోపాలాన్ని 'అండీ', 'గిండీ' అనదుగా! మదన ఆ మాటలు నాకే చెప్పింది.... ఆ సిగ్గు, ఆ రెండర్థాల మాటలు – మదనని నమ్మొచ్చో లేదో – ఆ! రాత్రికి తోటలో కలుస్తానందిగా చూద్దాం.....అదేమిటో!

మదనంటే ఈ వ్యామోహం ఎందుకో తెలియడం లేదు....ఆమె ఎంత కాదంటే అంతగా నా దాన్ని చేసుకోవాలని పిస్తోంది...చూద్దాం – రాత్రికి, తోటలో (ఆనందంగా ఎగువకు తన గదిలోకి వెడతాడు)

(వాకిట్లో నుంచి జయప్ప, కరణంగారు, పోలీసు ఇన్‌స్పెక్టర్ వస్తారు)

**జయప్ప :** అయ్యా! కరణంగారూ, ఇదే పంచాయితీ జరిగే గది.....మీరు ఈ కేసు వివరాలు కాస్త వినాలి.

**కరణం :** (మీసాలు మెలితిప్పి) ఓసోస్....సెప్పుకోండి...మే...మే...మేం ఇనుకుంటాం.

**జయప్ప :** ఈనగారిది మన పక్కవూరు గంగులపాలెం.

**కరణం :** (ఓరగా చూస్తూ) అయితే ఏటంట?

**జయప్ప :** ఆయన – వాళ్ళ చెల్లెలి పెళ్ళి విషయంలో పంచాయితీకి వచ్చారు.

**కరణం :** అది నాకు తె....తె...తెలవదా అంట? చెవులో ఊ..ఊ...ఊరికే జోరీగలాగా–

**ఇన్‌స్పెక్టర్ :** అయ్యా! మాది గంగులపాలెం –

**కరణం :** (కోపంగా) సె..సె...సెప్పినాడు గందయ్యా! ఏంది, బొత్తిగా గానం ఉన్న మడిసిలాలేవే?

**ఇన్స్‌పెక్టర్ :** అయ్యా! నేను గంగులపాలెం పోలీసు ఇన్‌స్పెక్టర్ని....

**కరణం :** పో....పో...పో...(హఠాత్తుగా తగ్గిపోయి) దండాలండి.

**జయప్ప :** ఇప్పుడు మీరు పంచాయితీ పెద్దమనిషి.....దండాలు పెట్టకూడదు....పైగా ఈనేమో ఫిర్యాదు చెయ్యడానికి వచ్చాడు.

**కరణం :** (మళ్ళీ రొమ్ము విరుచుకుని) అట్టాగంటయ్యా? ఇప్పుడు జెప్పు. ఏంది కేసు?

**ఇన్స్‌పెక్టర్ :** పెళ్ళి చేసుకుంటానని మాట ఇచ్చాడండి.

**కరణం :** (జయప్పతో) ఏమయ్యా!..ఆ వయసులో....నీ...నీ...నీకు పెళ్ళేమిటయ్యా?

**ఇన్స్‌పెక్టర్ :** ఆయనక్కాదండి పెళ్ళి –

**కరణం :** మరయితే.....నీ..నీ...నీకా? (తన తెలివికి తానే నవ్వుతాడు)

**ఇన్స్‌పెక్టర్ :** నా చెల్లెలిని పెళ్ళిచేసుకుంటానని మాట యిచ్చి, ఆమెతో స్నేహం చేసి ఇప్పుడు కాదంటున్నాడండి – గోపాలం.

**కరణం :** నాకు తె..తె...తెలుసు......తె...తెలుసు.

**ఇన్స్పెక్టర్ :** ఇక్కడేమో మరో పెళ్ళి తలపెట్టాడండీ.

**కరణం :** మరి ఒక పెళ్ళి కాదన్నాక మరో పె..పె...పెళ్ళి చేసుకోట్టయ్యా?

**జయప్ప :** కాని ఆ అమ్మాయి ఒట్టి మనిషి కూడా కాదండి......ఆ అమ్మాయికేందారి?

**కరణం :** అంత తొ...తొ...తొందర పడ్డదేం? మనిషెటువంటి వా...వా...వాడో గెహించుకోకుండా సేవితం జేసెయ్యడమే!

**ఇన్స్పెక్టర్ :** ఏదో మీరే కనికరించాలి. (అని చేతులు పట్టుకుంటాడు)

**కరణం :** మొత్తానికి పో....పోలీసు బుద్ధి పోనిచ్చుకున్నావు గాదు.

**జయప్ప :** అయ్యా! ఏదోదారి చూడాలి మీరే! మా వాడు ఘనంగా సత్కరించుకుంటాడు –

**కరణం :** కొ...కొ...కొంపదీసి ఈన నీ చుట్టమా ఏమిటి?

**జయప్ప :** చుట్టంగాదుగాని బాగా తెలిసిన మనిషి.

**కరణం :** చూద్దాం.....(రాజావారు రావడం చూసి, లేచి) నమస్కారం దొరవారూ!

(రామనాథం, ముత్యాలు, వగైరాలంతా వచ్చారు)

**కామరాజు :** ఓ! కరణంగారూ! వచ్చారా? కూర్చోండి.....అందరూ కూర్చోండి...కేసేమిటి రామనాథం గారూ?

(అందరూ కూర్చున్నారు)

**రామనాథం :** (లేచి, కాగితం చూసి చదువుతూ) అయ్యా! మీ దగ్గర ప్రయివేటు కార్యదర్శిగా పనిచేస్తున్న ఈ గోపాలంగారిమీద గంగులపాలెం యస్.ఐ పోతునాయుడు గారు కేసు తెచ్చారండి. సదరు గోపాలంగారు వీరి చెల్లెల్ని ప్రేమించి, స్నేహం చేసి ఆమె గర్భవతి అయ్యాక ఆమెను వదిలేసి ఇక్కడ మరో పెళ్ళి చేసుకోబోతున్నారనీ, అది నివారించి తమకు న్యాయం చెయ్యమనీ కేసు సారాంశం.

**కామరాజు :** (పో.ఇ.తో) అదేనా అండీ కేసు?

**ఇన్స్పెక్టర్ :** సాక్షాత్తు అంతేనండి.

**కామరాజు :** ఇంకా మీరేమయినా చెప్పుకోవలసింది ఉందా?

**ఇన్స్‌పెక్టర్ :** చిత్తం మహాప్రభో! ఏలినవారు చిత్తగిస్తే – ఈ గోపాలం మమ్మల్ని చాలా మోసం చేశాడండి.....మా చెల్లెలు అన్నివిధాలా అనాథ అయిపోయిందండీ!

**కామరాజు :** మీ చెల్లెలు వచ్చిందా?

**ఇన్స్‌పెక్టర్ :** వచ్చిందండీ....అమ్మా! లేచి అందరికి దణ్ణం పెట్టు.

**వెంకటి :** (మగగొంతుతో) దండాలండి.

**కరణం :** అబ్బా! కొ..కొ...కొంచెం మృదువుగా తల్లీ!

**కామరాజు :** అడగండి కరణంగారూ!

**కరణం :** నే....నే...నేనా?

**కామరాజు :** మీరే! అందరిలోనూ పెద్దవారు.

**కరణం :** అట్లాగే దొరవారూ!..నీ....నీ....నీ పేరేమిటమ్మా?

**వెంకటి :** ఆ! ఆ!! వెంకటి!

**కరణం :** అదేం పేరు?

**ఇన్స్‌పెక్టర్ :** అసలు పేరు వెంకటలక్ష్మి....ఇంట్లో అందరం ముద్దుగా 'వెంకటీ' అని పిలుస్తాం.

**కరణం :** ముద్దుగా! బా....బావుంది. అమ్మా! నువ్వు గో..గో....గోపాలంగారిని గుర్తుపట్టగలవా?

(అవును కాదు అని తెలియకుండా తల తిప్పుతుంది)

ఆయన్ని నువ్వు గుర్తుపట్టగలవా? (మళ్ళీ అట్లాగే తల తిప్పుతుంది) అమ్మా! ఇది ఆంగికంతో తేలే వ్యవహారం కాదు...వాచికం కావలి....నోటితో సమాధానం చెప్పు.

**వెంకటి :** ఏమో నాకు తెల్దండి......

**కరణం :** (నిర్ఘాంతపోయి) తెల్దేంటి?

**వెంకటి :** తెల్దండి.

**కరణం :** తెల్దేంటి? నువ్వాయన్తోమరి..సే...సే....సేవితం చేశావ్! ఆ..(గర్భం కూడా అన్నట్టు చేత్తో చూపించి) ఇంకా తెల్దండీ అంటావేటి?... సరిగ్గా సూడాయనొంక. (ముసుగు తొలిగించి చూస్తుంది) ఈయన్తోనేనా నువ్వు సే..సే.. సేవితం జేసింది?

**వెంకటి :** ఏమో, నాకు తెల్దండి.

**కరణం :** మళ్ళీ తెల్దంటావ్!.......(కామరాజుతో) ఇహ కేసేటుంది?

**ఇన్స్‌పెక్టర్ :** అయ్యా! అమ్మాయికి ఇట్టా పెద్దల మధ్యకు రావడం కొత్త. పోనీ నేను సమాధానం చెబుతాను.

**కరణం :** కడుపొచ్చింది నీగ్గాదు గదా, ను...ను....నువ్వేంటి జెప్పేది?

**జయప్ప :** కరణంగారూ! మీరు మరీ ఇట్లా ఇబ్బంది పెట్టేస్తే అమ్మాయి బెదిరిపోతుందండీ!

**కరణం :** పోనీ ఈయనన్నడుగుదాం. (గోపాలం వంకకు తిరిగి) గోపాలం! నువ్వు చెప్పు. ఈ అమ్మాయి నీకెంత కాలంగా తెలుసు?....

**గోపాలం :** అయ్యా! ఆయనెవరో నాకు తెలియదు...ఇందాకే మొదటిసారి చూడడం...ఇహ ఆ అమ్మాయిని ఇప్పటికీ చూడలేదు......

**కరణం :** అట్లా దులిపేసుకుంటే పోయేదిటయ్యా ను.....ను....నువ్వు చేసిన పని? ఓ ఆడకూ...కూతుర్ని, అమాయకురాల్ని చేసి (కడుపు చూపుతూ) అట్లా చేస్తే పుట్టగతులుండవయ్యా!....నిజం చెప్పు....ఆ అమ్మాయి నీకు ఎంత కా....కాలంగా తెలుసు? నిజం చెప్పక పో...పో...పోయావో, నీ మొదటి పె...పె..పెళ్ళిగురించి తేలాకే, నీ రెండో పెళ్ళి.

**గోపాలం :** అప్పుడే మొదటి పెళ్ళి, రెండో పెళ్ళి అంటారేం స్వామీ!..ఆ అమ్మాయి ఎవరో నాకు తెలియదంటే నమ్మరేం?.....పోనీ, ఆ అమ్మాయిని చెప్పమనండి.

(ఇంతలో ఒకాయన "బావా, బావా" అనుకుంటూ గబగబా వస్తాడు)

**బుద్ధుడు :** బావా...బావా.....(అతను రాగానే ఎస్.ఐ. జనం చాటున దాక్కుంటాడు)

**రామనాథం :** ఇది ఇంకో కొత్త కేసులా ఉంది...నువ్వెవరు నాయనా?

**బుద్ధుడు :** బుద్ధుణ్ణండీ...మా బావ ఇక్కడికి వచ్చాడన్నారు..ఏడీ? ఎక్కడ?

**జయప్ప :** నువ్వెవరివయ్యా? నీకిక్కడేం పని? ఇక్కడ పంచాయితీ జరుగుతోంది, కాసేపు బయటనే ఉండు.

**బుద్ధుడు :** అయ్యా! మా బావ –

**జయప్ప :** బావా లేడు గీవాలేడు వెళ్ళవయ్యా!

**బుద్ధుడు :** అట్లా అనకండి......ఇక్కడికి వచ్చాడని నిఖార్సయిన సమాచారం.....నిన్నట్నుంచీ మా అక్క ఒకటే ఏడుపు.... ప్రతిసారీ ఈన చెప్పాపెట్టకుండా ఎక్కడికో వెళ్లడం, దుర్భిణీ వేసి ఆయన్ని వెతుక్కురావడం.... అడక్కండి...బావా.....బావా –

**కామరాజు :** ఏమిటయ్యా, ఈ ప్రేలాపన....మన పోలీసుల్ని పిలిచి అప్పచెప్పండి.

**బుద్ధుడు :** ఎవరు స్వామీ తమరు?

**రామనాథం :** అవ్వ! ఆయన మా రాజావారయ్యా!

**బుద్ధుడు :** బాబూ! మిమ్మల్ని పోల్చుకోలేదు. క్షమించండి..నేను అడిగిన చాలామంది మా బావ పోలికలున్న మనిషి ఈ దివాణంలోకి వచ్చాడని చెప్పారండీ...మీరన్నట్టు పోలిసుల్ని పిలవండి..మా బావని వాళ్ళయినా పట్టుకుంటారు...ఎవరయ్యా పోలీసులూ –

**ఇన్స్‌పెక్టర్ :** (దాక్కున్నవాడు బుద్ధుడు దగ్గరకు వచ్చి) ఒరేయ్! నువ్వు ఇక్కడికెట్లా వచ్చావ్?

**బుద్ధుడు :** ఎట్లా వచ్చానా? నానా గడ్డీకరిచి వచ్చాను.....మన పాలేరు వెంకట్రాముడు చెప్పాడు నువ్వు పొద్దున కోటలో కనిపించావని. కోటలో వాళ్ళూ చెప్పారు నీలాంటి మనిషి లోపల ఉన్నాడని. ఇక్కడికెందుకు వచ్చావ్?...ఈ వేషం ఏమిటి?

**ఇన్స్‌పెక్టర్ :** వేషం ఏమిటి? నేను ఎస్.ఐని ...గంగులపాలెం ఎస్.ఐ.ని కదా?

**బుద్ధుడు :** అబద్ధాలు కూడానా?...పోలీసులూ...పోలీసులూ –

**జయప్ప :** నువ్వు ఆగవయ్యా కాసేపు...(కరణంతో) అయ్యా! మీ పని కానివ్వండి.

**కరణం :** ముందు పంచాయితీ పూర్తి కానివ్వవయ్యా! (పో.ఇ.తో) ఏమయ్యా? ఈ గో..గో..గోపాలంగారికి మీ చెల్లెలికి సంబంధం ఉందని నిరూపించగలవా?

**బుద్ధుడు :** చెల్లెలేమిటీ? ...మీలో గోపాలం గారెవరో (అందరికీ దణ్ణం పెట్టి) అయ్యా! నా మాట వినండి.

**గోపాలం :** పోనీ ఆయనేదో చెబుదామనుకుంటున్నాడు...చెప్పనివ్వండి.

**జయప్ప :** ఏమిటయ్యా చెప్పేది? ఈ బుద్ధావతారాన్ని బయటికి పంపించెయ్యండి.

**బుద్ధుడు :** రాజాగారూ!......ఈనకి చెల్లెళ్ళెవరూ లేరండీ! అంతా కట్టుకథ.

**కరణం :** మరి ఈ అమ్మాయి తనకి చెల్లెలనీ, ఇది వరకు గో..గో...గోపాలంతో సేవితం చేసి క...క...కడుపుతో ఉందనీ చెప్పాడే!

**బుద్ధుడు :** అవురా బావా! నీకు చెల్లెలుందా?....ఆవిడ కడుపుతో ఉందా? అయ్యో బాబోయ్! ఇక పిచ్చాసుపత్రే గతి?

**కామరాజు :** ఆయనకి తెలిస్తే – ఆ అమ్మాయి ఎవరో చెప్పమనండయ్యా!

**బుద్ధుడు :** ఈయన ఎవర్ని తీసుకొచ్చాడో! చూద్దాం! (బుద్ధుడు ఆ అమ్మాయి దగ్గరకు వస్తున్న కొద్దీ ఆ అమ్మాయి ముందు ఎస్.ఐ. దగ్గరకి, తరువాత జయప్ప, కరణాల దగ్గరకి వెనక్కి వెళ్ళి దాక్కుటుంది.)

**అమ్మాయి :** నాకేం తెల్దండి...నాకేం తెల్దండి. (స్టేజీ అంతా తిరుగుతుంది. చివరకు ఆ అమ్మాయి జడపట్టుకుంటే ఆ విగ్ ఊడివస్తుంది)

**బుద్ధుడు :** ఒరే నువ్వట్రా వెంకటి? నీ కిదేం పోయే కాలం?

**వెంకటి :** బావ నాలుగు డబ్బులొస్తాయిరా అంటేనూ –

**బుద్ధుడు :** ఇదండీ వరస!

**రామనాథం :** ఇదేం వరసయ్యా? బావా...బావా...అంటుందేం? అదే – అంటాడేం?

**బుద్ధుడు :** మా బావకి పద్య నాటకాలల్లో పెద్ధ పేరండి. అందులోనూ చింతామణిలో భవానీశంకరుడు... వెంకటి రాధవేషం వేసేవాడు. అందుకని బావా బావా అనడం అలవాటయింది. అయ్యా! కానీ సంపాదన లేకుండా నాటకాలలో తిరుగుతున్నాడని మొన్నరాత్రి మా అక్క తిట్టిందిటండీ! ఈన అక్కడనుంచి పారిపోయి ఇక్కడ తేలాడు.

**కరణం :** అంతేనా?.....నిజం చెప్పు – ఎందుకు వేశావ్ ఈ పగటి వేషం?

**ఇన్స్‌పెక్టర్ :** అయ్యా! ఇంట్లో పోరుపడలేక నాలుగురాళ్ళు ఎట్లా సంపాదించాలా అని నేను, వెంకటి చెరువుగట్టున కూర్చుని మథన పడుతున్నామండి...అంతలో ఈ జయప్పగారొచ్చారండి అక్కడికి.

**జయప్ప :** ఇదేమిటయ్యోవ్! ఏకంగా నా మీది కొస్తున్నావ్! నేనీయన్ని ఎరగనండి.

**కరణం :** ఎరగనంటా వేమిటయ్యా?..ను..నువ్వు కాదు ఈనకి సాయం చెయ్యమని సి..సి...సిఫార్సు చేశావు.

**జయప్ప :** ఏదో తోటి పాటగాడుకదా అని – వచ్చి అడిగితే సాయం చేస్తానన్నానుగాని –

**ఇన్స్‌పెక్టర్ :** అమ్మో! ఆయనేనండీ! ...మీ అమ్మాయిని ఈ గోపాలం గారు మోసం చేశాడని పంచాయితీలో చెప్పమన్నాడండి. మహాప్రభో! అబద్ధం ఎందుకు చెప్పాలి? మాకు కొంత డబ్బు అడ్వాన్సుగా కూడా ఇచ్చాడండి –

**జయప్ప :** (ఏడుపు గొంతుతో) ఒరేయ్..ఒరేయ్.....డబ్బు ముట్టింది స్టేజి ఎక్కనన్నావుగదరా!

**పో.ఇ. :** అది మా పద్య నాటకాల వాళ్ళ నియమం. వ్రతం చెడ్డా ఫలం దక్కాలిరా అనేవాడు మా గురువు గారు...

**కామరాజు :** మరి ఈ వేషం వేశావేం?

**పో.ఇ. :** పద్య నాటకాలకి పరపతి పోతున్నది. ఏదో ఛాన్సు దొరికింది గదా కాస్త భయపెట్టే వేషం వేద్దామనిపించి–

**కామరాజు :** ఉద్ధరించింది చాలు....ఈ వెధవ వేషాలు మాని ఏదన్నా పని చూసుకో –

(వెళ్ళడానికి లేస్తాడు)

**గోపాలం :** రాజావారూ! పంచాయితీ వారికి ఓ మనవి. ఎవరయినా పంచాయితీని మోసం చేయాలని చూస్తే వారికి పది కొరడా దెబ్బలని మన నియమం..ఆ తరువాత మీ చిత్తం.

**ఇన్స్‌పెక్టర్ :** అమ్మనాయనోయ్!...రాజాగారూ! క్షమించాలి..బుద్ధి గడ్డితిని ఈ పనికి ఒప్పుకున్నాను.

**రామనాథం :** మరి పురమాయించిన వాళ్ళకి కూడా పది కొరడా దెబ్బలని కదా మన నియమం.

**కరణం :** నిజమేనయ్యోవ్!...ఈ శిక్ష ఇవ్వాళ (జయప్పని చూపుతూ) ఈనకి ప....పడాలి.

**కామరాజు :** (మొహం పాలిపోయింది) జరిగిందేదో జరిగిపోయింది...మా గోపాలం నిర్దోషి – అని తేలిన తర్వాత ఇహ ఎవరికీ శిక్ష అవసరం లేదు...పదండి.

**కరణం :** అయ్యా! కనీసం ఈ పనిని జయప్ప ఎందుకు చే..చే...చేశాడో తెలుసుకోకపోతే, రేపు మీ మీదనే అభాండాలు వెయ్యొచ్చు. (జయప్పతో) చెప్పవయ్యా! ఎందుకు చేశావ్ ఈ దగుల్బాజీ పని?..ను....ను....నువ్వే చేశావా? ఇంకెవరన్నా చెయ్యమన్నారా?

**జయప్ప :** (రాజాగారితో) అయ్యా! ఏదీ గతి నాకు!!

**గోపాలం :** ఈ బుద్ధి ఎందుకు పుట్టిందో చెప్పు..రాజాగారు దయతలచి వదిలేస్తారు.

**జయప్ప :** చెప్పక తప్పదా ప్రభూ?

**కరణం :** తప్పదు. చె...చె.....చెప్పు.

**జయప్ప :** (కాసేపాగి) రాజావారు –

**కామరాజు :** ఏమిటి? నేనా?

**కరణం, గోపాలం :** రాజావారా?

**కామరాజు :** (కోపంతో) జయప్పా?

**జయప్ప :** కాదు ప్రభూ! రాజావారు కనికరించాలి అంటున్నాను....నిజానికి గోపాలం నన్ను లెక్కచెయ్యడని, ఎగతాళి చేస్తాడని నాకు కోపం – ఆ కోపంతో ఇట్లా చేసినందుకు రాజావారు కనికరించాలి – అని–

**కామరాజు :** (ఊపిరి పీల్చుకుని) అంతే కదా? సరే! ఇటువంటి తగాదాలని పంచాయితీ ముందుకు తీసుకురాకండి...ఇహ లేవండి. పంచాయితీ ముగిసింది.

**గోపాలం :** రాజాగారూ! ఈ గండం గడిచి బయట పడ్డాను...పెళ్ళి తాంబూలాల సంగతి మరిచిపోకండి –

**కామరాజు :** హు! (అంటూ తన గదిలోకి వెళ్ళిపోతాడు. వెంట జయప్ప)

**గోపాలం :** (బుద్ధుడితో) బాబాయ్! నన్ను కాపాడావ్! ఈ జమిందారీ పరువు కాపాడావు!

**బుద్ధుడు :** బావుందిరోయ్ గోపాలం!..నేను మా బావ ఇక్కడికి వచ్చాడంటే

వెతుక్కుంటూ రావడమేమిటి, నువ్వు గుర్తు పట్టి పలకరించడమేమిటి?..అంతా దైవ ఘటన!

**కరణం :** అదేమిటి? ఇందులో మరో పి...పి...పిట్టకథ ఉందా ఏమిటి?

**గోపాలం :** (కరణంతో) ఏమీలేదండీ! ఈ బుద్ధుడు బాబాయి పాతికేళ్ళ నాడు ఎట్లా వున్నాడో ఇప్పుడూ అట్లానే ఉన్నాడు. ఈయనా, మా మామయ్య స్నేహితులు. (బుద్ధుడితో) ఇవ్వాళ మమ్మల్ని పెద్ద సంకటం నుంచి రక్షించారు.

**బుద్ధుడు :** నిజంగా రక్షించింది నేను కాదయ్యా! మా బావ!

**గోపాలం :** అదేమిటి?

**బుద్ధుడు :** ఆయన అమాయకుడు కనకనే అట్లా బయట పడిపోయాడు. ఇదే – స్టేజి మీద నాటకాలాడే వాడు కాక నిత్య జీవితంలో నాటకాలాడేవాడు తటస్థపడి వుంటే గోపాలం ఆటకట్టేది....మా బావ పిచ్చిపని చేస్తే చేశాడు కాని, మిమ్మల్ని విడదీయలేదు.

**రామనాథం :** ఈ పెళ్ళికూతురు మా అన్నయ్యగారి అమ్మాయి. నా దగ్గరే ఉంటోంది......ఈ ఇద్దరి పెళ్ళికి మీరిద్దరూ ఉండి మా ఆతిథ్యం స్వీకరించి వెళ్ళాలి...(పో.ఇ.తో) మీ బావగారు ఈలోగా మాకు పద్యాల విందు చెయ్యాలి...

**ఇన్స్‌పెక్టర్ :** అయ్యో! దానికేం భాగ్యం! నేను పేద్ధ నటుడ్ని గనక, పేద్ధ సంభావన ఇవ్వాలి.

**రామనాథం :** అట్లాగే నిశ్చయ తాంబూలాలు ఇచ్చుకునే ముహూర్తం దగ్గరపడుతోంది..పదండి...

(అందరూ వెడతారు)

(కామరాజు చాలా కోపంగా, దూకుడుగా లోపలకు వస్తాడు)

**కామరాజు :** (చుట్టూ చూసి) ఒక్క పని సరిగ్గా చెయ్యవుకదా! ఇవ్వాళ చావు తప్పి కన్ను లొట్టపోయింది.

**జయప్ప :** అయ్యా! నాకు మాత్రం ఏం తెలుసు? ఏదో నాటకాలవాడు, బాగా నటిస్తాడనుకున్నాను కాని –

**కామరాజు :** అఘోరించలేకపోయావ్!......వాడుకాస్తా నా పేరు చెప్పివుంటే –?

**జయప్ప :** అయ్యా! వాడు చెప్పలేదని సంతోషిస్తున్నారు గాని, నేను చెప్పనందుకు పారితోషికం –

**కామరాజు :** చేసిన నిర్వాకానికి పారితోషికం కూడానా? ఈసారి ఇటువంటి పని చేస్తే నీ ఉద్యోగానికే ఉద్వాసన – జాగ్రత్త! (వాకిట్లోకి వెళ్ళిపోతాడు)

**జయప్ప :** ఆహా! ప్రభువులు అనుగ్రహిస్తే అగ్రహారాలు. ఆగ్రహిస్తే ఉద్వాసనలు...ఆ! ఈయన కోపం ఎంతసేపు? మరో అమ్మాయి కనిపించేటంత వరకేగా – (వాకిట్లోకి వెడతాడు)

**(తెర)**

# నాలుగో రంగం

(మధ్య హాలు....ఇదివరకటి కన్నా జాగ్రత్తగా సర్దబడి వుంది. ముందు ఒక డ్రెస్సింగ్ టేబుల్. మదనను అలంకరిస్తూ వత్సల)

**వత్సల :** ఏమంటున్నాడు నీ పెళ్ళికొడుకు?..అప్పుడే ఆంక్షలు పెడుతున్నాడా?

**మదన :** మగవాడి లక్షణమేగా!...అమ్మా! గోపాలానికి నేను సాయంకాలం తోటలోకి వెళ్ళడం సుతరామూ యిష్టం లేదు.

**వత్సల :** అంతేలే! తన అవసరం తీరింది కదా!

**మదన :** అది కాదమ్మా!

**వత్సల :** చూడు మదనా!...నేను మాత్రం నా ప్లాను అమలు చెయ్యవలసిందే!..చెప్పానుగా!.....రాత్రికి రాజావారిని తోటలో కలవడానికి నువ్వు వెళ్ళకపోతే మరొకరు వెడతారు.

**మదన :** అదేమిటి?

**వత్సల :** అవును. ఎవ్వరూ వెళ్ళకపోతే నేనే వెడతానేమో –

**మదన :** అమ్మో! రాజావారికి తెలిస్తే –

**వత్సల :** ఆయనకి తెలియచెప్పాలనే కదా! రాత్రంతా ఆలోచించాను....నువ్వు కాకపోతే మరొకరయినా రాజావారు చెప్పిన చోటికి వెళ్ళాల్సిందే! ఆయన్ని కలవాల్సిందే! ఇది ఒక్కటే రాజావారికి గుణపాఠం నేర్పగల మార్గం....

**మదన :** నాకర్థం కాలేదు.

**వత్సల :** ముందు నువ్వు వస్తున్నట్లుగా రాజాగారికి కబురు చెయ్యాలి.

**మదన :** ఎట్లా?

**వత్సల :** నువ్వే....ఉత్తరం రాయాలి, రాజాగారికి.

**మదన :** నేనా? ఉత్తరమా?....మళ్ళీ కొత్త చిక్కుల్లోకి –

**వత్సల :** ఏమన్నా చిక్కులు వస్తే నామీద పెట్టు. సరా?

**మదన :** అయితే ఏం చేద్దామో చెప్పండి.

**వత్సల :** ఉత్తరం రాయి......నువ్వు రాసినట్టు...

**మదన :** చెప్పండి......(టేబుల్ దగ్గర రాయడానికి కూర్చుంటుంది)

**వత్సల :** ఎక్కడ కలుద్దామని చెప్పారు రాజావారు?

**మదన :** తోటలో –

**వత్సల :** తోటలో ఎక్కడ కలవాలో మనం చెబుదాం – రాయి – "వెన్నెల రాత్రి. పొగడ చెట్టుకింద."

**మదన :** ఆ! "వెన్నెల రాత్రి. పొగడ చెట్టు కింద." ఆ తరువాత?

**వత్సల :** (నవ్వి) తరువాతా? ఇంకేం లేదు. అంతే!..ఎవరు రాశారో అన్న అనుమానం రాదు.

**మదన :** (ఉత్తరం కేసి చూస్తూ) అస్సలు రాదు.

**వత్సల :** చదువుకునే రాజావారికి ఇది ఎవరు రాశారో చక్కగా తెలుస్తుంది.

**మదన :** (నవ్వుతూ) చక్కగా తెలుస్తుంది.

**వత్సల :** ఆ ఉత్తరాన్ని మడత పెట్టి – దానికో పిన్నీసు పెట్టు....అన్నట్టు, ఆ ఉత్తరం వెనక వేపున "ఈ పిన్నీసు తిప్పి పంపాలి" అని రాయి.

**మదన :** ఎందుకు?

**వత్సల :** మరి రాజావారు ఒప్పుకున్నట్టు మనకు తెలియడం ఎలాగోయ్ మొద్దూ?

**మదన :** అమ్మో! ప్రేమ వ్యవహారాల్లో ఇంత మతలబు ఉందా?

**వత్సల :** (నవ్వుతూ) ఆ! నీకు ఉన్నచోటనే ప్రియుడు దొరికాడు కనక – ఉత్తరాలు, రాయబారాలు అక్కర్లేక పోయాయి!

**మదన :** (అలా చేసి) మరి ఉత్తరం రాజావారికి చేరడం ఎలాగా?

**వత్సల :** నువ్వే ఇస్తావు....

**మదన :** నేనా?......ఎట్లా?

**వత్సల :** (ఆలోచించి) ఆ! ఇప్పుడు తాంబూలాలు పుచ్చుకున్నాక నువ్వు పెద్దలందరికీ నమస్కారం చెయ్యాలి. అది ఆనవాయితీ. అప్పుడు అక్షింతలు యిస్తూ, ఈ ఉత్తరం కూడా ఆయన చేతిలో పెట్టు.

**మదన :** ఏమిటివ్వాళ మీరు?....ఎందుకింత పట్టుదల?

**వత్సల :** ఎందుకా? రాజాగారు జయప్ప లాంటి వాళ్ళ సాయంతో మీ పెళ్ళి జరక్కుండా చేస్తున్నారని తెలుస్తోందిగా? ఇహ ఊరుకోవడం ఎట్లా? పైగా ఆయన చిరుతిళ్ళ కోసం పడే ఆరాటం!! గట్టిగా బుద్ధి చెప్పాల్సిందే?... ఈలోగా గోపాలం చెప్పినట్టు మరో మనిషిని కూడా

పంపగలమోమో చూద్దాం. కిశోర్‌ని రమ్మని కబురు చేశాంగా!.... అతనిందుకు సిద్ధమేమో కనుక్కుందాం. పద, నా గదికి వెడదాం. (వెడతారు)

(ఆడవేషంలో కిశోర్, అతని వెంట పాప వస్తారు. ఇద్దరూ వత్సల గదివైపుకు వెడుతూ)

**కిశోర్ :** పాపా!........పొద్దున్న జరిగిన గొడవ చూశాక రాణీ గారి గదిలోకి వెళ్ళడమంటేనే భయంగా ఉంది.

**పాప :** అమ్మగారే రమ్మన్నారుగా! ఇంకా భయం ఎందుకు?

**కిశోర్ :** గోపాలమేమో నువ్వు అర్జంటుగా ఈ రాత్రికి ఓ వేషం వెయ్యాలి అన్నాడు. ఏం చెయ్యాలో చెప్పలేదు.

**పాప :** రాణీగారు పిలిచింది అందుకేనేమో –......ఆ! గోపాలం గారు చెప్పినవన్నీ జ్ఞాపకం ఉన్నాయిగా!

**కిశోర్ :** ఆ........

(ఈలోగా కామరాజు వస్తాడు 'జయప్పా' అని పిలుస్తూ)

అమ్మో! అనుకున్నంతా అయింది.....(అని పాపకు చాటుగా దాక్కుంటాడు)

**కామరాజు :** జయప్పా, జయప్పా! (వాళ్ళని చూసి) పాపా! మీరా! ఎవరి కోసం?

**పాప :** అదేనండి.....మదనమ్మ గారి కోసం –

**కామరాజు :** ఈ అమ్మాయి ఎవరు? ఇది వరకు చూసినట్టులేదే!

**కిశోర్ :** మాది మదనమ్మగారి ఊరండి.....మదనమ్మా పెళ్ళికదా!........ అందుకని –

**పాప :** ఆ! మదనమ్మగారి దగ్గరికి తీసుకుపోతున్నాను.......

**కామరాజు :** (పాపతో) నువ్వు వెళ్ళి స్నేహితులు వచ్చారని మదనతో చెప్పు...ఆవిడ రాణీగారి గదిలో ఉందనుకుంటా... ఇక్కడకు రమ్మను. (పాప కదలదు. కామరాజు దగ్గరకు పోయి ఆవిడ బుజం మీద చెయ్యివేసి వత్సల గదివైపుకు పంపుతూ) చెప్పిరా మరి. వెళ్ళు.

**పాప :** అ...ట్లా....గే.....నండి........(అని వత్సల గది వైపుకు వెడుతుంది.)

**కామరాజు :** మీది మదనా వాళ్ళ ఊరని కదూ చెప్పావ్!.....మదన గారి ఊరినిండా అందమైన అమ్మాయిలే ఉన్నారా యేం?....నీ పేరేమిటి?

**కిశోర్ :** (భయంగా) నా...... పేరేనా అండి?

**కామరాజు :** ఆ! నీ పేరే! ఎందుకంత భయం? నిన్నేమీ కొరుక్కుతిననులే.

**కిశోర్ :** నా.... పేరు.....వసంత.

**కామరాజు :** బాగుంది......మనిషికి తగ్గ పేరంటే ఇదే!...మీ ఊరినుంచి నువ్వు ఒక్కదానివే వచ్చావా?

**కిశోర్ :** అవునండీ!

**కామరాజు :** పెళ్ళి అయ్యేదాకా ఉంటావా?

**కిశోర్ :** (భయంగా తలతిప్పుతూ) ఊ!

(ఈ సంభాషణ జరుగుతున్నంత సేపూ కిశోర్ దూరంగా స్టేజి నాలుగు మూలలకూ వెళ్ళడం కామరాజు అతన్ని వెంటాడ్డం జరుగుతుంది.)

**కామరాజు :** ఈ నాలుగు రోజులూ ఇక్కడే వుండు....అందరూ పెళ్ళి పనుల్లో ఉండి పోయారా, ఒక్కరూ నాతో మాట్లాడ్డంలేదు...నువ్వు ఎంచక్కా మీ వూరి కబుర్లన్నీ చెబుదువు గాని – ఏదో ఒకటి మాట్లాడు... చూడూ! ఇక్కడ నీకేం కావాలన్నా నన్ను అడుగు.... నేనెవరో తెలుసా? (భయంగా తెలుసునని తలవూపుతాడు కిశోర్) బావుంది..... నువ్వు మా మదన ఊరి పిల్లవు కదా! అందుకని మా ఇంట్లో అమ్మాయివే!... పైగా నువ్వు చాలా అందంగా ఉన్నావు!! (కిశోర్ సిగ్గు పడతాడు)... నువ్వు చాలా అందంగా సిగ్గు పడతావు! (భుజం మీద చెయ్యి వేస్తాడు) చూడు! (పేరు కోసం తడుముకుంటూ) వసంతా! అందరూ పెళ్ళి సందడిలో ఉంటారా – మనం (అని భుజాన్ని తనవైపుకు తిప్పుకో బోతాడు)

**కిశోర్ :** అమ్మో! (అని పరిగెడతాడు)

(కామరాజు 'వసంతా! ఆగు' అని ఆమె వెనకే పరిగెత్తి జడ పట్టుకుంటాడు. అది వూడి వస్తుంది. నిర్ఘాంతపోతాడు. ఇది జరుగుతూ వుండగా వత్సల గది నుంచి వత్సల, మదన, పాప)

**కామరాజు :** నువ్వు.......నువ్వు.....నువ్వు ఇక్కడెందుకున్నావ్?

**కిశోర్ :** (నీళ్ళు నములుతూ) మ...మ..మదన, గోపాలాల పెళ్ళి –

**కామరాజు :** నిన్ను – నిన్ను – ఏం చెయ్యాలి నిన్ను?

**వత్సల :** (కంగారుగా, వస్తూ) ఏమిటండీ? ఏం జరిగింది?

**కామరాజు :** నా మాట ఖాతరు చెయ్యనివాళ్ళు నా దగ్గర ఉద్యోగం చెయ్యక్కర్లేదు. వెంటనే మీ ఊరు వెళ్ళిపో –

**పాప :** (కామరాజు దగ్గరకు వచ్చి) రాజావారూ! నా కోరిక వింటారా?

**కామరాజు :** ఎవ్వరేం చెప్పినా నేను వినను.

**పాప :** అది కాదండీ! మీరు మా ఇంటికి వచ్చిన ప్రతిసారీ నన్ను ముద్దుపెట్టుకుని "పాపా! నువ్వంటే నాకిష్టం. నీకేం కావాలన్నా అడుగు ఇస్తాను" అనేవారు.

**కామరాజు :** (పాలిపోయి) నేనా?

**పాప :** అవును...మీరేగా – ప్రతిసారీ  అట్లాగే అనేవారుగా!.....ఇప్పుడు అడుగుతున్నాను. కిశోర్‌ని క్షమించి మాకిద్దరికీ పెళ్ళి చెయ్యండి.... (కామరాజు హూంకరిస్తూ గదిమూలకు వెళతాడు)

**వత్సల :** (ఆయన్ని అనుసరిస్తూ) రాజా కామరాజ దేవ్‌గారూ! ఆ అమాయకురాలి మాటలు విన్నారుగా! నేనూ, పాప – నిజానికి అందరం ఆడవాళ్ళం ఒకటేననిపిస్తోంది నాకు.  మా అమాయకత్వం ఆధారంగా మీరు మీ యిష్టం వచ్చిన ఆటలు ఆడుతున్నారు.

**కామరాజు :** కాని వెళ్ళిపొమ్మని ఆర్డరు వేసినా ఖాతరు చెయ్యలేదంటే – పైగా ఆ ఆడవేషం –

**వత్సల :** అతను ఎక్కడకీ వెళ్ళలేదండీ! హైదరాబాదు వెళ్ళకుండా ఇక్కడే వుండేటట్లు మిమ్మల్ని అడగమని చెప్పడానికి అతనే నా గదికి వచ్చాడు పొద్దున. మీకోపం సంగతి తెలుసు కనక మీరు రాగానే బాత్‌రూమ్ కిటికీ నుంచి దూకి పారిపోయాడు.

**కామరాజు :** అతనా కిటికీలోంచి దూకింది?

**వత్సల :** ఆ! అవును...చివరికి మీ కోపానికి భయపడే – మదన వాళ్ళ పెళ్ళి తాంబూలాలకి ఆడవేషంలో రావలసి వచ్చింది.......

**కామరాజు :** సరే! సరే!....పోయి ఆ బట్టలు మార్చుకునిరా! (పాప, కిశోర్ వెడతారు)

**గోపాలం :** (వాకిట్లో నుంచి వస్తూ) రాజావారూ! పురోహితుడు, ఊరిపెద్దలు వస్తున్నారు. మీ కోసం పైకీ కిందకీ నాలుగుసార్లు పరిగెత్తాను.

**కామరాజు :** (సానుభూతిగా) చ్...చ్.....పరిగెత్తావా? పొద్దున కిందికి

దూకినప్పుడు నీ కాలు బెణికి నట్టుంది!

**గోపాలం :** (సడెన్‌గా కుంటుతూ) ఇంకా నొప్పిగానే వుంది రాజాగారూ!.. అయినా పనులు ఆగకూడదు కదా!...మీరిక్కడే వుండండి... పురోహితుల్ని, అతిధుల్నీ ఇక్కడికే రమ్మంటాను.....

**కామరాజు :** గోపాలం! పొద్దున్న ఏం జరిగిందో అదంతా మాకు తెలిసింది. కిశోరే చెప్పాడు......

**గోపాలం :** కిశోర్! అతను ....హైదరాబాదు......

**వత్సల :** (నవ్వుతూ) పొద్దున సంగతంతా రాజావారికి తెలిసిపోయింది గోపాలం!

**గోపాలం :** అమ్మయ్య! ఈ తాంబూలాల తతంగం అయిపోయాక, నేనే చెబుదామనుకున్నాను. మీరే చెప్పేశారా? నా బరువు సగం తగ్గించారు. అరుగో! రామనాధంగారు, కరణంగారు...... (పెళ్ళివారంతా వచ్చారు.)

**కామరాజు :** (తనలో) ఎంత మొండి ధైర్యం వీడికి!

**రామనాధం :** (వత్సలతో) అమ్మా! నిశ్చయ తాంబూలాలు ఇచ్చేసుకుందామా? ఆ! వధూవరులిద్దరూ చెరోపక్క నిలబడండి..

**కరణం :** రాజావారూ...ఈ పెళ్ళితో ది....ది....దివాణంలో ఓ కొత్త ఆనవాయితీ మొదలు పెట్టారటగా! పెళ్ళికూతురికి రాజావారి దంపతులు కన్యాదానం చేస్తున్నారని గో...గో....గోపాలం చెబుతున్నాడు!

**కామరాజు :** ఆ! అదేం లేదండీ!...పెళ్ళికి కావలసిన సంబారాలన్నీ దివాణం నుంచే వెడుతున్నాయి. అంతే!

**కరణం :** అంటే – రాజావారే పూనుకుని ఆడపెళ్ళివారి తరుఫున నిలబడ్డారనే కదూ! చాలా ఎన్నదగిన విషయం!

**రామనాధం :** (బుద్ధుడితో) అబ్బాయి తరుఫున మీరు పండు, తాంబూలం తీసుకుని రాజావారికివ్వండి.....అమ్మాయి తరుఫున – రాజావారూ! మీరు తాంబూలం ఇవ్వండి......

(అందరికీ అక్షింతలు ఇస్తూ గోపాలం, మదన వేరువేరుగా నమస్కారాలు చేస్తారు. మదన రాజావారికి అక్షింతలు యిస్తూ ఉత్తరం కూడా ఆయనకిస్తుంది. దాన్ని తెరవబోతూ వుండగా పిన్ను గుచ్చుకుంది రాజావారికి. 'ఉష్' అనుకున్నాడు. వత్సల,

మదన నవ్వుకున్నారు. కామరాజు పక్కకు వెళ్ళి ఉత్తరం చదువుకున్నాడు. దాన్ని ముద్దు పెట్టుకున్నాడు.)

**గోపాలం :** ఏమయితే యేం కరణంగారూ! అన్ని గండాలు గడిచి పెళ్ళికి నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నాం...ఇహ నాకో పెళ్ళాం దొరికిందని గారంటీ!

**కామరాజు :** (తనలో) నాకో ప్రేయసి దొరికినట్టు!

**ముత్యాలు :** మరి ఆలస్యం ఎందుకు? బాణా సంచా మొదలెడదాం –

**కరణం :** ఎక్కడ?.....మామూలుగా బాణా సంచా కాల్చే చోటనేనా?.. తోటలో..... పొగడ చెట్టు దగ్గర –

**కామరాజు :** (హఠాత్తుగా) అక్కడ కుదరదు.....రాణీగారికి అంత బాగాలేదు. అందుకని తోటలో కాల్చకండి. దూరంగా దివాణం వాకిట్లో కాల్చండి.

**గోపాలం :** విన్నావా ముత్యాలూ! పొగడచెట్టు దగ్గర కాదు. దివాణం వాకిట్లో–

**రామనాథం :** ముందు భోజనాలు కానివ్వండి......ఆ తరువాత బాణా సంచా – అందరూ పదండి...

(కామరాజు, పాప, కిశోర్.....వెడతారు)

**మునసబు :** గోపాలం! నిన్ను అనవసరంగా అనుమానించాను.....ఏమీ అనుకోకు...

**గోపాలం :** భలేవారే మనుసబుగారూ! మీ పని మీరు చేశారుగాని –

(అందరూ వెడుతూ వుండగా పోతునాయుడు జయప్పను తరుముకుంటూ వస్తాడు)

**జయప్ప :** (గోపాలం వెనకకు వెళ్ళి దాక్కుంటూ) నా వెంట ఇట్టా పడ్డారేమిటండీ? నన్ను వదిలిపెట్టండి మహానుభావా!

**ఇన్స్‌పెక్టర్ :** కాంట్రాక్టు ఒప్పుకున్నావ్, పూర్తి డబ్బు ఇవ్వద్దుటయ్యా?

**జయప్ప :** నేనెక్కడనుంచి తేను మహాప్రభూ?

**ఇన్స్‌పెక్టర్ :** అంత ఇవ్వలేనివాడివి – ఈ మధ్యవర్తి పని ఎందుకు అఘోరించావ్?

**జయప్ప :** అయ్యా! బుద్ధి గడ్డి తిని చేశాను....సరా?

**మునసబు :** ఏమిటయ్యా? దేన్ని గురించి మీ పోట్లాట?

**బుద్ధుడు :** ఏమిటి బావా ఇదంతా? పంచాయితీ అయినప్పటి నుంచీ కనపడలేదు... ఎక్కడికి పోయావ్?

**జయప్ప :** నన్ను ఊరంతా తరుముతూ ఉంటే మీకెక్కడ కనిపిస్తాడండీ? పంచాయితీ అయింది. ఇహ నాకు ఊపిరి సలపనివ్వడే!......నాకు ప్రాణదానం చెయ్యండి మహాప్రభూ!

**గోపాలం :** అసలు సంగతి చెప్పండి –

**ఇన్స్పెక్టర్ :** ఏమిటయ్యి ఇంకా చెప్పేది? ఇంత డబ్బు ఇస్తామని కాంట్రాక్టు ఒప్పుకుని, తీరా పని జరిపించుకున్నాక ఎగ్గొట్టడం ఏం పెద్దమనిషి తరహానయ్యా?

**జయప్ప :** నేనెక్కడనుంచి తీసుకురానండీ? ఈ వ్యవహారం ఇట్టా బెడిసి కొట్టాక ఇహ రాజావారు నన్ను దగ్గరకు రానిస్తారుటండీ?

**బుద్ధుడు :** బావా! ఆయనేం చేస్తాడు చెప్పు. రాజావారి మెరమెచ్చుల కోసం ఈ పని చేశాడుగాని –

**జయప్ప :** అయ్యా! నిజం చెప్పారు. చచ్చి నీ కడుపున పుడతాను....

**బుద్ధుడు :** అంతపని చెయ్యకండి కాని –

**ఇన్స్పెక్టర్ :** నాటకాలు కాంట్రాక్టు తీసుకున్న వాడూ ఎగ్గొట్టి, ఇక్కడ నాటకం ఆడమని పిలిచినవాడూ ఎగ్గొడితే – ఇహ స్టేజీ మీద నాటకాలకి, జీవితంలో నాటకాలకి తేడా ఏముందయ్యా?

**గోపాలం :** అయ్యా! మీ మధ్య ఈ పోట్లాటలెందుకుగాని – (పోతునాయుడుతోను, జయప్పతోను) పెళ్ళినాటి రాత్రికి మీరిద్దరూ కలిసి నాటకం వెయ్యండి. (పోతునాయుడుతో) ఆ తరువాత మీకు ఘనసన్మానం! సరా?

**ఇన్స్పెక్టర్ :** ఆ మాటన్నావ్, బ్రహ్మాండంగా ఉంది. ఇహ పదవయ్యా! జయప్పా! మన తడాఖా చూపిద్దాం –

**గోపాలం :** ముందు ఆ తడాఖా భోజనాల మీద చూపించండి....పదండి....

(అందరూ వెడుతూ ఉంటారు.....వెనకనే గోపాలం వెళ్ళబోతూ వుండగా పాప అడుగులో అడుగు వేసుకుంటూ వస్తుంది)

**గోపాలం :** ఏయ్ పాపా! ఇక్కడేం చేస్తున్నావ్?..

**పాప :** నేను ఒకరి కోసం వెతుకుతున్నాను.

**గోపాలం :** కిశోర్ కోసమా?

**పాప :** ఉహూ! కిశోర్ ఎక్కడున్నాడో నాకు తెలుసు.....(గొంతు తగ్గించి)

మదనక్క కోసం చూస్తున్నాను.

**గోపాలం :** ఎందుకు?

**పాప :** (కాసేపు ఆలోచించి) ఆ! నీకు చెప్పకూడదులే!....అయినా కాబోయే మొగుడివిగా! నీకు చెప్పొచ్చు.....అక్కకి ఈ పిన్నీసు ఇవ్వాలి.

**గోపాలం :** పిన్నీసా? పిన్నీసుతో – (ఆలోచించి) పాపా! అప్పుడే నువ్వు పెద్ద వ్యవహర్త వయిపోయావే!....ఏ పని చెప్పినా బ్రహ్మాండంగా చేస్తావు!

**పాప :** నాకు తెలుసులే! నన్ను ఉడికిస్తున్నావు!

**గోపాలం :** లేదు పాపా!.....నిజంగానే చెబుతున్నాను...నువ్వు చెప్పకపోతే నాకు తెలియదనుకున్నావా? ఆ పిన్నీసు రాజావారిచ్చారు అక్కకివ్వమని! అవునా?

**పాప :** అయితే నన్నగడమెందుకు?

**గోపాలం :** నువ్వేమంటావో చూద్దామని......రాజాగారే స్వయంగా అడిగినప్పుడు కాదనడం తప్పుకదా?

**పాప :** ఆ! రాజావారు నా దగ్గరకొచ్చి "పాపా! ఈ పిన్నీసు మీ మదన అక్కకి ఇచ్చి పొగడచెట్టు ఖాయం" అని చెప్పమన్నారు. అంతే!

**గోపాలం :** పొగడ –

**పాప :** ఆ! పొగడచెట్టే!...."ఈ పిన్నీసు మీ అక్కకి ఇస్తున్నట్టు ఎవ్వరికీ తెలియకూడదు" అని కూడా అన్నారు.

**గోపాలం :** అవును పాపా!.....ఎవ్వరికీ తెలియకుండా యివ్వు – చివరికి నాకు కూడా –

**పాప :** ఎందుకివ్వను?......(అని ఎగురుకుంటూ వెళ్ళిపోతుంది)

**గోపాలం :** కామరాజూ! ఎంత నాటకం ఆడుతున్నావ్!....మదన! ఒప్పుకుందా?.....రాత్రికి! పొగడ చెట్టు కింద!! చూద్దాం – మదన కామరాజుల ప్రేమకథ!!

**(తెర)**

# అయిదో రంగం

(విశాలమైన తోట....చెట్లు, పొదలు.....రెండు పక్కలా లతలు అల్లుకున్న ఆర్చీలు......వెలుగు ఎక్కువగా లేదు.)

**పాప :** (చేతిలో కారియర్, మర చెంబు పట్టుకుని అటూ ఇటూ చూస్తూ వస్తుంది.)

ఎడం చేతి పక్క పందిరి కింద ఉంటానన్నాడు కిశోర్....ఇటే అయివుండాలి..... పాపం! రాజాగారు కోప్పడ్డ తరువాత మెతుకు ముట్టలేదు....

(ఇంతలో గోపాలం రెండో పక్క నుంచి వస్తాడు. అతనూ ఎవరికోసమో వెతుకుతున్నాడు.)

అయ్యో! గోపాలం గారు ఇటే వస్తున్నారు......(అంటూ ఎడమకు వెడుతుంది)

**గోపాలం :** (తనలో) అనుమానం అంత భయంకరమైన జబ్బు ఈ ప్రపంచంలోనే లేదు కదా!..క్షణం ఒక్కచోట ఉండనివ్వదే!...ఒక పక్క మదన ఇట్లా చేస్తుందా – అని. మరో పక్క ఉత్తరం, పొగడచెట్టు, పిన్నీసు. (తలకొట్టుకుని) ఛీ!...అట్లా అనుకోకూడదని ఎంత అనుకున్నా.......ఈ వెధవ మనసు ఊరుకుంటేనా? (ఎవరో వస్తున్న చప్పుడు) ఎవరో వస్తున్నట్టున్నారు.......(ఎడమవైపున దాక్కుంటాడు.)

(మరో వైపునుంచి వత్సల, మదన ఒకరి వేషం, తలకట్టు, శాలువా మరొకరు ధరించి.)

**మదన :** (మెల్లగా) గోపాలం కూడా ఇటే వచ్చాడని రామనాథం బాబాయి చెప్పాడు.

**వత్సల :** ష్! మెల్లగా! నేనూ చూశాను.

**మదన :** ఒకాయన ప్రేమ పరిశోధనకి, మరొకాయన నేర పరిశోధనకి! – ఏం మగాళ్ళు!.......ఇహ మన నాటకం మొదలు పెడదామా?

**వత్సల :** ఊ! కానీ –

**మదన :** (బిగ్గరగా) అమ్మగారూ! అట్లా వణుకుతున్నారు! చలిగా ఉందా?

**వత్సల :** (బిగ్గరగా) అప్పుడే చల్ల బడ్డది....నేను లోపలికి వెడుతున్నాను.

**మదన :** మీరు లోపలికి వెళ్ళండి....నేనట్లా చల్లగాలికి తిరిగొస్తాను.

**గోపాలం :** (తనలో) చల్లగాలికి ప్రేమవిహారం! చూస్తాగా!!

**వత్సల :** జాగ్రత్త! రాత్రిపూట! తోటలో పాములు, తేళ్ళూ ఉంటాయి.

**మదన :** వాటికి అందకుండా నడవడం నాకు అలవాటేనమ్మగారూ!

**వత్సల :** చూస్తూ చూస్తూ పులినోట్లో తల పెడతానంటే నేనే చేస్తాను!...నేను మాత్రం లోపలికి వెడుతున్నాను.

(మదన గోపాలం వెళ్ళిన వైపుకు వెళ్ళింది. రెండో పక్కకి వత్సల)

**కిశోర్ :** (ఆనందంగా) కలవరమాయే మదిలో, నా మదిలో – (పాడుతూ వత్సల వైపుకు వెడతాడు)

**వత్సల :** ఈ కిశోర్ ఇటేవస్తున్నాడు...ఇతనికసలే నోటి తొందర – నన్ను మదన అనుకుంటే చచ్చామే –

**కిశోర్ :** పాప ఎక్కడుందబ్బా?....అరె! ఇక్కడెవరో కూర్చున్నట్టుగా ఉంది..... అరె, మదన!

**వత్సల :** అయ్యో! ఇతని కంట పడనే పడ్డాను... భగవంతుడా!..... ఇటేవస్తున్నాడు.... ఈ లోగా రాజాగారు రారుగదా!

**కిశోర్ :** ఆ! మదనే! (దగ్గరకు వచ్చి) మదనా! (అని చెయ్యిపుచ్చుకుంటాడు)

**వత్సల :** వెళ్ళిపో. తొందరగా – గోపాలం వస్తాడు.......

**కిశోర్ :** ఆ! గోపాలమేగా?....ఇటు తిరుగు.....మాట్లాడు.

**కామరాజు :** (వెనకనుంచి వస్తూ) అక్కడ కూర్చున్నది మదనే కదూ! నాకంటే ముందే వచ్చిందే!

**కిశోర్ :** నువ్వు ఇక్కడ వున్నది గోపాలం కోసం కాదులే!

**వత్సల :** మరి?

**కిశోర్ :** రాజావారి కోసంలే! పొద్దున కుర్చీ కింద ఉండి అంతా విన్నానుగా!

**కామరాజు :** అడుగో! మళ్ళీ ఆ పిల్ల వెధవ కిశోర్‌గాడు – ఇక్కడ కూడా –

**వత్సల :** కిశోర్! దయ చేసి వెళ్ళిపో.

**కిశోర్ :** నువ్వు వచ్చింది రాజాగారికోసమో, కాదో చెప్పు. వెడతాను.

**కామరాజు :** వీడి సంగతి ఇక్కడే తేల్చెయ్యాలి......(ముందుకు వెడతాడు)

**గోపాలం :** వినిపించి ఏడవడం లేదు.....(ముందుకు వెడతాడు)

**కామరాజు :** (గొంతు తగ్గించి, కోపంతో) ఒరేయ్!

**కిశోర్ :** అమ్మో! రాజావారు! (అని పరిగెత్తుతాడు)

**కామరాజు :** నువ్వు ఇక్కడా దాపురించావ్? (అని ఒక్క చెంపకాయ కొడతాడు.)

(అప్పటికే కిశోర్ పరిగెత్తాడు. ఆ దెబ్బ గోపాలానికి తగిలింది.)

**గోపాలం :** అబ్బ! దొంగచాటుగా పొంచి చూడ్డం అంత వెధవ పని లేదనుకో!

**కామరాజు :** (వత్సలనే మదన అనుకుని) ఇక్కడకూడా ఈ కుర్రవెధవ తయారు! ఇదేం మనిషివీడు! చెంపదెబ్బ తిని నవ్వుతూ వెడతాడు....సరే, సరే! అవన్నీ మరిచిపోదాం.....మదనా! నువ్వు వచ్చావ్! నాకు ఎంత ఆనందంగా ఉందో తెలుసా?

**వత్సల :** (మదనలా మాట్లాడుతూ) నేను వస్తాననే అనుకున్నారా?

**కామరాజు :** అంత అందమైన ఉత్తరం పంపాక రాకుండా ఎట్లా వుంటావు? మదనా? (ఆమె చేతిని చేతిలోకి తీసుకుని) ఎందుకూ నీ చెయ్యి అలా ఒణుకుతుంది?

**వత్సల :** భయం!

**కామరాజు :** ఎందుకు నేనుండగా? (అని చేతిని ముద్దు పెట్టుకుంటాడు)

**వత్సల :** (చేయిలాగివేస్తూ) అప్పుడే అంత చొరవా?

**గోపాలం :** (తొంగిచూస్తూ, తనలో) కామరాజూ! నేనిక్కడే వున్నాను!!

**కామరాజు :** (మళ్ళీ చెయ్యితీసుకుని) ఎంత మృదువుగా ఉంది ఈ చెయ్యి?

**వత్సల :** రాణీగారి చెయ్యికంటేనా?

**కామరాజు :** (విననట్లుగా) ఈ వేళ్ళు.....మృదువుగా – దృఢంగా – చిలిపిగా – (మళ్ళీ ముద్దుపెట్టుకుంటాడు)

**వత్సల :** మీరు నన్ను అంతగా ప్రేమిస్తున్నారా?

**కామరాజు :** ప్రేమించడమా? ఆరాధిస్తున్నాను. లేకపోతే, ఇంతరాత్రివేళ, ఇక్కడ–

**వత్సల :** ఆవిడని, అదే – రాణీగారిని – ప్రేమించడంలేదా?

**కామరాజు :** లేదా – అంటే ప్రేమిస్తున్నాను. కాని వివాహం ఆ ప్రేమని గౌరవప్రదం చేసింది.

**వత్సల :** అంటే?

**కామరాజు :** అంతే!

**వత్సల :** పోనీ, ఆవిడ నుంచి మీరేం కావాలనుకుంటున్నారు? ఆవిడకన్నా నేనెందులో గొప్ప?

**కామరాజు :** (ఆమె బుజంమీద చెయ్యి వేసి) చెప్పలేను....బహుశ: మార్పు లేకుండా ఒకటే రకంగా ఉండిపోవడమనుకుంటాను. నీలాగా ఉత్సాహం, ఆకర్షణ, చిలిపితనం – బహుశా భార్యలంతా – మేం మొగుళ్ళని ప్రేమిస్తున్నాం కదా, ఇంకేం కావాల్లే – అనుకుంటారను కుంటాను. కాని ఆ ప్రేమను వ్యక్తం చేసే ప్రయత్నం చెయ్యరు.... మగవాడికి ఆవ్యక్తం చెయ్యడం కావాలి.

**వత్సల :** ఎట్లాగో?

**కామరాజు :** ఎట్లాగో ఏమిటి? గికురించి కవ్వించడం, ఓర చూపుల్తో అలరించడం, ప్రతిక్షణం కొత్తగా ప్రేమను చూపించడం–

**వత్సల :** ఆ! (తనలో) నాకు చక్కని గుణపాఠం నేర్పారు!

**కామరాజు :** మదనా! నిజం చెప్పనా? వత్సల నన్ను ప్రేమిస్తోంది. నాకు తెలుసు.... కాని నిస్తబ్ద ప్రేమ ఎవరికి కావాలి? కొత్తదనం లేదు....కేవలం భార్యాతనం మాత్రమే!.....

**వత్సల :** అంటే – ఆ తప్పంతా మా ఒక్కరిదేనా?

**కామరాజు :** ఇద్దరిదీ. కాని పెళ్లిని, సంసారాన్ని విజయవంతం చెయ్యడంలో స్త్రీపాత్ర ముఖ్యం అనుకుంటాను....ఆ సంగతి చాలా మంది మరిచిపోతూ వుంటారు.

**వత్సల, గోపాలం, మదన (ఎవరికి వారే) :** నేను మరిచిపోయానా?.... నేను?..... నేను..........?

**కామరాజు :** ఎక్కణ్ణుంచో మాటలు వినబడుతున్నాయి....నెమ్మది.....చూడు మదనా! నీకు అందం ఉంది. ఉత్సాహం ఉంది. చిలిపితనం ఉంది. అదే మగాడికి కావాల్సింది...... నీ కోసం ఏం చెయ్యమన్నా చేస్తాను.

**వత్సల :** ఆ మాట జ్ఞాపకం వుంచుకోండి చాలు......ఆ దీపాలేమిటి?

**కామరాజు :** పెట్రోమాక్స్ లైట్లు.....బాణాసంచా కాలుస్తారిప్పుడు........వాళ్ళు వెళ్ళేదాకా ఆ చెట్టు చాటున నిలబడదాం.

**వత్సల :** అక్కడంతా చీకటిగా ఉంది.

**కామరాజు :** ఉంటే యేం? నేనున్నానుగా! (చెయ్యి పట్టుకు తీసుకుపోతాడు)

**గోపాలం :** ఇద్దరూ ఆ చెట్టు చాటుకు వెడుతున్నారు....ఏమీ చప్పుడు కావడంలేదే! తోటగదిలోకి వెళ్ళారా? (ఏడుపుగొంతుతో) ఒరే మగవెధవలారా! ఎంత తేలిగ్గా మోసపోతా(్రా మీరు!...ఇప్పుడు వాళ్ళిద్దరూ లోపలికి వెళ్ళినట్టున్నారు.....నలుగురినీ పిలిచి అల్లరి చేస్తే –

**మదన :** **(వసంత వేషంలో ఉంది)** ఎవరది?

**గోపాలం :** ఎవరు?......రాణీగారు!

**మదన :** ష్...మెల్లగా –

**గోపాలం :** మీరుండడం ఎంత అదృష్టం! (ఉక్రోషంతో) రాజావారెక్కడవున్నారో మీకు తెలుసా?

**మదన :** కృతఘ్నుడైన మొగుడు ఎక్కడవుంటే ఎవరికి కావాలి?

**గోపాలం :** పోనీ, మీ స్నేహితురాలు మదన ఎక్కడవుందో –

**మదన :** (అతని నోటిని మూస్తూ) అరవకు. నీకు పుణ్యం ఉంటుంది.

**గోపాలం :** (తనలో) మదన గొంతులా వుందే!

**మదన :** (మళ్ళీ వత్సలలాగా) ఏమిటో! చాలా గాభరాగా ఉన్నావు!!

**గోపాలం :** కళ్ళెదురుగా ఇంత జరుగుతూ వుంటే – గాభరా అంటారేం రాణీగారూ!....నాకు ఎంతకోపంగా ఉన్నదంటే–

**మదన :** అయితే మనిద్దరం కలిసి పగతీర్చుకోవాలి.

**గోపాలం :** మీరు కూడానా –

**మదన :** నేను మాత్రం మనిషిని కానూ?...కాని ఈ విషయం మన ఇద్దరి మధ్యనే వుండాలి.......

**గోపాలం :** మీరేం చెప్పినా అది నాకు శాసనమే!.....మీరంటే నాకంత ఆరాధన!!

**మదన :** ఏమన్నావ్! మళ్ళీ చెప్పు –

**గోపాలం :** నిజం రాణీగారూ! మీరు.....మీరంటే నాకు.....చాలా గౌరవం.

**మదన :** ఆ!

**గోపాలం :** మీలాగా హుందాగా, ఠీవిగా ఉండే ఆడవాళ్ళేరండీ?

**మదన :** ఊరికే పొగిడెయ్యకు –

**గోపాలం :** పొగడ్త కాదండీ!.....నా ఉద్యోగం ఈ మాటలు చెప్పనివ్వలేదు గాని– మీరంటే నాకు చాలా ఇష్టం –

**మదన :** (తనలో) అబ్బా! నా చేతులు దురదపెడుతున్నాయి!......(పైకి) జాగ్రత్తగా ఆలోచించే మాట్లాడుతున్నావా?

**గోపాలం :** (మోకాళ్ళ మీద కూర్చుని) రాణీగారూ!......కాదు – వత్సలా దేవిగారూ! (రెండు చేతులూ పుచ్చుకుంటాడు) ఈ చేతుల్తో –

**మదన :** (మదన అయిపోయి) ఈ చేతుల్తో ఈ రెండు చెంపలూ వాయించాలి....రెండు చెవులూ పిండాలి...ఇంకా నువ్వు నన్ను అనుమానించినందుకు మెత్తగా తన్నాలి.......నన్ను ప్రేమిస్తున్నట్టు కథలు చెప్తావ్!..కథలు!!

**గోపాలం :** మదనా! నువ్వే! నువ్వే!.....కొట్టు, తిట్టు, తన్ను.....అన్నీ చేశాక నా మొహంలోకి చూడు...

**మదన :** ఏం? అక్కడ కోతులాడుతున్నాయా?

**గోపాలం :** కాదు.....ఆడదాని చేత దెబ్బలు తిన్న గొప్ప అదృష్టవంతుడి మొహం అది!

**మదన :** మాటలు నేర్చుకుపోయావ్! అమ్మో!! ఎంతనమ్మకంగా చెప్పావ్!...

**గోపాలం :** (నవ్వి) నీ గొంతు విని గుర్తు పట్టలేనంత అమాయకుణ్ణనుకున్నావా?

**మదన :** నన్ను.......నన్ను గుర్తు పట్టావా?....ఊరికే బుకాయించకు......

**గోపాలం :** కాని నా కళ్ళను నేనే నమ్మలేకపోతున్నాను...అక్కడ ఉండవలసిన దానివి ఇక్కడ!!.... ఈ అలంకారాలేమిటి? ఈ నగలు, ఈ ముడి, ఈ శాలువా!! అచ్చం రాణీగారిలాగా?...నన్ను కూడా చెదర కొట్టాయే!

**మదన :** ఒకరి కోసం వలవేస్తే నువ్వు వచ్చి చిక్కుకున్నావ్!

**గోపాలం :** ఎవరి కోసం? రాజా వారి కోసమా?

**మదన :** ఆహా!

**గోపాలం :** మరి ఆవిడ వలలో చిక్కుకున్నది –

**మదన :** ఆహా! సాక్షాత్తు రాజావారే!

**గోపాలం :** అయితే, కామరాజదేవ్ గారి కేళీ విలాసమంతా –

**మదన :** అమ్మగారితోనే –

**గోపాలం :** ఆ గుసగుసలు, ఆ ముద్దులు, ఆ మోకరిల్లడాలు –

**మదన :** అన్నీ అమ్మగారికే!

**గోపాలం :** అమ్మో! రాణీగారికి ఎంత ధైర్యం!! మగాళ్ళకి ఆ మాత్రం తెలిసిరావాలిలే!

**కామరాజు :** (వస్తూ) అరె! క్షణంలో ఎటో వెళ్ళిందే!...మదనా! మదనా!

**గోపాలం :** అడుగో వెడుతున్నాడు.....ఆయన్ని కాసేపు ఆటపట్టిద్దామా?

**మదన :** ఎట్లా?

**గోపాలం :** చూస్తూ వుండు! (అని మదనని అటువైపుకు తిప్పి ఆమె ముందు మోకరిల్లి) రాణీ! నన్ను కరుణించు!!

**కామరాజు :** ఎక్కడో మాటలు – (రెండడుగులు వెనక్కి వేసి) అక్కడ కూర్చున్నది వత్సల కాదూ?...ఆమెతో ఉన్నదెవరూ?....ఏమిటి అట్లా కూర్చున్నాడు?

**గోపాలం :** (నాటకీయంగా) ఇవాళ ఇట్లా కలవగలమని అనుకోలేదు.

**కామరాజు :** (తనలో) ఆకాశరామన్న ఉత్తరంలో రాసింది వీడిని గురించి కాదు గదా!

**గోపాలం :** ఇలా ఈ వెన్నెల రాత్రుళ్ళు కలవడం మన అదృష్టం కదూ!

**కామరాజు :** (తనలో) ఒరేయ్!....నీ అంతు చూస్తానురా –

**గోపాలం :** ఇవాళ ఉదయం నీనుంచి అర్ధాంతరంగా పారిపోవలసి వచ్చింది.......అప్పుడు దక్కని ఆనందాన్ని అనుభవిద్దాం..రా, రాణీ....అలా లోపలికి వెడదాం – (అని పొదరింటి నుంచి లోపలికి పోబోతూ) ఇప్పుడాయన మొహం చూడాలని వుంది.....

**మదన :** మనం లోపలికి వెడుతున్నట్టు ఎవ్వరూ చూడడం లేదు గదా!

(ఆమె చెయ్యి తీసుకుని ముద్దు పెట్టుకుని, లోపలికి తీసుకుపోతాడు.)

**కామరాజు :** ఇహ ఊరుకోకూడదు....(కోపంతో) ఎవర్రా అక్కడ? ఇక్కడికి రండి......తొందరగా – (మదన పరిగెత్తుతుంది. ఆమె వెనక వున్న గోపాలం చెయ్యి పుచ్చుకున్నాడు కామరాజు)

**గోపాలం :** (భయం నటిస్తూ) అమ్మో! రాజావారు!

**కామరాజు :** దుర్మార్గుడా! నువ్వా!!....ఎవరక్కడ? తొందరగా రండి......

**సింహాద్రి :** (హైదరాబాదు నుంచి అప్పుడే తిరిగి వచ్చాడు) తమరిక్కడున్నారా దొరా?

**కామరాజు :** నువ్వా సింహాద్రీ! సమయానికొచ్చావ్!...బిగ్గరగా అరు.....నువ్వేం చూశావో అందరికీ చెప్పు –

**సింహాద్రి :** నేను చూసిందేనా అయ్యా? (బిగ్గరగా) కిశోర్ బాబు అయిదరాబాద్‌లో లేడు.......అసలు రానే లేదంట!!

**కామరాజు :** వెధవ పక్షి! ఇప్పుడా విషయం ఎందుకురా?...అరవరా అంటే –

**సింహాద్రి :** ఆ విషయమే గదూ నేనరుస్తూ జెప్పింది.

**కామరాజు :** మనవాళ్ళని నలుగుర్నీ రమ్మని అరవరా.....ఎవరక్కడ? జయప్పా? రామనాధం గారూ!

(రామనాథం, జయప్ప, ముత్యాలు, కరణం, బుద్ధుడు....అంతా వచ్చారు "ఏమయిందండీ, ఏమయింది" అనుకుంటూ)

**కామరాజు :** ఆ లోపల –

**ముత్యాలు :** ఎవరయ్యగోరూ లోపల?

**కామరాజు :** చెబుతా, చెబుతా......(గోపాలంతో) తమరు నా ప్రశ్నలకి సమాధానం చెబుతారా?

**గోపాలం :** (వినయంగా) రాజాగారడగడం, చెప్పకపోవడమూనా?

**కామరాజు :** ఇంతవరకు నువ్వు తోటలో మాట్లాడుతున్న దెవరితో?

**గోపాలం :** అక్కడేనా?

**కామరాజు :** (కోపంగా) అవును.

**గోపాలం :** ఒక ప్రేమదేవతతో –

**కామరాజు :** (వ్యంగ్యంగా) ఎవరా ప్రేమదేవత? ఇంత రాత్రివేళ –

**గోపాలం :** మనసులు ఇచ్చి పుచ్చుకోవడానికి అదేగా సరైన సమయం!

**కామరాజు :** విన్నారుగా! ఇతనితో పాటు మరొకరున్నారని అర్థమయిందిగా?

**కరణం :** ఆయన కా...కా...కాబోతున్న పెళ్ళామేమో?

**కామరాజు :** కాదు.

**కరణం :** అదేంది? ఆ సంగతి మీకెట్లా తెలుసు?

**కామరాజు :** (తడబాటుతో) ఆ......అదే! నేను చూశాను.......లాక్కొస్తాను....మీరే చూద్దురు గాని! (లోపలికి పోయి చీరె కప్పుకున్న మనిషిని లాక్కొస్తాడు) ఇహ తమ గుట్టుకాస్తా రట్టయింది.....అటు నడవండి.....(చీరె ముసుగు తీస్తాడు)

**గోపాలం :** కిశోర్! నువ్వా?

**కామరాజు :** కిశోర్?

**ముత్యాలు :** నువ్వు ఇక్కడ వున్నావా?

**కామరాజు :** నువ్విక్కడేం చేస్తున్నావ్?

**కిశోర్ :** మీకు నా మొహం చూపించవద్దన్నారుగా! అందుకని – ఈ వేషంలో–

**సింహాద్రి :** నన్ను అయిదరాబాద్ తరిమితే లాబం ఏటి?

**కామరాజు :** వీడుగాదు...ముత్యాలు! లోపల ఇంకొకావిడ వుంది......నాకు తెలుసు....లాక్కురా – (ముత్యాలు తటపటాయిస్తాడు) వెళ్ళవేం? (ముత్యాలు లోపల్నుంచి ఒక మనిషిని లాక్కొస్తాడు)

**ముత్యాలు :** నువ్వెవరివో గాని.......మా దొర చెడ్డ కోపం మీదున్నాడు.....బయటకురా –

**కామరాజు :** అందరూ చూడండి (అని ఆమె కప్పుకున్న ముసుగు తీస్తాడు. ఆమె పాప) పాపా! నువ్వా?

**ముత్యాలు :** ఏందే నువ్విక్కడ?....నడు ఇంటికి.

**పాప :** నేను....నేను.....

**ముత్యాలు :** మాటాడకు....ఇంటికినడు.

**రామనాథం :** ఇంకా లోపల ఎవరన్నా ఉన్నారంటారా?........నేను చూసిరానా?

**కామరాజు :** అక్కర్లేదు.......లోపల ఎవరున్నారో నాకు తెలుసు!

**కరణం :** ఎవరు?

**అందరూ :** ఎవరు? ఎవరు? ఎవరు?

**కామరాజు :** రాణీగారు!

**అందరూ :** రాణీగారా?

**కామరాజు :** నువ్వు లోపలికి వెళ్ళడం ఎవరూ చూడలేదనుకోకు....బయటకు రా – వత్సలా – వెంటనే బయటకు రా

(రాణీగారి వేషంలో ఉన్న మదన ముసుగు వేసుకుని వచ్చి నిలబడ్డది.)

అదుగో చూడండి!..ఇప్పుడు చెప్పండి....ఇటువంటి కృతఘ్నురాల్ని ఏం చెయ్యాలి?

**మదన :** క్షమించండి......

**కామరాజు :** నిన్నా! అసంభవం.

**గోపాలం :** క్షమించండి –

**కామరాజు :** హు! నిన్ను, క్షమించాలి! అవునా? అసంభవం, అసంభవం –

**పాప, కిశోర్ :** క్షమించండి....

**కామరాజు :** అసంభవం, అసంభవం, అసంభవం –

(కామరాజు వెనకకు తిరిగాడు. ఎదురుగుండా ఉన్న పొదరింటిలో నుంచి మదన వేషంలో ఉన్న వత్సల బయటకు వస్తుంది. కామరాజు నిర్ఘాంతపోయాడు. మదనని, వత్సలని మార్చి మార్చి చూస్తాడు.)

**వత్సల :** నేను క్షమించమంటాననుకోకండి....రాజావారే మంటారో?

**కామరాజు :** ఎవరది?

**కరణం :** ఎవరేమిటండీ?.....ఆవిడ మా..మా....మా.....రాణీగారు!

**కామరాజు :** నువ్వా!.....ఆ వైపు నుంచి!....ఆ వేషంతో!!......మరి నీ వేషంలో ఉన్నది....... (మదన ముసుగు తీసింది. కామరాజు కాసేపు మాట్లాడడు.) ఏమిటి? ఏం జరుగుతోందిక్కడ?

**వత్సల :** మీరే చూడండి....మీ అసలు సంగతి తెలియడంలా?

**కామరాజు :** వత్సలా!.......నేనెంత తప్పుచేశానో నాకిప్పుడర్థమయ్యింది.........

**వత్సల :** చిన్నతప్పులు చేసిన వాళ్ళని కూడా క్షమించడం అసంభవం, అసంభవం అన్నారుగా! క్షమించకూడని నేరాలు మూడు చేశారు మీరు ఒకే రోజున!

**కామరాజు :** మీరంతా నన్ను క్షమించాలి......పిల్లి పాలు తాగుతూ తన్ని ఎవ్వరూ చూడరులే – అన్నట్టుగా ప్రవర్తించాను....మీరంతా –

**మదన :** 'మీరంతా' అనకండి. అంతా రాణీగారి సాహసమే!

**కామరాజు :** మరి, ఆ ఉత్తరం?

**మదన :** రాణీగారు రాయించిందే?

**కామరాజు :** (వత్సల దగ్గరకు పోయి రెండు చేతులూ పట్టుకుని) నాకు తెలివి తెప్పించావు! క్షమించు –

**వత్సల :** భార్యాభర్తల మధ్య క్షమాపణలుండకూడదు..... స్నేహం తప్ప.

**కామరాజు :** కాదు వత్సలా! నన్ను క్షమించవలసిన నేరమే చేశాను......నా చాపల్యం హరించుకుపోయేటట్లు చేశావ్!

**వత్సల :** అంత హఠాత్తుగానా?

**కామరాజు :** నా భార్య మరో మగాడితో ఉన్నదంటేనే నేనింత బాధ పడ్డానే? అటువంటప్పుడు మరో స్త్రీ నాది కావాలనుకోవడం ఎంత అవివేకం! మదనా! క్షమించు. వత్సలా! నిన్ను ఇది వరకటి కన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నాను.

**వత్సల :** (నవ్వుతూ) కొత్తగా, చిలిపిగా, గికురిస్తూ, కవ్విస్తూ.......అంతేనా?

**కామరాజు :** అదే ప్రేమసంసారానికి సూత్రం –

**కరణం :** ఈ శుభ సమయంలో బా..బా...బాణా సంచా కాలుద్దాం – పదండి–

**కామరాజు :** పొగడచెట్టు దగ్గర – సరేనా?......

**(అందరూ నవ్వుతూ నిష్క్రమణ. బయట బాణాసంచా కాల్పులు.)**

**(తెర)**



## స్మృత్యంజలి

నా వెంటబడి
ఈ 'పెళ్లికి పది నిమిషాల ముందు' నాటకాన్ని రాయించి,
దీనిని ప్రసారం చేయడానికి శ్రమించి,
ఇందులో ప్రధాన పాత్ర ధరించిన మిత్రుడు,
నాచేత పది వారాల పాటు తెలుగు సాహిత్యంలో
'హాస్యం వేసిన చిందులు' అనే ధారావాహికను రాయించి
ప్రసారం చేయించిన నటుడు, ప్రయోక్త, నాటకకర్త –
ఆప్త శిష్య–మిత్రుడు


**మా ఆకెళ్ల సత్యనారాయణమూర్తిని**

జ్ఞాపకం చేసుకుంటూ...

**– నాగభూషణ శర్మ**

# పెళ్లికి పది నిమిషాల ముందు

(హాస్య నాటకం)



(ఆకాశవాణి, హైదరాబాద్, నుంచి పలుమార్లు
ప్రసారం చేయబడిన హాస్య నాటకం)

## ఇందులో పాత్రలు

గరుడాచలం

దుర్గ

పల్లవి

వసంతకుమార్

సావిత్రమ్మ

సన్యాసిరావు

విశాల

విశ్వం

శకుంతల

అహోబిలం

అవధాన్లు

గోవిందయ్య

హనుమంతు

తాతగారు

కుర్రాడు

శృంగార కవి

# పెళ్లికి పది నిమిషాల ముందు

(పెళ్ళింట్లో నడవ. స్టేజి కుడి వైపు ఒక దోవ. అది పెళ్లిపందిట్లోకి దారితీస్తుంది. రెండోడి ఎడవ వైపు దోవ. అది వంటపందిరికి దారి. స్టేజి మధ్యలో మరో రెండు ద్వారాలు. ఒకటి సామాన్ల గదిలోకి, మరొకటి ఇంటాయన పడకగదిలోకి.........

ఒక పక్క పెళ్ళికూతురు పల్లవికి పూలజడ వేస్తూ ఉంటుంది విశాల..... ఇద్దరూ సమవయస్కులు; స్నేహితులు. పల్లవి మాత్రం దీక్షగా ఓ పుస్తకం చదువుతోంది; మధ్యలో తనలో తాను నవ్వుకుంటోంది.)

**విశాల :** ఇప్పుడు కూడా క్షణం కుదురు లేదు కదా పిల్లకి! రేపట్నుంచి కాపురం ఎట్లా చేస్తావే!

**పల్లవి :** అబ్బా! ఎంత బాగా రాశాడే! "కన్నె వయసు వెన్న తరక" ; "కన్నె మనసు వెన్నెల సోన" ! ఆహా!

**విశాల :** శ్రుతి లేని పాట, మతి లేని మాట – అని! ఎవడే ఆ రాసింది?

**పల్లవి :** తం.తే!

**విశాల :** అదేం పేరే!

**పల్లవి :** ఆయన పేరు తంజావూరు తేజశ్రీ! తం.తే.

**విశాల :** ఎవడో ఒకడు! రాసినవాడు వాడికి బుద్ధిలేదు....తం.తే. గారికి తంతేగాని బుద్ధి వచ్చేట్టులేదు. రాసినాయన ఆయనకి బుద్ధిలేదు; చదివి ఆరాధించే నీలాంటి వాళ్ళకి అసలు బుద్ధిలేదు.

**పల్లవి :** అట్లా అనకే విశాలా!.....ఈ నవల్లో ప్రేమ పెళ్ళిళ్ళను గురించి ఏం బాగా రాశాడనుకున్నావ్! ఆ అమ్మాయికి మొదట ఈ పెళ్ళంటే ఇష్టం లేదు. కాని పిల్లాడు – Wonderful Boy! – ఆ అమ్మాయిని మెల్లగా తన వైపు తిప్పుకుంటాడు. ఒక్కొక్క సంఘటన ఓ అపూర్వ సృష్టి అనుకో!

**విశాల :** పిచ్చిదానా! అవన్నీ కథల్లోను, సినిమాల్లోనూ జరుగుతాయి కాని అసలు జీవితంలో కాదే! ఎవడో రాజకుమారుడు వచ్చి నిన్ను పెళ్ళి చేసుకుంటాడని నువ్వు కలలు కంటూ ఉండు...తీరా కళ్ళు తెరిచేసరికి వాడో సాదాసీదా సుబ్బారావయి ఊరుకుంటాడు. నన్నడిగితే ప్రతి మగాడు ఓ చిన్నసైజు గాడిద. వెనక కాళ్ళు జాగ్రత్తగా బిగించికట్టి మన దారిలోకి తెచ్చుకుంటే, జీవితాంతం ఎంత గాడిద బరువైనా ఆనందంగా మోస్తాడు..ఎట్లా ఉంది నా థియరీ?

**పల్లవి :** నీ మొహం....నువ్వు మొదటినుంచీ అంతే.....నీలాంటి దానికి కూడా మందు చెప్పాడే తం.తే.గారు–

**విశాల :** ఆ మందు దొరుకుతుంది – తం.తేగారి లేటెస్ట్ నవల “అందమైన సంసారం” చదువు....చదివి తెలివి తెచ్చుకో –

(ఇంతలోనే శకుంతల “విశాలా”, “విశాలా” అంటూ హడావుడిగా వస్తుంది.....వయసు 30–35. హాస్య ప్రియత్వం ఉన్న మనిషి.)

**శకుంతల :** విశాలా! దాని పూల జడ సంగతి నేను చూస్తాగాని, మీ ఆయన ఎందుకో గావుకేకలు పెడుతున్నాడు నీ కోసం...చూడు....

**విశాల :** అదేమిటో పిన్నిగారూ! ఒక క్షణం పిల్లాణ్ణి పట్టుకోండి అని ఇచ్చాను. అంతే!......ఛీ, ఛీ, ఈ మగాళ్ళు–

**శకుంతల :** అందరు మగాళ్ళనీ ఒకే గాడిలో కట్టెయ్యకుమరి...ఒకసారి చూసిరా.....

**విశాల :** పోనిద్దూ....అంతగా అవసరం అయితే తానే ఇక్కడికి వస్తారు లెద్దూ –

**పల్లవి :** (పూలు తురుముకుంటూ) మామయ్య రాలేదేం అత్తయ్యా?

**శకుంతల :** ఆయన రాలేదో హాయిగా గాలి పీల్చుకుంటున్నా ననుకో! పెళ్లి కొస్తూ పిల్లిని చంకన పెట్టుకు రావడం అంటే అదే!

**పల్లవి :** చివరికి మామయ్యని పిల్లిని చేశావ్!

**శకుంతల :** మామూలు పిల్లేం కాదమ్మా! బావురు పిల్లి....ఆయన్ని ఇంకో పెళ్ళికి పురమాయించి నేనిట్టా వచ్చాను...ఎలా వుంది వ్యూహం?

**విశాల :** ఏమో పిన్ని గారూ! మీ వ్యూహం నాకు నచ్చలేదు....వాళ్ళు మనతో

రాకపోతే మన పనులన్నీ ఎవరు చేసిపెడతారు? పిల్లల్ని ఎత్తుకుని సముదాయించే దెవరు? అద్దద్దా బజారుకు వెళ్ళి మల్లెపూరు కావాలంటే తెచ్చేదెవరు?

**శకుంతల :** ఏమోనమ్మా! అవన్నీ మన ఇళ్ళల్లో ఉన్నప్పుడు చేయించుకోవచ్చు గాని–

**విశాల :** బావుందండోయ్ మీ వరస – ఇంట్లో అయితే మొగుడు అన్నీ చెయ్యొచ్చా..బయట పనికిరాదా? అసలు బయట పనులకే కదండీ భర్త అవసరం...ఇంటా బయటా అన్నీ భరించాలి మరి!

**శకుంతల :** పాపం! అందుకే మీ ఆయన అట్లా చిక్కిపోతున్నాడేమో విశాలా. నిన్ను భరించలేక!

**విశాల :** ఏమండోయ్ పిన్నిగారూ! నా పెళ్లి అయ్యాక ఆయన 5 పౌన్లు పెరిగారు తెలుసా?

**శకుంతల :** సరేగాని, భర్తల బాధ్యతల్ని గురించి దీనికప్పుడే నూరి పొయ్యకు.. దానిదసలే రొమాంటిక్ గుండె... వీక్.....ఇంకా తెలుగు నవలల ఫాంటసీల్లో, కలల్లో బతుకుతోంది. దాన్ని ఒక్కసారి అసలు ప్రపంచంలోకి డభాలున పడేశావనుకో! బెంబేలు పడగలదు....ఆ! ఆ! ఇహ తెమలండి......పెళ్ళి వారొచ్చే వేళయింది........

(వెళ్ళిపోతుంది)

**విశాల :** శకుంతల పిన్ని భలే హుషారయిందే కాని ఆవిడ మగాళ్ళకి చాలా.......... ఇచ్చేస్తుందే!

**పల్లవి :** నువ్వు మాత్రం! ఆ జన్మ మగ ద్వేషిలా మాట్లాడతావ్! మళ్ళీ మొగుణ్ణి వదిలి ఒక్కపూట ఉండలేవు!

**విశాల :** అదేనే అసలు ట్రిక్కు.... పెళ్ళి చేసుకోబోతున్న ఈ శుభ తరుణంలో నీ స్నేహితురాలిగా నేను చెప్పే సలహా ఒక్కటే: మగవాణ్ణి మెల్లగా నీ కొంగున కట్టేసుకో! జీవితాంత రాచబాట మీద పయనించు!!

**పల్లవి :** (నవ్వి) నీ మొహం.......నా జీవితం రాచబాట కావడానికి అదా నీ చిట్కా! తం.తే.గారు 'వయసొచ్చిన ప్రేమ' లో ఏమన్నారు? "ఆడ, మగ కాడికి కట్టిన రెండ ఎడ్ల లాంటి వాళ్లు...ఒకళ్ళు వెనక్కు

మరొకళ్ళు ముందుకు లాగితే బండి నడవదు సరిగదా; ఇరుసు విరిగిపోతుంది కూడా!"

**విశాల :** ఇదా నీ తం.తే.గారి మంత్రం! పాత చింతకాయ పచ్చడి....

**పల్లవి :** చాలా మంచిదే –

**విశాల :** ఎవరికి? జబ్బు చేసిన వాళ్ళకి! కాని ఆరోగ్యవంతులైన నీ లాంటి నవనవలా మణుల కోసం నేనొక నవల రాశాను, కాచుకో...... విడుదలకు సిద్ధముగా ఉన్నది....వి.వి.గారి సంచలనాత్మక నవలా రాజము.... "కట్టుకున్నవాడే నా భర్త"..... చదువు...... జీవితాన్ని సుఖమయం చేసుకో –

(పల్లవి నవ్వుతుంది...విశాల ముస్తాబు పూర్తి చేసినట్టు కాసేపు పల్లవి వంక చూసి మెటికలు విరుచుకుంటుంది..ఇంతలో బయటి నుంచి విశ్వం కేకలు, 'విశాలా', 'విశాలా' – అని)

**విశ్వం :** విశాలా! ఇక్కడా ఉన్నావ్! అరగంట నుంచి అరుస్తున్నాను...

**విశాల :** ఎందుకూ అరవడం?..పొద్దున్నే టిఫిన్ పడలేదా యేమిటి?

**విశ్వం :** ఎందుకు పడలా?.........చిట్టిగాడేమో నా చొక్కా అంతా ఖరాబు చేశాడు. వాడి చేత ఆ లాగూ విప్పించడం నా చేత కాలేదు......నేనేదో చెండుకు తింటున్నట్టు ఏడుపులు, పెడబొబ్బలు.......

**విశాల :** తండ్రి పోలికలు ఎక్కడికి పోతాయి?..(పల్లవితో) చూడవే! పిల్లాడు ఒకటికి వెడితే, తీసి మరో చెడ్డీ వెయ్యడానికి కూడా నేనే రావాలంటే–

**విశ్వం :** నేను వేస్తానన్నాను..వాడు వేయించుకోందే! అమ్మొచ్చి వెయ్యాల్సిందే నని కిందపడి ఏడుస్తున్నాడు. అనుకోకుండా మా వూరివాడు వెంకట్ వచ్చాడు పెళ్ళికి – మగ పెళ్ళి వారి తరఫున. వాడితో ఒక్క క్షణం మాట్లాడదామంటే పడనిస్తేనా? అద్దెకు తెచ్చిన తెలుగు సినిమా కాసెట్‌లో అడ్వర్టయిజ్ మెంట్లలా ఊరికే అరుపులు, గెంతులు.....

**విశాల :** పిల్లాణ్ణి సముదాయించడం కన్న ఆ వెంకుగాడో ఎవరో, అతగాడితో–

**విశ్వం :** వెంకుగాడు కాదు; వెంకట్రత్నం Indian Agriculture Service.......... బొప్పాయి చెట్లకు ఎరువు వెయ్యడం గురించి కొత్త విషయాలు కనిపెట్టి Ph.D. తీసుకున్న ఘనుడు....

**విశాల :** ఎవరో ఒకరుగాని, ఆ బుట్టలో ఎడం వేపున చిట్టిగాడి తెల్ల చడ్డీ వుంది...... తీసి వెయ్యండి బాబూ!

**విశ్వం :** వాడు నాచేత వేయించుకోనంటుంటే –

**విశాల :** అదే! అదే! మీరు ఎట్లానయినా వాడిని నా మీద రుద్ది ఆ ఎరువుల వెంకటయ్యతో భేటీ వెయ్యాలని –

**విశ్వం :** ఏమీ కాదు....వాడు కింద పడి దొర్లుతున్నాడు.

**విశాల :** సముదాయించడం చేతకాకపోతే సరి!.....ఇంతకీ వాడెక్కడండీ?

**విశ్వం :** ఒక్క నిమిషం పట్టుకోరా అని ఆ వెంకట్‌గాడికి ఇచ్చి వచ్చాను...... ఈలోగా వాణ్ణి కూడా పవిత్రం చేశాడో ఏమిటో?

(లోపలికి వెడతాడు)

**విశాల :** పిల్లాణ్ణి పట్టుకోకుండా చేసిన బొప్పాయి కాయల వెంకటయ్యకి అదే తగిన శాస్తి! (పల్లవితో) నువ్వీక లేచి మొహం కడుక్కురావే! కాళ్ళకు పారాణి, బుగ్గన చుక్క – అమ్మాయిగారు రెడీ –

(ఇంతలో వాకిట్లో బాజాలు, నాదస్వరం)

(హడావుడిగా అహోబిలం వస్తాడు)

**అహోబిలం :** ఏవమ్మా, ఇంకా ముస్తాబు పూర్తికాలేదా? తొందరగా కానివ్వండి...... ఈ గరుడాచలం ఎక్కడ?... పెళ్ళి వారొచ్చేశారు....... ఇహ ఆలస్యం లేదు..... అమ్మాయిని త్వరగా తయారు చెయ్యండి..సావిత్రమ్మగారూ! సావిత్రమ్మగారూ! (ఆవిడ వస్తుంది) పెళ్ళి వారొచ్చేశారు....ఇక్కడి వాళ్ళకి కాఫీ, గట్రా చూడండి......అవధాన్లుగారు కావలసిన వస్తువులన్నీ తెచ్చారోలేదో చూస్తానంటున్నాడు....

**సావిత్రమ్మ :** ఏమీ అక్కర్లేదు.....నా చేతుల్తో పాతిక పెళ్ళిళ్లు చేయించాను......... ఆయనిచ్చిన లిస్టు ప్రకారం అన్నీ తెప్పించామని చెప్పండి.....దుర్గా! దూర్గా! మా అమ్మాయి ముస్తాబు ఇంకా పూర్తి అయినట్టు లేదు.... (విశాలతో) ఇంకా అట్లా చూస్తూ కూర్చున్నారేమిటీ మీ ఇల్లు బంగారం కానూ! అమ్మాయికి ముస్తాబు పూర్తి చెయ్యండి... ఆ అవధాన్లుగారొక ఆటగుర్రం....ఊరికే కదను తొక్కుతూ ఉంటాడు... త్వరగా తెమలండి......

**విశ్వం :** (లోపలనుంచి వస్తూ) ఇదుగో విశాలా! నువ్వు చెప్పిన తెల్ల చెడ్డీ కనిపించలేదు....అందుకని ఈ నల్ల చడ్డీ –

**విశాల :** అబ్బా! ఏం combination అండీ! అయినా ఎదురుగుండా ఆ తెల్లచెడ్డీ కనిపిస్తూ ఉంటేనే –

**విశ్వం :** నేనంతా వెతికాను.

**విశాల :** ఆనంద్ అమెరికా నుంచి పంపించిన చడ్డీ లేదుటండీ!

**విశ్వం :** చంపావ్! అది చడ్డీ ఎందుకవుతుంది? అది నిక్కర్......తెల్ల చడ్డీ కోసం అరగంట వెతికాను...అక్కడ లేకపోతే ఎట్లా కనిపిస్తుంది?

**విశాల :** పోనీ తెల్లది కనిపించింది కదా! చడ్డీనా, నిక్కరా అని మీమాంస ఎందుకు? అది తీసుకు వెళ్ళి వెయ్యరాదూ?

**విశ్వం :** ఇది మరీ బావుందోయ్...నువ్వు నిక్కర్‌ని చడ్డీగా వర్ణించడం బావుంది..... నేను చడ్డీని చడ్డీగా తీస్తే నాకు చేతకాదు...ఏం తర్కం?

**విశాల :** తర్క వితర్కాలను గురించి ఉపన్యాసం ఇస్తారా, లేక –

**విశ్వం :** లేదు లేదు.......తెల్ల చడ్డీ.........ఛా ఛా! తెల్ల నిక్కరు కోసం మరోసారి శోధిస్తాను......సరా?

(వెడతాడు)

**విశాల :** మగవాళ్ళకి ఆ మాత్రం బెరుకు మంచిదే –

**సావిత్రమ్మ :** మొగుణ్ణి తరవాత భయపెడుదువుగాని, అమ్మాయికి పట్టు చీరె తెచ్చి ఇవ్వమ్మా – ఆ గదిలోవుంది.

**విశాల :** అట్లాగే అత్తయ్యగారూ......... (వెడుతుంది)

**సావిత్రమ్మ :** పల్లవీ! దాని మాటలు పట్టించుకోకు......మగవాళ్ళని ఆట పట్టిస్తున్నామని ఆడవాళ్ళు, ఆడవాళ్ళని సతాయిస్తున్నామని మగవాళ్ళు అనుకోబట్టే మన జీవితాలిట్లా ఉన్నాయి –

(సన్యాసిరావు వస్తాడు)

**సన్యాసిరావు :** ఏమేవ్!......ఒసే.......ఎక్కడ?

**సావిత్రమ్మ :** (భయపడిపోయి) ఏమిటండీ? ఏమయింది?

**సన్యాసిరావు :** నా బొంద అయింది.......అక్కడ ధోవతి, లాల్చీ తీసిపెట్టమన్నాను. ధోవతి పెట్టావ్......లాల్చీ ఏదీ?

**సావిత్రమ్మ :** అది మీ పెట్టెలో వుంది కదండీ?

**సన్యాసిరావు :** ఎక్కడుందీ? పెట్టె అంతా బోర్లా వేసి చూశాను...అన్నీ నీ చీరెలే కాని, నా లాల్చీ మాత్రం కనిపించలేదు..

**సావిత్రమ్మ :** ఆ – మీరు కొనిపెట్టిన చీరెలన్నీ కావిళ్ళతో మోసుకొచ్చాను....

**సన్యాసిరావు :** చాల్లే సంబడం.....కొని ఇవ్వనట్టే మాట్లాడుతున్నావే! పెట్టె నిండా నీ చీరెలూ, సామాన్లే!

**సావిత్రమ్మ :** మీ పెట్టెలో చూసుకోండి......మీ రట్లా అంటారనే మీకు వేరుగా సర్దాను.

**సన్యాసిరావు :** నీ సర్దుడు మండినట్టే వుంది....ఆ పెట్టెలో కూడా అన్నీ నీ బట్టలే– నువ్వు పట్టుచీరె కట్టుకుని తైతక్కలాడగానే సరిపోయిందా? మొగుడు ముండావాడికి గోచీపాతన్నా ఉందో లేదో చూడొద్దా –

**సావిత్రమ్మ :** చేతిలో బోలెడంత పని వుంది......పెళ్ళివారు వచ్చేశారు..... కాస్త మీరే –

**సన్యాసిరావు :** నువ్వు ఒక్క నిమిషం వచ్చి ఆ లాలీచ నా మొహాన పారేసి పోతే, ఆ తరువాత నా ఏడుపేదో నేనేడుస్తాను... దానికే తీరకలేదా దొరసాని గారికి?

**సావిత్రమ్మ :** నా దొరసానితనం మండినట్టే వుంది.....చూసి ఇస్తాను పదండి.

**సన్యాసిరావు :** మాటకు ముందర నెత్తమీద నీళ్ళ కడవతో తయారు.........గంగని నెత్తిన పెట్టుకుని ఆ భోళాశంకరుడు మగజాతికి ఎంత అన్యాయం చేశాడో ఇప్పుడు తెలుస్తున్నది.......నడు.......

**సావిత్రమ్మ :** వస్తుంటేనే........(పల్లవితో) అమ్మా! పెళ్ళివారొచ్చారు. కాస్త కాఫీ ఫలహారాలు..... నా మొహం! పెళ్ళికూతురువి, నీకు చెబుతున్నా నేమిటి?....... నీ పనులు కానివ్వు తల్లీ.........ఈయన గారికి బాల తొడుగులన్నీ అయ్యాక నేనే చూసుకుంటాను...........

(అంటూ లోపలికి వెడుతుంది, ధుమ ధుమలాడుతూ – ఆవిడ వెనకాలే సన్యాసిరావు – ధాష్టీకంగా)

(పల్లవి వాళ్ళు వెళ్ళిన వేపే నిర్ఘాంతపోయి చూస్తూ వుండిపోతుంది)

(శకుంతల వస్తుంది)

**శకుంతల :** ఏమిటే పల్లవీ! నువ్వొక్కదానివే ఇక్కడ? ఇంకా తయారు కాలా?

**పల్లవి :** ఇదుగో! విశాల పట్టు చీరె తెస్తానని వెళ్ళింది......అది తేగానే –

**శకుంతల :** ఈలోగా మొహం కడుక్కునిరా........కలలు కంటూ ఆ bathroom లోనే ఉండిపోకు.

(పల్లవి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వెళ్ళిపోతుంది....గరుడాచలం మేడమీద నుంచి దిగివస్తూ ఉంటాడు)

**గరుడాచలం :** దుర్గా! దుర్గా! (శకుంతలతో) మీ వదిన గారెక్కడ? ఆవిడగారి ముస్తాబు ఇంకా పూర్తి అయినట్టు లేదు.

**శకుంతల :** (నవ్వుతూ) నీదంతా విచిత్రం అన్నయ్యా! ఒక్కగానొక్క కూతురు పెళ్ళా? వదిన మాత్రం ఎప్పుడు ముస్తాబయ్యేను? పిలవమంటావా?

**గరుడాచలం :** ఇప్పుడు బ్రహ్మదేవుడి క్కూడా పలకదు.........ఆవిడ ఏడువారాల నగలు ధరించాలి; అప్పుడు దుర్గాదేవిలా మనకు ప్రత్యక్షం ఇవ్వాలి.... మనం ఏదో మానవ మాత్రులం గదా! ఆవిడ కటాక్ష వీక్షణాల కోసం ఎదురు చూడాల్సిందే

(శకుంతల నవ్వుతూ వెళ్ళిపోతుంది)

ఒరే హనుమంతూ! హనుమంతూ!

(బయటనుంచి హనుమంతు వస్తాడు, చేతిలో కొబ్బరికాయలు కొట్టే కత్తి)

**గరుడాచలం :** ఒరేయ్! ఆ కత్తేమిట్రా? కొబ్బరి బొళ్ళాలు తెరిపించావా?

**హనుమంతు :** తోట్లోంచి తెప్పించి ఈది గదిలో ఏయించానండయ్యా!....వెయ్యి బొళ్ళాలు.....కొట్టమంటారేటండి?

**గరుడాచలం :** పెళ్ళివారికి ఇవ్వరా – (హనుమంతు వెళతాడు)

(అహోబిలం వస్తాడు)

**అహోబిలం :** నాయనా! గరుడాచలం! కొండదిగి వచ్చావా? ఏమిట్రా, ఆ హడావుడి అహోబిలం?

**అహోబిలం :** ఆడపిల్ల పెళ్ళా మజాకానా?.....పెళ్ళివారు ఒక విడత వచ్చారు...... పెళ్ళికొడుకు, తల్లీ, తండ్రీ, ఆడపడుచులు వస్తున్నార్ట! నువ్వెళ్ళి వాళ్ళని పలకరించు.... విడిదిలోకి ఇంకా కాఫీ ఫలహారాలు కావాల్ట!

**గరుడాచలం :** నాకు చెప్పడం ఎందుకురా? ఆ శేషయ్యని పిలిచి –

**అహోబిలం :** నీకెందుకు చెబుతారా? ఆ శేషయ్యకే పురమాయిస్తాను......ఓ శేషయ్యగారూ! ఓ శేషయ్య! నీ ఇల్లు నేలగట్టా! సమయానికి పలకవుగదయ్యా – ఆ శేషతల్ప శాయి లాగా – (వంటింటి వైపు వెడతాడు)

**అవధాన్లు :** (గబగబా వస్తూ) అయ్యా! పెళ్ళికొడుకు ఆయన తాలూకు జనం అంతా వచ్చేస్తున్నారు.....మంగళ స్నానాలకి ఏర్పాటు చేయించండి... మంటపం దగ్గరకి కావలసిన సామానంతా –

**గరుడాచలం :** అడుగో మా అహోబిలం వస్తున్నాడు...ఆయన్ని అడగండి......అన్నీ ఆయనకి తెలుసు...(అహోబిలం లోపలనుంచి వస్తాడు)

(ఇంతలో వాకిట్లో మేళాలు మోగుతాయి. గరుడాచలం వాకిట్లోకి వెడతాడు)

**అవధాన్లు :** అట్లాగే!........అయ్యా! మీరేనా అహోబిలం గారు?

**అహోబిలం :** (కోపంగా) అహోబిలం కాదయ్యా! అహోబిల లక్ష్మీనరసింహ స్వామి నా పేరు.........ఇంతకీ ఏం కావాలి?

**అవధాన్లు :** అయ్యా, అహో.......కాదు కాదు నరసింహస్వామిగారూ!.......పెళ్ళి సామాన్లు –

**అహోబిలం :** ఏం కావాలి?

**అవధాన్లు :** ఏం కావాలేమిటండీ?....అన్నీ కావాల్సిందే – పట్టుతాపితాలు, భాషికాలు, మంగళసూత్రం, కాళ్ళు కడుగు పళ్ళెమూ వగైరాలన్నీ కావాల్సిందే –

**అహోబిలం :** అదుగో మా శకుంతల వస్తుంది.......అన్నీ మీకు క్షణంలో అమర్చి పెడుతుంది.

(అని వెళ్ళిపోతాడు...శకుంతల వస్తుంది)

**శకుంతల :** ఏం కావాలి అవధాన్లు గారూ?

**అవధాన్లు :** మళ్ళీ అన్నీ ఏకరువు పెట్టమంటారా?....అయిదో ఎక్కం అప్ప చెప్పినట్టు ఇవన్నీ చెప్పడం మాకలవాటే లెండి...మధు పర్కాలు, మంగళ సూత్రం, భాషికాలు, పట్టుబట్టల, కాళ్ళు కడుగు పళ్ళెం, వెండి చెంబులు, వగైరా వగైరా –

అమ్మాయి తలంట్లూ అవీ అయిపోయాయా? అబ్బాయికి మంగళ స్నానాలకి ఏర్పాటు చేయాలి.

**శకుంతల :** ఇంతేనా, ఇంకేమైనా?

**అవధాన్లు :** ఇప్పటికివి కానివ్వండి.....గత్వా గత్వా –

(అంటూ వాకిట్లోకి వెళ్ళిపోతాడు)

(పల్లవి వస్తుంది.......పట్టుచీరె కట్టుకోవడం, పారాణి పెట్టుకోవడం మినహా ఆ అమ్మాయి రెడీ)

**పల్లవి :** ( Bathroom లోంచి వస్తుంది) విశాల ఏది అత్తయ్యా?

**శకుంతల :** ఆ కొడుకుతో ఏం అవస్థ పడుతుందో ఏమిటో? తన చిన్న నాటి స్నేహితుడు కనిపించాడని అతగాడు తన మాట పట్టించుకోవడం లేదని దాని గునుపు........కోతికి కొబ్బరికాయ దొరికినట్లు ఈనకి ఈ స్నేహితుడు ఎక్కడ దొరికాడంటూ పిల్లాడికి పాలు తేవడానికి వెళ్ళింది..... పిల్లాణ్ణి సముదాయించడం దానికి కొత్త!

**పల్లవి :** నువ్వు మరీ చెబుతావు అత్తయ్యా!

**శకుంతల :** నిజమేనే! లేకపోతే పిల్లాణ్ణి చంకనేసుకుని పనులు చేసుకోమంటే! నువ్విరా – కాళ్ళకి పారాణి పెడతాను.

**పల్లవి :** (కాళ్ళకు పారాణి పెట్టించుకుంటూ) ఎక్కడ చూచినా ఈ మొగుడు పెళ్ళా మధ్య కీచులాటలేమిటి అత్తయ్యా! ఒకరికొకరు బద్ధ శత్రువుల్లా కనిపిస్తారు.

**శకుంతల :** పెళ్ళి చేసుకోకముందు తెలియదు....అయిపోయిం తరువాత ఇహ చేసేదేం లేదు కనుక ఇట్లా బతకాల్సిందే!...ఇవన్నీ మామూలే!

**పల్లవి :** అది కాదత్తయ్యా! మొగుడు పెళ్ళాలంటే చెట్టుకు అల్లుకున్న తీగెలాగ, పూవూతావి లాగా ఉండాలంటారు –

**శకుంతల :** అవన్నీ నువ్వు చదివే నవలల్లో; నువ్వు ఇందాక చెప్పావే కీచులాటలూ, చిన్న సైజు యుద్ధాలు – అవన్నీ నిత్య జీవితంలో –

**పల్లవి :** (దిగులుగా) అంతేనంటావా?

**శకుంతల :** అంతేకాక? అవన్నీ మనసులో పెట్టుకుంటే క్షణం కాపురాలు చెయ్యగలమటే?.....నువ్వు కానీ – విశాల ఏదీ?

(నాదస్వరం వినిపిస్తుంది)

ఒసే మంగా! ఓసి మంగీ! అట్లా నోరు తెరిచి చూస్తున్నావ్!

తలంబ్రాలు బియ్యంలో మల్లెపూలు కలిపావుటే! తొందరగా తెములు–

(సావిత్రమ్మ వస్తుంది...పళ్ళెంలో సామాన్లు పెట్టుకుని పెళ్ళిమండపం దగ్గరకు తీసుకొని పోతూ)

సావిత్రమ్మ వదినా! దుర్గమ్మోదిన ఏదమ్మా? అరగంటసేపాయె వెదుకుతున్నాను... సాంబ్రాణి పుల్లలు గుచ్చడానికి వెండి దిమ్మలు తెస్తానని ఆ వాదనగా వెళ్ళింది....పెళ్ళంతా అయ్యాకగాని ఈవిడ తెమిలేట్లు లేదు.

**సావిత్రమ్మ :** అవేం మాటలే శకుంతలా? ఒక్కగానొక్క కూతురు పెళ్ళి! అన్నీ తనొక్కతే చూసుకోవాలా?

(వాకిట్లోకి వెడుతుంది......నాదస్వరం)

**గరుడాచలం :** (వస్తూ) శకుంతలా! ఇంకా మీ వదినగారు దిగిరాలేదా?.....పెళ్ళి కూతురుతో పాటు ముస్తాబై పెళ్లిపీటలమీద కూర్చోవడం అనుకుంటున్నట్టుగా ఉంది.......రామరామ! బొత్తుగా ఇంగిత జ్ఞానం లేదు కదా!

(వాకిట్లోనుంచి ఇన్‌స్పెక్టర్ గోవిందయ్య పిలుపు......శకుంతలా, పల్లవి లోపలికి వెడతారు)

**ఇన్‌స్పెక్టరు :** నమస్కారం గరుడాచలం గారూ! Congratulations.

**గరుడాచలం :** నమస్కారం ఇన్‌స్పెక్టరుగారూ! రండి.......రండి..........

**ఇన్‌స్పెక్టరు :** ఒక investigation వుంది. పెళ్ళికి ముందుగా వచ్చి వధూవరుల్ని ఆశీర్వదించి పోదామనుకున్నాను. సాంత అయ్యేదాకా ఉండలేకపోతే ఏమీ అనుకోకండి.

**గరుడాచలం :** అదేమన్నమాట ఇన్‌స్పెక్టరుగారూ! మీరు రావడమే పదివేలు.......

**ఇన్‌స్పెక్టరు :** అదృష్టవంతులు......అమ్మాయి కోరుకున్న వరుణ్ణి తెచ్చి చేస్తున్నారు. ఒక్క కూతురాయె. వైభవంగా పెళ్ళి ఏర్పాట్లు చేశారు. ఇదంతా అమ్మాయి అదృష్టం.

**గరుడాచలం :** మీ వంటి పెద్దల ఆశీర్వచనమండీ.....ఒరేయ్ హనుమంతూ! ఇన్‌స్పెక్టర్‌గారికి ఓ కొబ్బరిబొండాం కొట్టరా......

**ఇన్‌స్పెక్టర్ :** ఓహ్! మీ స్పెషాలిటీ పోగొట్టుకున్నారు కాదు.........మీ కొబ్బరితోట ఈ సీమకంతకీ స్పెషల్ కదూ?

(హనుమంతు బొళ్ళాం తెస్తాడు)

అన్నట్టు కుర్రాడు ఏం చేస్తున్నాడు?

**గరుడాచలం :** ఇంజనీరు....మనలో మన మాట! మామూలుగా ఏం సంబంధానికీ ఒప్పుకోని మా ఆవిడ కూడా "అబ్బాయి ఇంజనీరు. అమెరికా వెళ్ళబోతున్నాడు" అనేసరికి ఠక్కున ఒప్పేసుకుందనుకోండి. (గొంతు తగ్గించి, రహస్యం చెబుతున్నట్టు) ఎటొచ్చీ....రేపొద్దున్న అమ్మాయి తన వెనక కాకుండా ఆ పిల్లాడి వెంట వెడుతూంటే చూడాలి ఈవిడగారి మొహం....

(అంటూ బిగ్గరగా నవ్వుతాడు. ఇన్‌స్పెక్టర్ కూడా ఆ నవ్వులో భాగం కలుపుతాడు)

రండి, కూర్చుందురుగాని. మా వియ్యంకుణ్ణి, అల్లుణ్ణి పరిచయం చేస్తాను....

(ఇద్దరూ వాకిట్లోకి వెడతారు.....)

(నాదస్వరం మీద "బ్రోచే వారెవరురా" అనే పాట.......దుర్గమ్మ వస్తుంది...పూర్వకాలపు నగలన్నీ ధరించి ఉంటుంది....వడ్డాణం ఒక్కటే పట్టడం లేదు....దాన్ని బిగించే ప్రయత్నం చేస్తూ వస్తుంది)

**దుర్గమ్మ :** అమ్మడూ! అమ్మడూ!......శకుంతలా!

(శకుంతల వస్తుంది......దుర్గమ్మని ఎగాదిగా చూస్తుంది)

శకుంతలా! అమ్మాయెక్కడ?

**శకుంతల :** ముస్తాబు ముగించుకుని ఎప్పుడెప్పుడ పీటలమీదికి వెడదామా అని ఆత్రంగా ఎదురు చూస్తోంది....

**దుర్గమ్మ :** అప్పుడే ముస్తాబు పూర్తి ఎట్లా అయిందే?....అమ్మడూ! (పల్లవి వస్తుంది) అదేమిటే! అంత బోసిగా ఉంటేను! ఇదుగో, ఈ నానుతాడు, వడ్డాణం, బాజుబందులు, చంద్రరేఖ, వంకీలు – అన్నీ తెచ్చాను.... ఇవన్నీ అమ్మాయికి పెట్టు..........

**పల్లవి :** అమ్మా! ఇప్పుడవన్నీ ఎందుకే?

**దుర్గమ్మ :** అయ్యో! ఇదేం చోద్యమే! మా రోజుల్లో ఇవన్నీ పెట్టినా 'ఇంతేనా?' అనేవాళ్ళం.....ఇప్పుడు నేను పెట్టుకోలా? ఫలానా వాళ్ళ అమ్మాయిని పీటల మీదికి అట్లా బోసిగా పంపించారేమిటమ్మా – అని నలుగురూ నన్ను ఆడిపోసుకోవడానికా? కదలవేం శకుంతలా? తొందరగా కానీ.....

(శకుంతల అలంకరణ మొదలెడుతుంది...దుర్గమ్మ వెళ్ళింది)

(గరుడాచలం వస్తాడు)

**గరుడాచలం :** (ఆ అలంకరణ చూస్తూ) అదేమిటి అమ్మడూ, ఇవన్నీ దిగేస్తున్నావ్? ఇందాక చాలా సింపిల్‌గా స్వీట్‌గా ఉన్నావమ్మా!

**పల్లవి :** అమ్మ –

**గరుడాచలం :** అహా! అనుకున్నాను...దీని వెనక ఏదో అదృశ్య హస్తం దాగి వుందని....దుర్గా! దుర్గా!

**శకుంతల :** పోనీ అన్నయ్యా! వదిన ముచ్చట పడుతోంది.

**గరుడాచలం :** దాని ముచ్చటకు అమ్మాయి బలికావాలా?.....దుర్గా!

**పల్లవి :** పోనీలే నాన్నా.....ఇప్పుడు దానికోసం రాద్ధాంతాలెందుకు?

**గరుడాచలం :** రాద్ధాంతాలెందుకు? నేను చూస్తానాగు......దుర్గా! దుర్గా......

**దుర్గ :** ఏమిటండీ ఆ కేకలు?....చూడండి! మా పుట్టింటి వారిచ్చిన నగలన్నీ పెట్టుకున్నాను...ఎట్లా వుందండీ?

**గరుడాచలం :** అచ్చంగా ఆలయంలోనుంచి దిగివచ్చిన అమ్మవారిలా ఉన్నావు...

(పక్కకు తిరిగి నాలిక తెరిచి భయపెడుతున్నట్టు చూపుతాడు)

**దుర్గమ్మ :** (ఆనందంతో) హమ్మయ్య! మీకు నచ్చింది కదా!

**గరుడాచలం :** నువ్వు దిగేసుకున్నావు సరే! అవన్నీ అమ్మాయికి కూడా దిగెయ్యాలా?

**దుర్గమ్మ :** దిగెయ్యడం ఏమిటండీ? గంగిరెద్దుకు దిగేసినట్టు...'అలంకరించడం' అనలేరూ?

**గరుడాచలం :** (అనుకరిస్తూ) అదే! తమరు అలంకరించుకున్నారు సరే! అమ్మాయిని కూడా అలాగే అలంకరించాలా అండీ?

**దుర్గమ్మ :** ఏం?...ఎందుకు అలంకరించొద్దు....దానికి మాత్రం బాల తొడుగు చేయించలా నేను? కన్యధార పోసేటప్పుడు అమ్మాయికున్న ఆ నగలు పెట్టొద్దా?

**గరుడాచలం :** ఇవన్నీ సింగారించుకుని పీటల మీద కూర్చుంటే అమ్మాయిని ఓ వింత జంతువును చూసినట్టు చూస్తారు... అట్లా హాయిగా ఉండనివ్వవు గదా!

**దుర్గమ్మ :** నేను చెప్పినట్టు ఎప్పుడు విన్నారు గనక? అట్లా బోసిగా కూర్చోబెడితే వాళ్ళమ్మ దానికి నగలే చేయించలేదమ్మా – అని నన్ను ఆడిపోసు కోవడానికా? అసలే ఎదురింటి సుబ్బలక్ష్మమ్మగారు ఏం వంకలు పెడదామా అని కాచుక్కూచుంది. (శకుంతలతో) నువ్వు కానీమ్మా..... ఆయన మాటలకేం గాని –

**గరుడాచలం :** (కోపంతో) చెబితే నువ్వు మనిషివేనా? ఇవ్వాళ్ళ రేపూ పిల్లలకి అవన్నీ నచ్చవని తెలుసా?.... అది ఫాషను గాదంటే వినవేం?

**దుర్గమ్మ :** దానిక్కూడా పాషన్లుంటాయా ఏమిటి?

**గరుడాచలం :** పాషన్‌కాదు; ఫాషన్ –

**దుర్గమ్మ :** ఏదో ఒకటి లెద్దురూ..... కాని ఈ బంగారం నగలు పెట్టకపోతే మగ పెళ్ళివారు మనల్ని ఆడిపోసుకోరుటండీ? అమ్మాయికి ఇవన్నీ ఉన్నాయని వియ్యపురాలికి నేను ముందే చెప్పాను.

**గరుడాచలం :** నువ్వు ముందే చెబితే, అమ్మాయి కాపరానికి వెళ్ళేటప్పుడు దాని కొంగున కట్టి పంపు.... అంతేగాని –

**దుర్గమ్మ :** ఒక్కగానొక్క కూతురు... దాన్ని ఎట్లా అలంకరించాలో – అది కూడా నా ఇష్టప్రకారం జరగడానికి వీలు లేదన్న మాట!

**గరుడాచలం :** ససేమిరా వీల్లేదు.

**దుర్గమ్మ :** నా అచ్చటా ముచ్చటా తీరడం మీ కిష్టం లేదు.

**గరుడాచలం :** ఎందుకిష్టం లేదు? నువ్వా నగలు, వంకీలు, వడ్డాణం, వగైరాలన్నీ దిగేసుకుంటే నేను కాదన్నానా? అమ్మాయికి పెట్టద్దనే నేననేది.

**దుర్గమ్మ :** దాని పెళ్ళి నాడుకూడా నా మీద ఇలా విరుచుకు పడాలని రాసి పెట్టాడా భగవంతుడు. ఎక్కడెక్కడి నమూనాలు చూసి చేయించానీ నగలు. అది ఇవ్వాళ పెట్టుకుంటే చూద్దామని ముచ్చట పడ్డాను. దాని పెళ్ళినాడు కూడా – (కళ్ళ నీళ్ళు తుడుచుకుంటుంది)

**గరుడాచలం :** నువ్వంత శోకన్నాలు పెట్టడానికి ఏమయిందిప్పుడు? నువ్వు ఎన్ని

చెప్పినా, దానికా నగలన్నీదిగేసి పెళ్ళి పీటలమీదికి తీసుకురావడానికి నేనొప్పను...సరా?

(గబగబా వాకిట్లోకి వెళ్ళిపోతాడు)

**దుర్గమ్మ :** తీసెయ్యండమ్మా, తీసెయ్యండి....ఎడ్డెం అంటే తెడ్డెం అనే మనిషితో ఏం చెప్పి ఏం లాభం?....అందరూ నన్ను చూసి ఫక్కున నవ్వితే కాని ఆయన కళ్ళు చల్లబడవు. (ఏడుస్తూ ఇంట్లోకి వెళ్ళిపోతుంది)

(శకుంతలా, పల్లవి నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోతారు)

**శకుంతల :** (తేరుకుని) ఇవీన్న మామూలే గదే, పిచ్చిదానా? వెళ్ళు, వెళ్లి చీరె మార్చుకుని రా.

**విశాల :** (లోపలనుంచి వస్తూ) వెధవ సంత అని వెధవ సంత....ఒక్క పని తెమలనివ్వరు గదా! ఈ పిల్ల వెధవొకడు...నేను తీసుకున్న దగ్గిర్నుంచీ "అమ్మా! నాన్నే!" అంటూ ఒకటే ఏడుపు...ఆయనేమో ఈ స్నేహితరత్నంతో విడిదికి వేం చేశారుట....రానీ, చెబుతాను.

(అని చీరెతెచ్చి పల్లవికి ఇస్తుంది. లోపలనుంచి పిల్లవాడు "అమ్మా! ఆ....ఆ....."అంటూ ఏడుపు)

వస్తున్నారా........(అని ఆదరాబాదరాగా వెళ్ళిపోతుంది)

**సన్యాసిరావు :** (గదిలోనుంచి వస్తూ) ఏమేవ్....ఒసే...ఏదమ్మా మీ దొడ్డమ్మ? టిఫిన్ పడేసిపోయింది నా ముందు...పంచదార లేకుండా కాఫీ పట్రావే అన్నాను......అంతే! ఆ పళంగా అదృశ్యమయిపోయింది..... నాకు అసలే ..............! ఆ మాత్రలేం చేసిందో తెలియదు. అరగంటయింది, మనిషి కనిపించదు...

**శకుంతల :** ఏం పని తొందరలో ఉందో అన్నయ్యగారూ! మీరు గదిలో కూర్చోండి. నేను కలుపు కొస్తాను.

**సన్యాసిరావు :** దీనికి పనీ, తొందరా! కాస్త నువ్వన్నా కనికరించి తెచ్చిఇవ్వమ్మా! ......పొద్దుటినుంచీ కాఫీలేక ప్రాణం కడబడుతోంది...

(నసుగుతూ లోపలికి వెడతాడు)

**శకుంతల :** విశాలా! విశాలా! నువ్వు పల్లవిని తీసుకురా......గౌరీ పూజకు కూర్చోవచ్చేమో అవధాన్లు గారిని అడిగొస్తాను...

(అని వాకిట్లోకి వెడుతూ వుండగా సావిత్రమ్మ వాకిట్లోనుంచి వస్తుంది)

సావిత్రమ్మ వదినా! మీ ఆయన కత్తులూ, కటార్లు పట్టుకుని వచ్చాడు...

**సావిత్రమ్మ :** ఆయనకి కత్తులూ, కటార్లు ఎందుకే? అదేదో కాలిమీద వేసుకుంటే ఏం కాను? అసలే సుగరు మనిషి కూడాను.

**శకుంతల :** కత్తులూ, కటార్లు నీ మీద నూరడానికమ్మా!

**సావిత్రమ్మ :** అవా? ఇంకెవరిమీద నూరితే ఎవరూరుకుంటారే!...అది వాళ్ళ వంశంలోనే వుంది!....ఈయనింకా నయం. మామూలుగా తిట్లతోనే పోనిస్తారు...ఈయనగారి అన్న గారున్నారు. మామూలుగా తిట్లతోనే పోనిస్తారు. ఈయనగారి అన్నగారున్నారు. ఏదైనా కార్యకరామతులకి వస్తారా – ప్రతి పూటా ఆవిడకి బడిత పూజే!

**శకుంతల :** అమ్మ కడుపున పుట్టిన వాళ్లంతా సంగీత పాటకులేనని – మీ వారి వంశం అంతా వీరాధివీరేలేనన్న మాట!....సరే! మీ ఆయన పంచదార లేని కాఫీ అడిగాడట!...ఊరికే ఇదైపోతున్నాడు. పోయి కాస్త కలిపివ్వరాదూ!

**సావిత్రమ్మ :** ఆ వంటవాణ్ణి అడిగితే కలిపివ్వడుటమ్మా! అంతా చోద్యం కాకపోతేనూ – అయినా తప్పుతుందా? –

(అంటూ లోపలికి వెడుతుంది...శకుంతల వాకిట్లోకి వెడుతుంది.)

(విశ్వం వస్తాడు వాకిట్లోనుంచి, విశాలా, విశాలా అని పిలుస్తూ)

**విశ్వం :** విశాలా! విశాలా!.....ఇక్కడా ఉన్నావు?.....పిల్లాడేడీ?

(విశాల కోపంతో మాట్లాడదు)

మరే! మా వెంకటరత్నం –

(విశాల కోపంగా వెళ్ళిపోతుంది)

వాడు పెళ్ళి అయిపోగానే వెళ్ళి పోతానంటేనూ –

(అని వెనకాలే వెడతాడు)

(పల్లవి ఒక్కత్తే మిగిలింది తెరలో –)

**దుర్గమ్మ :** ఇంకానేనీ సొడ్డన్నాలు భరించలేనమ్మా....... జరిగిన అవమానం చాలు..... ఆయనేం చేసుకుంటారో చేసుకోమను.....

**విశాల :** మీరు నాతో మాట్లాడకండి.....మీ ఇష్టం వచ్చినట్టు తిరగండి.... అడిగితే ఒట్టు....

**సన్యాసిరావు :** నీకు మేమెందుకు కనిపిస్తామే.....అసలు లక్ష్యం లేకుండా పోయింది మనిషంటే –

(కోపమూ, ఏడుపూ, నిశ్చేష్టతా అన్నీ ఒక్కసారే ఆవహించాయి ఆమెని....ఏమీ చెయ్యలేక, అక్కడ ఉన్నవన్నీ చుట్టిముట్టి గబగబా పక్కనున్న bathroom లోకి దభాలున తలుపు వేసుకుంది)

**దుర్గమ్మ :** (వస్తూ, పల్లవి గదిలోకి వెళ్ళడం చూసి) అమ్మడూ! తొందరగా రావే! అవధాన్లు గారు కేక వేస్తున్నారు.....

(అని వెళ్ళబోతుంది)

**పల్లవి :** (లోపలనుంచే) నేను రాను. నేనీ పెళ్ళి చేసుకోను....

**దుర్గమ్మ :** వేళాకోళాలు మాని తొందరగా రా అమ్మా! మీ నాన్న ఇప్పటికే 'తెమల్చరేం?' అంటూ కేక వేస్తున్నారు. (తలుపు దగ్గరకు వచ్చి) నా మాట వినవే తల్లీ! తొందరగా రా –

**అవధాన్లు :** అమ్మా! అబ్బాయికి మంగళస్నానాలయినాయి.....అమ్మాయి ఇక్కడ, అబ్బాయి అక్కడ పూజకు కూర్చోవాలి...రెండు కొబ్బరి బొళ్ళాలు వేరుగా పెట్టించమన్నాను. పెట్టించారా? అన్నీ పెళ్లివాళ్ళకే కొట్టించేస్తున్నారా?... పెళ్ళికూతురు తండ్రిగా రెక్కడ? తెమలండి.... ఈ రోజుల్లో అటు ఆడపెళ్ళివారికి, ఇటు మగ పెళ్ళివారికి కూడా హడావుడీ లేదండీ, అదేమిటో గాని. పెళ్ళి దానంతట అదే జరుగుతుంది. ఇంతదాకా వచ్చింది ఆగి ఏడుస్తుందా ఏమిటి అని వాళ్ళ ధీమా! ముహూర్తం టైంకి పెళ్ళి జరిపించడం అవధాన్లు పనయింది, ఖర్మగాలి.......ఒరే ఆంజనేయులూ – నీ పేరదేనా? ఒక కొబ్బరి బొళ్ళాం కొట్టరా. నాలిక పిడచకట్టుకు పోతోంది....

(వాకిట్లోకి వెడతాడు)

(నాదస్వరం...శకుంతల తలంబ్రాల బియ్యం తీసుకుపోతూ వస్తుంది.)

**దుర్గమ్మ :** శకుంతలా! మీ అన్నయ్య కనిపించారా ఎక్కడేనా?

**శకుంతల :** వదినా! మీరిద్దరూ దాగుడు మూతలాడుకుంటున్నారా ఏమిటి?

**దుర్గమ్మ :** నీ వేళాకోళానికేంగాని.....ఏరీ ఆయన?

**శకుంతల :** మరీ అడిగేవాళ్ళు లేకగాని, ఈసరికి పీటల మీద కూర్చోవలసింది పోయి, ఈ వెతుక్కోవడా లేమిటమ్మా? (నవ్వి) నువ్వు తెములు..... నేను అన్నయ్యను పంపిస్తాను. అన్నట్టు, సాంబ్రాణి పుల్లలు గుచ్చడానికి –

**దుర్గమ్మ :** ఆ కావిడి పెట్టె తీసి చూద్దూ...ఇంతకీ ఆయనెక్కడంట?

(శకుంతల వాకిట్లోకి వెడుతుంది)

(బాత్‌రూం దగ్గరగా వచ్చి) అమ్మడూ! నా తల్లివి గాదూ? తొందరగా రా అమ్మా!...ఏమండోయ్? ఎక్కడ?

(అంటూ లోపలకు వెడుతుంది)

**అహోబిలం :** (వస్తూ) శకుంతలమ్మా! మా గరుడాచలం ఎక్కడ? పెళ్ళికొడుకు తరఫున వాళ్ళు విడిదికి పంపిన కాఫీలు, టిఫిన్లు చాలా లేదని నానా హంగామా చేస్తున్నారు. విడిదిలోకి సిగిరెట్లు పంపాలట!... పెళ్ళికొడుకు స్నేహితులకి ఓ అరడజను చీట్ల పేకలు సరఫరా చెయ్యాలట!...ఇంతకీ అమ్మాయి తయారైందా?

**శకుంతల :** (వెనక్కి వచ్చి) ఇంకా దాని ముస్తాబు పూర్తి అయినట్టు లేదు.

**అహోబిలం :** పెళ్ళికోసం ముస్తాబో, ముస్తాబుకోసం పెళ్ళో తెలిసేడవడం లేదు, ఇవ్వాళా, రేపు.....విడిదికి కాఫీ గట్రా పంపమన్నారు –

**శకుంతల :** ఆ సంగతి కనుక్కోడానికి పెళ్ళికూతురు తండ్రీ కావాలిటండీ?

**అహోబిలం :** అబ్బే! అందుకోసం గాదండీ! అవధాన్లు గారు అడుగుతున్నారు – ఆ అడ్డు కూడా ఇవ్వాళ రాత్రి తీర్చేస్తారా – అని. ఆ సంగతి అడుగుదామని. మన లిస్టులో ఆ కార్యక్రమం రాసుకోలేదు గదా– తీరా అప్పుడొచ్చి అవి కావాలి, ఇవి కావాలి అంటే రాత్రికి రాత్రి అని తెచ్చుకోవదూ?

అయినా వీడు పెళ్ళి కూతురు తండ్రి – ఆ గుంజనానుకు కూర్చోవాలి గాని – అబ్బే! కావడానికి గొప్ప లాయరేకాని, బాధ్యతంటూ తెలియలేదండీ వీడికి...ఈ పెళ్ళికాస్తా అయిపోయాక ఇక తెలియాల్సిన అవసరం లేదు. వాడెక్కడున్నాడో చూడమ్మా...

(శకుంతల వాకిట్లోకి వెడుతుంది) ఏమండోయ్ శేషయ్యగారూ! ఓరి నీ ఇల్లు బంగారం కానూ, ఇటు వినవయ్యా! (అంటూ లోపలికి వెడతాడు)

(ఇంతలో కవిగారు వస్తాడు. ఎవరి కోసమో ఆత్రంగా చూస్తూ వుంటాడు. అహోబిలం లోపలనుంచి వాకిట్లోకి వెళ్ళబోతూ వుంటాడు.)

**శృంగారకవి :** అయ్యా! తమరు –

**అహోబిలం :** ఓహో! పెళ్ళికొడుకు తరఫువారా? విడిదికి కాఫీ టిఫిన్లు వెళ్లిపోయాయండీ! కాఫీ వేడిగా లేదంటేనూ, మళ్ళీ తయారు చేయించి మరీ పంపించాను......

**శృంగారకవి :** అయ్యా! తమరు –

**అహోబిలం :** ఏమిటి? మీకు కాఫీ, టిఫిన్లా? నిక్షేపంగానూ.........పదండి..

**శృంగారకవి :** అయ్యా! తమరు –

**అహోబిలం :** ఇంకేం కావాలండీ? ఏమైనా స్పెషల్‌గా కావాలా? పిల్లలకి పాలు కావాలా? ముసలి వాళ్ళకి మజ్జిగ వగైరా–

**శృంగారకవి :** అయ్యా! తమరు అహోబిలం గారేనా?

**అహోబిలం :** చచ్చి ఏ లోకాల ఉన్నారో. మా అమ్మా, నాన్నా నాకు అహోబిల లక్ష్మీ నరసింహస్వామి అని పేరు పెట్టారు. ఆ లక్ష్మీ నరసింహస్వామి ఏమయినాడో కాని అహోబిలం మిగిలాను...ఇప్పుడు చెప్పండి మీకేం కావాలో?..ఇంతకీ మీరు మగపెళ్ళి వారి తాలూకేనా?

**శృంగారకవి :** బాగా అడిగారు....మగ పెళ్ళివారికి ఆడపెళ్ళివారికి సమానంగా కావలసిన వాడ్ని. నా పేరు శృంగారకవి సర్వారాయుడు.

**అహోబిలం :** ఏమిటేమిటీ? శృంగార –

**శృంగారకవి :** శృంగార కవి సర్వారాయుడు.....

**అహోబిలం :** ఈ పేరు ఎక్కడో విన్నట్టుగా ఉందే!

**శృంగారకవి :** అహ్హాహ్హా!....వినే ఉంటారు.....మీ వంటి పెద్దలదాకా నా పేరు పాకిందంటే అదృష్టవంతుణ్ణే!...నా పేరే చెబుతున్నట్టు నేను శృంగార కవిని. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలలో వధూవరులను పద్యాక్షతలతో దీవించడంలో ఈ సీమసీమకీ నా పేరు చెప్పుకుంటారు.

**అహోబిలం :** చంపావుపో!... పెళ్ళి పద్యాలు రాస్తావా?

**శృంగారకవి :** అమ్మమ్మ! పెళ్లిపద్యాలు అని తేలిగ్గా తీసెయ్యకండి...ఇవ్వాళ కుర్ర కారుకు తెలియదు కాని మీ రోజుల్లో ఏ పెళ్ళయినా పంచరత్నాలు చదవకుండా పూర్తి అయ్యేదిటండి? ఆ రోజుల్లో హేమా హేమీలంతా అటువంటి పద్యాలు రాసినవాళ్ళే కదూ! తిరుపతి వెంకటకవులు, విశ్వనాధవారు, రాయప్రోలు, తల్లావఝుల – అది ఆశ: పంచరత్నాలకి స్వర్ణ యుగం కాదుటండీ!

**అహోబిలం :** అవన్నీ నిజమే కాని శృంగారకవిగారూ! ఆ పంచరత్నాల విషయం నాకు వప్పచెప్పిన జాబితాలో లేదండీ... దానికి మీరు వధూవరుల తండ్రులిద్దర్నీ అడగాలి.

**శృంగారకవి :** మీరు వారిద్దరి తరఫునా పెళ్ళి పందిట్లో నిలబడ్డ మూలస్తంభం లాంటి వారు కాదుటండీ! నేను వాకబు చేసే వచ్చాను.

**అహోబిలం :** నీ అసాధ్యం కూలా! మనిషిని నిలుచున్న పాళంగా ఉబ్బేస్తున్నావు....

**శృంగారకవి :** నిజం చెప్పినా ఉబ్బేయడమంటే ఏం బాగు? ఏదీ, మీరు ఒక్క పద్యం వినండి....ఆ తరువాత మీరే నన్ను బతిమాలి –

**అహోబిలం :** నాకంత టైం లేదయ్యా! అమ్మాయి ఇంకా తయారు కాలేదని అవధాన్లుగారు అరుస్తున్నారు.

**శృంగారకవి :** పోనీ పెళ్ళికి ఇంకా ఆలస్యం ఉంటే చెప్పండి....ఈ లోగా ఆహూతులకు కవితా వినోదం కలిగిస్తాను..ఈ మధ్య నేను రాసిన "జగమంతా ప్రేమమయం" అన్న కావ్యంలో పద్యాల్ని చదవమని ప్రతివాడూ వెంటపడ్డమే! ఆ కవితా వినోదం –

**అహోబిలం :** కవితా వినోదం వద్దు, సింగినాదం వద్దు. మమ్మల్ని ఇట్లా వదలవయ్యా!

**శృంగారకవి :** అమ్మమ్మ! పెద్దలు, మీరే అట్లా అనడం భావ్యం కాదు. చూడండి.... అమ్మాయి పల్లవి. అబ్బాయి! వసంత్! వసంతకాలంలో చిగిర్చిన లేత రెమ్మల మీద కూర్చుని కుహూకుహూ అని కూజితం చేసే కోయిల్ని గురించి రాశాను మొదటి పద్యం –

(బయట నాదస్వరం)

**అహోబిలం :** అదుగో! ముహూర్తానికి టైం అయింది.

(అని వెళ్లబోతాడు)

**శృంగారకవి :** (అడ్డం వచ్చి) అహోబిల లక్ష్మీనరసింమస్వాములవారూ! మీరీ పద్యం విని తీరవలసిందే!...కాచుకోండి.. నా పంచరత్నాలలో మొదటి రత్నం!

మామిడి కొమ్మమీద కల మంత్ర పరాయణుడైన కోకిల స్వామికి –

**అహోబిలం :** ఇదేదో విన్న పద్యం లా వుందే!

**శృంగారకవి :** ఆహా! అరసికేషు – అన్నారు కదండీ! రసికులు కనక ఇట్టే కనిపెట్టేశారు.

**అహోబిలం :** ఇది రాయప్రోలు వారి పద్యం కాదుటయ్యా!

**శృంగారకవి :** కాదనడానికి ఎవరికైనా ఎన్ని గుండెలుండాలండీ!....ఆయన మా భావ కవిత్వ పితామహుడు కనుక, మా అపార గౌరవ మర్యాదలు చూపడానికి ఈ తరం భావకవులం ఆయన మాటలతో మా పద్యాలు ప్రారంభిస్తాం.....ఇంతకీ ఆ తరువాత చూడాలి ఈ పద్యంలో సారస్యం! (గొంతు సవరించుకుంటాడు)

**అహోబిలం :** చూడు నాయనా! నీ కవిత్వం వినే ఓపికా, తీరకా రెండూ లేవు నాకు. ....మా గరుడాచలానికి పరిచయం చేస్తాను. ఆ తరువాత నీ అదృష్టం....

**శృంగారకవి :** ఓహో! కవితా రసికులనిపించారు!!

**అహోబిలం :** మళ్ళీ మొదలెట్టావ్ నీ కీర్తిగానం!

**శృంగారకవి :** అయ్యా! ఈ పద్యం ఒక్కటే –

ఈ వసంత నవ యామినీ –

**అహోబిలం :** ఒరేయ్ హనుమంతూ! హనుమంతూ –

**హనుమంతు :** (కొబ్బరి బొళ్ళాంతో వచ్చి) అయ్యా –

**అహోబిలం :** ఒరే! ఇటొచ్చి ఒకటి కొట్టరా –

**శృంగారకవి :** నన్నే!

**అహోబిలం :** కాదయ్యా! కొబ్బరి బిళ్ళాం....(వెడతాడు)

**శృంగారకవి :** అంతేకదా!

**హనుమంతు :** ఇదుగోనండయ్యా! లేత కొబ్బరి బొళ్ళాం –

**శృంగారకవి :** ఓయీ, హనుమంతూ! నా కవితా ప్రవాహాన్ని నీ కొబ్బరి నీళ్ళతో అడ్డం వెయ్యలేవు.....(హనుమంతు వెళ్ళబోతాడు)
సరే, సరే! ఇటు తీసుకురా! నువ్వు చిన్న బుచ్చుకోవడం నా కిష్టం లేదు. (ఒక చేత్తో కొబ్బరి బొళ్ళాం పట్టుకునే –)
ఈ వసంత నవయామినీ కుహూ కుహోరవవలు
లన్నియును పల్లవించిన వీ శుభప్రాణి గ్రహణవేళ –
ఆహా! ఏం పద్యం రాశావయ్యా శృంగారకవి సర్వారాయుడు! –
(అంటూ వెడతాడు)

(గరుడాచలం మేడమీదకు వెళ్ళబోతూ ఉంటాడు.....వెనకాల గదిలోనుంచి దుర్గమ్మ పిలుస్తూ వస్తుంది)

**దుర్గమ్మ :** ఏమండీ! ఏమండోయ్! మిమ్మల్నే! ఇందాకట్నుంచి వెతుకుతున్నాను.... ఇక్కడేం చేస్తున్నారు?

**గరుడాచలం :** (వ్యంగ్యంగా) ఇక్కడ కోతులాడుతుంటే చూస్తున్నాను....ఏమిటట్లా భరతనాట్యం చేసుకుంటూ వస్తున్నావ్? ఏమైంది?

**దుర్గమ్మ :** మీ అమ్మాయి, మీరు నన్ను భరతనాట్యం ఏం ఖర్మ, కథాకళి ఆడించేస్తున్నారు.....ఒకసారి అర్జంటుగా మేడమీదకు పదండి.......

**గరుడాచలం :** ఓహో! ఏమీ నా భాగ్యము! ఇది వలపుల పిలుపా, దుర్గా!

**దుర్గమ్మ :** నా ఖర్మకి ఇప్పుడదొక్కటే తక్కువైంది....కొంపలంటుకుంటున్నాయి, ఒకసారి పైకి పదండి.

**గరుడాచలం :** ఏమిటి? మేడమీదా? ...నువ్వు కళ్ళు తెరిచివుంటావ్? ఆ కోపారుణిత నేత్రాలకి కొంపలేం ఖర్మా?

**దుర్గమ్మ :** (గద్గదికంగా) అంతే లెండి...నేనేం చెప్పినా మీకు వేళాకోళమే! నా బతుకే అంత!...ఇవాళ నలుగురిలో కూడా తలవంపులు తెప్పించకండి.

**గరుడాచలం :** ఓహో! నీ కోపారుణిత నేత్రాలకే కాదు, నీ సజల నయనాలకు కూడా కొంపలంటుకునేటట్టున్నాయి... ఏమిటి సంగతి?

**దుర్గమ్మ :** మీరట్లా సూటిపోటి మాటలంటున్నారు....ఆ తరువాత నేను చెప్పలేదని మాత్రం నా మీద ఘుమికీలు తియ్యకండి........

**గరుడాచలం :** (రెచ్చిపోయి) ఏమయింది? అసలు సంగతి చెప్పి ఏడ్వవేం?

**దుర్గమ్మ :** ఒక్కసారి పైకి పదండి – అంటే కదలరేం?

**గరుడాచలం :** నువ్వొక పళాన తేలిస్తే ఇంకా లేనదేముంది? పద – నువ్వెక్కడ నిలబడ మంటావో అక్కడే నిలబడి ఆ అంటుకున్న కొంపల్ని చూసొచ్చాకనే పిల్ల పెళ్ళి చేద్దాం.....

(అహోబిలం తలుపు తెరుస్తాడు.....నాదస్వరం, డోలు కీర్తన పై కాలంలోకి వచ్చి ఆగిపోతాయి)

**అహోబిలం :** ఏమిరా గరుడాచలం! ఎక్కడ అంతర్ధానమై పోయావ్? అదుగో అవధాన్లు గారు కేకలేస్తున్నారు.......మీ దంపతులు పీటల మీదికి రావాలంటున్నారు....అన్నట్టు మనకు కాడి ఉంచి మంగళసూత్రం కట్టించే అలవాటు ఉందా అని అడుగుతున్నాడు అవధాన్లు గారు.....
(నాదస్వరంలో మాటలు ............)

(గరుడాచలం అహోబిలంతో మాట్లాడడానికి బయటకు వస్తాడు)

**శృంగారకవి :** (వాళ్ళిద్దరి మధ్యకీ వచ్చి) అయ్యా! వీరేననుకుంటాను పెళ్ళికూతురు తండ్రిగారు –

**అహోబిలం :** ఆగవయ్యా! అవతల ముహూర్తం టైం అవుతుంటేను –

**శృంగారకవి :** ముహూర్తం కావడమేమిటి, పంచరత్నాలు –

**అహోబిలం :** ఆగమన్నానా?

**గరుడాచలం :** ఏమిట్రా –

**శృంగారకవి :** (అహోబిలం మాట్లాడబోతుండగా అడ్డం వచ్చి) అయ్యా! నా పేరు శృంగారకవి సర్వారాయుడు.....మంచి కవిత్వం రాస్తాను....మీ అమ్మాయి వివాహ సందర్భంలో పంచరత్నాలు రాసి తెచ్చాను...

**గరుడాచలం :** ఇప్పుడవన్నీ కుదరదులెండి......

**శృంగారకవి :** అమ్మమ్మ......ఒక్క పద్యం వింటే మీరే బతిమాలి –

**అహోబిలం :** అమ్మో! ఇప్పుడు చదవకు.....పెళ్ళి అయిపోగానే నీకు ............ ఇప్పిస్తాను....

**శృంగారకవి :** ఆహాహా! ఎంతయినా మీ కవి హృదయం, మీరసికత –

**అహోబిలం :** ఒరేయ్! హనుమంతూ!

**శృంగారకవి :** ఒద్దులెండి...... పెళ్ళిపందిట్లో వేచి ఉంటాను (వెడతాడు)

(గది లోపల)

**దుర్గమ్మ :** (బాత్‌రూం దగ్గరకు పోయి) అమ్మడూ! ఇహనయినా మొండి పట్టు మాని బయటకు రావే! నాకేం! మీ నాన్న గారు వచ్చేస్తున్నారు ఆయన కోపం నీకు తెలుసుగా! (లాలనగా) ఏం కావాలి నీకు? భయంగా ఉందా? అయినా మొగుణ్ణి కొంగున కట్టుకు తిప్పుకునే ఈ రోజుల్లో భయమెందుకే? మా రోజుల్లో భయం వేసేదంటే అర్థం ఉంది. మీ నాన్నగార్ని చూశావుగా, ఎంత మొండి ఘటమో? అటువంటి వాళ్ళను కట్టుకోవడానికి భయపడాలిగాని –

**గరుడాచలం :** (వాకిట్లో, అవధాన్లుతో) ఇదుగో! చిటికెలో వచ్చేస్తున్నాం.

**దుర్గమ్మ :** అరుగో! మీ నాన్నగారు వచ్చేస్తున్నారు. అమ్మడూ! నీ కోసం కాక పోయినా, నా కోసమన్నా బయటకి రావే! మీ నాన్న నన్ను చంపుతారే! (మృదంగం మీద తన్యా వర్తనం)

**గరుడాచలం :** (వస్తూ) ఏమిటక్కడ దిష్టిబొమ్మలా నిలబడిపోయావ్? పిల్చిన వాళ్ళంతా వచ్చి మన కోసం అడుగుతున్నారు....ఆలస్యం అవుతోందని అవధాన్లు గారు తొందర చేస్తున్నారు...ఈ పూట తెముల్తావా, లేదా?

**దుర్గమ్మ :** అనండి, అనండి......నా తలరాత ఇట్లా రాసివుంటే మిమ్మల్నేం లాభం?

**గరుడాచలం :** ఇంతవరకు బాగానే రాసివుంది కాని, ఇహ ముందు ఎట్లా రాసివుందో మాత్రం చెప్పలేను. (దుర్గమ్మ మంచంమీద కూర్చుండి పోతుంది) ఏమిటి ఏకంగా కూర్చుండి పోయావు? ఇవ్వాళ నీ ఒక్కగానొక్క ముద్దుల కూతురు పెళ్ళి అని తెలుసా? దీని కోసం నా చేత లక్షలరూపాయలు ఖర్చు చేయిస్తున్నావని తెలుసా? ఈ పెళ్ళి చేయించి అవధాన్లు మరో భారసాలో, శోభనమో చేయించడానికి పోవాలని తొందర పడుతున్నాడు.

**దుర్గమ్మ :** ఒక్క నిమిషం శాంతంగా కూర్చోండి...మీతో మాట్లాడాలి.

**గరుడాచలం :** ఇప్పుడు శాంతంగా, కూర్చుని మాట్లాడాలా? ఇరవై అయిదేళ్ళ నుంచీ

మాట్లాడుతూనే ఉన్నావుగదే! ఈ పెళ్ళయిపోయి, అబ్బాయి అమ్మాయి మన ఖర్చుతో హనీమూన్‌కి వెళ్ళాక, ఇహ మాట్లాడుతూనే ఉందువు గాని –

(అహోబిలం తలుపు తీసి తొంగి చూస్తాడు. లోపలివాళ్ళు గమనించరు)

**అవధాన్లు :** 'మమ' అనుకో నాయనా!

ఉత్తిష్ఠంతు భూత పిశాచ: ఏతే భూమి భారకా:

ఏతేషా మ విరోధేన బ్రహ్మ కర్మ సమారభే...........

**అహోబిలం :** గరుడాచలం, గరుడాచలం (గరుడాచలం, దుర్గమ్మ వినరు)

**గరుడాచలం :** ఇహ మాటలు కట్టి పెట్టి పీటల మీదికి పద.

**దుర్గమ్మ :** నా మాట వినరుగా!

**గరుడాచలం :** ససేమిరా కుదరదు.

**దుర్గమ్మ :** మీరు ఇప్పుడు, ఈ క్షణంలో నా మాట వినకపోతే ఈ పెళ్ళి జరగదండీ!

(అహోబిలం వాకిటి దాటి వెళ్ళి నడవలో ఉన్న శకుంతలతో –)

**అహోబిలం :** ఏమిటి శకుంతలా! లోపల గరుడాచలమూ, అమ్మాయి ఏదో మాటా మాటా అనుకుంటున్నట్టున్నారు!

**శకుంతల :** ఈ మాత్రం తెలియదా మామయ్య! అది వాళ్ళ సరసం....లోపల పల్లవి డ్రెస్ చేసుకుంటున్నట్టుంది. ఈ లోపల వీళ్ళు ఉబుసుపోక ఓ చిన్నపాటి పింగ్ పాంగ్ ఆడుతున్నారు. అంతే! మీరు పదండి.... నేను – అద నెరిగి సంధి మొనర్చెద గాక! (కూనిరాగంతో) సంధి మొనర్చి మా భరతవంశము నిల్పుము; కాదయేని –

**గరుడాచలం :** మాతి వుండే మాట్లాడుతున్నావా? ఇంకా ఆలస్యం చేస్తే పెళ్ళికూతురు ఎక్కడా కనిపించడం లేదనీ, దాన్ని తీసుకురావడానికి వాళ్ళ అమ్మ, నాన్నా దాని వెనకాలే వెళ్ళారని అనుకోగలరు.... అయిన సంబరం చాలుగాని, అమ్మాయిని తీసుకుని పద.

**శకుంతల :** అమ్మో! సంధి మాట యట్లుండె....ప్రాణ రక్షణ అవశ్యకర్తవ్యంబు గదా!

(మెల్లగా వెళ్ళిపోతుంది)

**దుర్గమ్మ :** అమ్మాయిని గురించి మాట్లడదామనే పైకి రమ్మన్నానండీ!

**గరుడాచలం :** ఏమిటీ! అమ్మాయిని గురించా?

**దుర్గమ్మ :** నేను చెప్పే విషయం వింటే మీరైనా డీలా పడతారు.

**గరుడాచలం :** (ఆదుర్దాగా) ఏమైంది? అమ్మాయికి ఒంట్లో బాగాలేదా?

**దుర్గమ్మ :** బాగానే....ఉం.....దనుకోండి.

**గరుడాచలం :** బాగానే ఉంది అనుకోడమేమిటి? బాగుందా, లేదా?

**దుర్గమ్మ :** బాగానే వుంది.

**గరుడాచలం :** అయితే పీటలమీదికి పదండి. (ఇంటి లోపలికి చూస్తూ) అమ్మాయి, పల్లవీ! నువ్వు కావాలనన్నట్టు వచ్చిన వాళ్ళందరికీ కొబ్బరిబొళ్లాలు కొట్టిస్తున్నాను. మగ పెళ్ళి వారు ఒక్కొక్కళ్ళు అరడజను బొళ్ళాలు లాగించేస్తున్నారు..అహోబిలం ఘనంగా మర్యాదలు చేస్తున్నాడు. సరా? ఇహ రా....అమ్మాయి ఏదీ?

**దుర్గమ్మ :** నన్నేమీ అడక్కండి.....దీన్తో నాకేం సంబంధం లేదు.

**గరుడాచలం :** దేంతో సంబంధం లేదంటావ్? ఏం చేశావు నువ్వు?

**దుర్గమ్మ :** నాకేమీ సంబంధం లేకపోయినా, చివరికి నన్నే అంటారు మీరు.

**గరుడాచలం :** ఓహ్!....నాకు పిచ్చి ఎక్కించేస్తున్నావ్! అమ్మాయి ఏదీ? ఎక్కడుంది? ఏం జరిగిందో ఎప్పుడైనా డైరెక్టుగా, సూటిగా చెప్పేడిశావా నువ్వు?

**దుర్గమ్మ :** అదుగో! అప్పుడే మొదలుపెట్టారు...నన్నేమీ అనినని మాటివ్వండి...

**గరుడాచలం :** ఏమయినా అంటానో లేదో నాకు తెలియదుకాని, ఏం చేస్తానో మాత్రం తెలుసు...ఇంకో క్షణంలో అమ్మాయి ఎక్కడ వుందో చెప్పకపోతే నీ గొంతు దాని గొంతు పిసికి పారేసి, నేను మన మేడమీద నుంచి కిందికి దూకుతాను...సరా?

**దుర్గమ్మ :** నా గొంతు నొక్కుతూనే ఉన్నారుగా ఇన్నాళ్ళు....ఇప్పుడొక్కసారి పీక పిసికి పారెయ్యండి....మీ ఫీడా ఒదిలిపోతుంది.

**అహోబిలం :** (మళ్ళీ తలుపు తీయడానికి భయంగా ముందుకు వస్తూ) సావిత్రమ్మగారూ! లోపలికి వెడితే ఏం తంటానో, వెళ్ళకపోతే ఏం తంటానో తెలిసి ఏడవడం లేదు. ఇక్కడ చూస్తే వీళ్ళు తలుపులు బిడాయించుకుని మరీ కొట్టాడుకుంటున్నారు. అక్కడ చూస్తే

పెళ్ళికొడుకు తండ్రి, అవధాన్లు కలిసి నా ప్రాణాలు కొరుక్కు తింటున్నారు, వీళ్ళిద్దరూ ఏరీ అని.....అడకత్తెరలో పోక చెక్కలా వుందినా పరిస్థితి.......ఇంతకీ అమ్మాయి గౌరీ పూజ –

**శకుంతల :** అమ్మాయి గౌరీ పూజ సంగతేమోగాని, అన్నయ్య మాత్రం చేస్తున్నాడు–

**అహోబిలం :** ఏమిటి?

**శకుంతల :** దుర్గాపూజ!

**సావిత్రమ్మ :** నీదంతా మరీ చోద్యమే శకుంతలా!...ఆగండి నేను పిలుచుకొస్తాను. (బిగ్గరగా) అమ్మాయ్....అమ్మాయ్......దుర్గా!

**శకుంతల :** అమ్మాయిని రేపో మాపో అత్తవారింటికి పంపిస్తోందా మా వదిన.........రేపటి నుంచీ వీళ్ళకి రెండో హనీమూన్....అందుకు తయారు తింటోంది.

**సావిత్రమ్మ :** ఆ తినేదేదో పెళ్ళయ్యాక తిన కూడదూ?

**4శకుంతల :** (నవ్వి) ఒదినా.....ఒదిన!

**సావిత్రమ్మ :** (బిగ్గరగా) అమ్మాయ్ దుర్గా.......గరుడాచలం....

**గరుడాచలం :** అయిపోయింది వదినా, వస్తున్నాం......(దుర్గమ్మ దగ్గరగా వెళ్ళి) వాళ్ళు పిలుస్తున్నారు....తొందరగా చెప్పు....అమ్మాయెక్కడ?

**దుర్గమ్మ :** మంగళస్నానాలు అయ్యాక, బట్టలు వేసుకు వస్తానని మమ్మల్నందర్నీ వెళ్ళమంది........ఆ తరువాత ఈ స్నానాల గదిలోకి వెళ్ళి లోపల గడియ వేసుకుని, నేను బయటకు రానంటూ కూర్చుంది...ఈ పెళ్ళి చేసుకోదట!

**గరుడాచలం :** ఏం? ఎందుకు చేసుకోదుట? ఇదే మన్నా బొమ్మల పెళ్ళి అనుకుంటోందా?

**దుర్గమ్మ :** (గాద్గదికంగా) నాకు తెలుసు....మీరు నామాట నమ్మరని...

**గరుడాచలం :** ఈ బాత్ రూంలోనేనా?

**దుర్గమ్మ :** (అవునని తూపుతుంది)

**గరుడాచలం :** (గబగబా తలుపు కొడుతూ) అమ్మడూ....అమ్మడూ...(నిశ్శబ్దం) నిజం చెప్పు.....నువ్వు ఏమన్నావ్ అమ్మాయిని?

**దుర్గమ్మ :** (గొంతు పెద్దది చేసి) నాకు తెలుసు...నాకు తెలుసునండీ...... ఉరుమురిమి మంగలం మీద పడుతుందని....నేనేగా మీకు లోకువ...అనండి, అనండి...

**గరుడాచలం :** అనడం కాదే! ప్రత్యక్షంగా కనిపించడంలా? నువ్వేమీ అనకపోతే– నిక్షేపంలాంటి 23 ఏళ్ళ ఆడపిల్ల ...... ఆరునెల్లుగా ఆ అబ్బాయినే చేసుకుంటానని చెవి కింద జోరీగలా అరిచిన పిల్ల, మగ పెళ్ళివారికి పట్టుతాపితాలు, వచ్చిన జనానికి కొబ్బరి బొళ్ళాలు ఇవ్వాలని పట్టు పట్టిన పిల్ల – లక్షణంగా పెళ్ళి పీటలమీదికి పోక, అరగంట ముందు అకస్మాత్తుగా స్నానాల గదిలోకి పోయి, తలుపులు బిడాయించుకుని, నాకీ పెళ్ళొద్దు, ఫో – అంటుందా?

ఏమన్నావ్ నువ్వు దాన్ని?

**దుర్గమ్మ :** దాన్ని తిట్టాను, కొట్టాను, రక్కాను.....సరా? ఇప్పుడు మీ అక్కసు తీరిందా? నా అడ్డ వంకీలు, పాపట బిళ్ళ కనిపించక నేను సామాన్ల గదిలోకి పోవడమేమిటి నేను వచ్చేసరికి – కంచి పట్టు చీరె కట్టుకువస్తానన్న మనిషి నీళ్ళ గదిలోకి పోయి తలుపులు బిడాయించుకోవడమేమిటి? మీరొచ్చి నా మీద ఘుమికీలు తియ్యడమేమిటి? (ఏడుస్తూ) అంతే లెండి..... నా కూతురు పెళ్ళినాడు కూడా నాకు మనశ్శాంతి ఉండకూడదని రాసి పెట్టాడు భగవంతుడు..

**గరుడాచలం :** (బాత్‌రూం వైపుగా చూసి) ఇది బయటకు ఎందుకురాదో నేను చూస్తాను...(గబగబా తలుపు బాదుతూ) అమ్మడూ! అమ్మడూ!..... పల్లవీ (తలుపు తన్నుతాడు)

**దుర్గమ్మ :** ఏమండీ! ఏం చేస్తున్నారు?

**గరుడాచలం :** (మళ్ళీ తన్నడానికి కాలు ఎత్తి) కనిపించడంలా? (తంతాడు).... ముందు పెళ్ళో పెళ్ళో అంటూ ప్రాణం తీసిన నీ కూతుర్ని నీళ్ళ గది బయటకు లాక్కొచ్చి పీటల మీద కుదేస్తాను. ఆ మూడు ముళ్ళూ పడ్డ తరువాత – (కచ్చగా) అప్పుడు మనం తీరిగ్గా కూర్చుని మాట్లాడుకుందాం. (మళ్ళీ తలుపు తడుతూ) అమ్మడూ! నేను

నాన్నని...నువ్వూ, నీ 5000 రూపాయల చీరె బయట కొస్తారా, రారా?

**దుర్గమ్మ :** అసలే దానిది పేద గుండె....అట్లా అరవకండీ......అట్లా అరిస్తే అది బయటకు వస్తుందిటండీ?

**గరుడాచలం :** ఎందుకు రాదనే నేనడిగేది? నేనేం తక్కువ చేశాను కనుక? పిల్లాడికి వాళ్ళడిగినవన్నీ ఇస్తున్నానా, లేదా? పట్టు తాపితాలంటే సరేనన్నాను. ఆడపడుచు లాంఛనాలు భారీగా జరగాలంటే సరేనన్నాను...వాళ్ళ రిసెప్షన్ కూడా నేనే ఇవ్వాలంటే చచ్చుకుంటూ ఒప్పుకున్నాను... ఔనా? పిల్చిన పెద్దమనుషులు, పెళ్ళివాళ్ళు కొబ్బరి నీళ్ళు పీల్చేస్తూ ముహూర్తం కోసం కాచుక్కూర్చున్నారు. రెండు వేలు తీసుకుని నాదస్వరం వాడు ఊదరగొట్టేస్తున్నాడు...రెండున్నర వేలు తీసుకున్న అవధాన్లుగారు ఇంకో బారసాల చేయించాల్ట, తొందర పడుతున్నాడు. (మళ్ళీ గబగబా తలుపు బాదుతూ) అమ్మడూ! తలుపు తీస్తావా? లేక స్నానాల గదిలోనే మంగళసూత్రం కట్టించెయ్యమంటావా?

**హనుమంతు :** (గబగబా, రెండు బొళ్ళాలు పట్టుకుని పరిగెత్తుకొస్తాడు) పిల్చారా బాబూ?

**గరుడాచలం :** నిన్నెవరు పిల్చార్రా?

**హనుమంతు :** పోనీ ఈ నీళ్ళు తాగండి.....ఏడి ఇట్టే దిగిపోద్ది –

**గరుడాచలం :** నీ బోడి సలహాలు అక్కర్లేదు...పందిట్లోకి తగలడు....

**హనుమంతు :** (బెరుగ్గానే) అమ్మగారూ....మీకు –

**దుర్గమ్మ :** కొబ్బరి నీళ్ళు తాగినట్టుగానే ఉంది నా బతుకు –

(హనుమంతు భయంగా జారుకుంటాడు)

**గరుడాచలం :** ఆ తలుపు దగ్గరకు వేసి చావు......(హనుమంతు తలుపు దగ్గరకు లాగా, వెడతాడు) (మళ్ళీ తలుపు తడుతూ) అమ్మాయ్! తొందరగా బయటకు వస్తున్నావా, లేదా? అసలు విషయం చెప్పకపోతే మాకేం తెలుస్తుంది?...(బిగ్గరగా) అమ్మడూ!

**దుర్గమ్మ :** కొంచెం మెల్లగా పిలవండి......ఎవరైనా వింటే ఎంత అప్రదిష్ట?

**గరుడాచలం :** ఇంకా ఎంతసేపు దీన్ని రహస్యంగా ఉంచుతావ్? అసలే పెళ్ళికొడుకు తండ్రి అగ్నిహోత్రావధాన్లు..తల్లేమో హార్ట్ పేషెంటు....ఈయన అగ్గిరాముడయిపోయి, ఆవిడ ఫిట్లు వచ్చి పడిపోయి, ఛీ – ఈ సంబంధం మాకొద్దు అనేదాకా నీ ముద్దుల కూతురు పల్లవి మనకు దర్శనం ఇచ్చేట్టు లేదు....

(మళ్ళీ తలుపు కొడుతూ) అమ్మడూ! బయటకు వస్తావా, రావా? తొందరగా రాకపోతే పెళ్ళికొడుకు కాదుగదా, పెళ్ళి చేయించే అవధాన్లుగారు కూడా ఉండడు, నీయిష్టం..

**దుర్గమ్మ :** అమ్మాయికి ఎందుకో భయం వెయ్యకపోతే అట్లా పోయి దాక్కోదండి!

**గరుడాచలం :** (అనుకరిస్తూ) భయంవేస్తోందా? ఎందుకట? ఆ అబ్బాయి ఏమన్నా మాయా శశిరేఖా? అతను తన్ను పెళ్ళి చేసుకోకపోతే ఆ జన్మ బ్రహ్మచారిణిగా ఉంటానన్నదన్నావ్! ఇప్పుడెవర్ని చూసి బయపడుతున్నదంటావ్?

**దుర్గమ్మ :** ఇప్పుడు మనసు మార్చుకుని ఉండగూడదా ఏమిటీ?

**గరుడాచలం :** అని నీతో చెప్పిందా? మనసు కుదుర్చుకున్నందుకు నా చేత ఇంత ఖర్చు పెట్టిస్తున్నది! ఇహ మార్చుకుంటే ఎంత ఖర్చు పెట్టిస్తుందో?

**దుర్గమ్మ :** మీకెప్పుడూ ఖర్చును గురించిన ఆలోచనే గాని, అమ్మాయి మనసు ఎందుకు బాధపడుతున్నదోనన్న ఆలోచన లేదు.

**గరుడాచలం :** అదే నేనూ అడిగేది. ఎందుకు బాధపడాలి? ఏం తక్కువైందని? (అనుమానంగా) నువ్వేమయినా అమ్మాయికి నూరిపోశావా?

**దుర్గమ్మ :** సడిపోయింది...ఆడలేక మద్దెల ఓడని......అమ్మాయిని బయటకు రప్పించడం చేతకాలేదు కాని, నా మీద ఎందుకూ అక్షింతలు?

**గరుడాచలం :** అమ్మాయి అసలు స్నానాల గదిలో ఉన్నదంటావా?

**దుర్గమ్మ :** లేకెక్కడికి పోతుందండీ? నా అడ్డవంకీలూ –

**గరుడాచలం :** (అరుస్తూ) ఓ! నీ అడ్డవంకీలూ, నువ్వూ।

**దుర్గమ్మ :** మీ అరుపుల్లో నాకు గుండె నొప్పి తెప్పిస్తున్నారు.....అప్పుడే నాకు కాళ్ళు ఒణుకుతున్నాయి.......బి.పి. వస్తోందో ఏమిటో?

**గరుడాచలం :** అది ఏ అఘాయిత్యానికయినా దిగలేదు కదా!

**దుర్గమ్మ :** అసలే కాళ్ళూ చేతులూ వణుకుతున్న దానితోటండీ మీ అఘాయత్యం మాటలు?

**గరుడాచలం :** ఇంతకీ అమ్మాయి ఆ నీళ్ళగదిలో ఉందో లేదో చూడు.

**దుర్గమ్మ :** ఉన్నదండీ......చూడండి! నాకెట్లా చెమటలు పోస్తున్నాయో!

**గరుడాచలం :** అమ్మాయి అక్కడ ఉందో లేదో చూస్తావా, పోలిసుల్ని పిలిచి తలుపులు బద్దలు కొట్టించమంటావా?

**దుర్గమ్మ :** (గాద్గదికంగా) మీరు చూడకూడదా ఏమిటీ?

**గరుడాచలం :** అది స్నానం చేస్తోందేమోనని –

**దుర్గమ్మ :** పెళ్ళికి పదినిమిషాలు ముందా?

**గరుడాచలం :** ఇంకేం పెళ్ళి? చేసుకోనన్నదని చెప్పావ్?

**దుర్గమ్మ :** స్నానం చేస్తుంటే చప్పుడు వినపడదుటండీ?

**గరుడాచలం :** నీకా? చెవులకు ఆ బాజుబందులు, జుట్టును చెవులమీదకు తీసుకువచ్చి నువ్వు వేళ్ళాడగట్టిన ఆ చెంప స్వరాలు – వీటిలో నువ్వు ఎత్తి పోతల జలపాతం వినే ఛాన్సు కూడా లేదు....ఇంతకీ నువ్వు చూస్తావా, పోలీసుల్ని –

**దుర్గమ్మ :** చూస్తానండీ!.....నాకు తప్పుతుందా?

(భయంకరమైన adventure చేస్తున్నట్టు ధ్వనించే సంగీతం)

(నాలుగడుగులు వంగి నడిచి, అకస్మాత్తుగా)

అయ్యో!

**గరుడాచలం :** ఏమైంది?

**దుర్గమ్మ :** మీరు నన్ను ఊరికే తరుముతూ ఉంటే, చూడండి....చెప్పుకింద పడి బంగారంలాంటి బనారసు పట్టుచీరె – ఎట్లా చిరిగిపోయిందో? ఆరువేలు.........

**గరుడాచలం :** నీ ఆరువేలు గంగలో పొయ్యా!...చూస్తావా, లేదా?

**దుర్గమ్మ :** చూస్తున్నానండీ......(మళ్ళీ adventure సంగీతం) అదుగో! అక్కడే నీళ్ళ గట్టు మీద కూర్చుంది... ముస్తాబయ్యే కూర్చుంది. అమ్మయ్య! ఇహ అలమర తాళం చెవులివ్వండి..ఈలోగా ఇంకో చీరె కట్టుకొస్తాను....

**గరుడాచలం :** నువ్వు ఇంకో చీరె కట్టు కొచ్చే సరికి పెళ్ళి కాస్తా అయిపోయి, వాళ్ళిద్దరూ హనీమూన్‌కి వెడతారు...లే! నన్ను చూడనీ! అదుగో! అక్కడే కూర్చుని ఉంది, కళ్ళు తుడుచుకుంటూ –

**దుర్గమ్మ :** నేను చెప్పలేదుటండీ?

**గరుడాచలం :** (సానునయంగా) అమ్మడూ! తొందరగా రా అమ్మా! మూహూర్తం వేళ దగ్గరపడుతుంది. (కొంచెం కోపంగా) నువ్వట్లా దిగాలుగా కూర్చుంటే ఇక్కడ మాకు కాళ్ళు చేతులు ఏం ఆడతాయి? నీకేం కావాలో చెబితేగదా? నీ సుఖంకంటే మాకు కావలసిందేమిటి? చెప్పు – ఇదుగో నువ్వు రాకపోతే తలుపులు బద్దలు కొట్టయినా నిన్ను లాక్కెళ్ళి పీటలమీద కుదేస్తాను....(మళ్ళీ ఒకసారి లోపలికి చూసి) కొత్త పట్టుచీరె కట్టుకున్నావ్! ఏడ్చిన ఆ కాటుక కళ్ళు ఆ చీరెతో తుడుచుకుంటే అది నాశనం అయిపోతుంది...కళ్ళు తుడుచు కోవాలంటే, పక్కనే ఆ టవల్ ఏడిసిందిగా! (ఏదో ఆలోచించి) ఆ!

**దుర్గమ్మ :** ఈలోగా తాళం చెవులివ్వండీ.....క్షణంలో చీరెమార్చుకొస్తాను..

**గరుడాచలం :** అమ్మడూ! ఇక లాభం లేదు.....తలుపు బద్దలు కొడుతున్నాను...

**దుర్గమ్మ :** బద్దలు కొడతానని అలా వెనక్కు వెడతారేమిటండీ?

**గరుడాచలం :** (వేగంగా వచ్చి తలుపును గూడతో గుద్దుతాడు)

**దుర్గమ్మ :** ఊరుకోండి........ఊరుకోండి..........

**గరుడాచలం :** (బాధగా) అబ్బా!.....(అని కూర్చుండి పోతాడు)

**దుర్గమ్మ :** ఏమైందండీ? ఏమైంది?

**గరుడాచలం :** (బాధగా, మెల్లని స్వరంతో) మన డాక్టరు, పందిట్లో ఉన్నాడు..... పిలు.......

**దుర్గమ్మ :** ఏమైందండీ?

**గరుడాచలం :** ఏమైందా? నా శ్రాద్ధం అయింది......గూడ విరిగింది.......

**దుర్గమ్మ :** ఏదీ! చూడనివ్వండి – (గూడ దగ్గర పట్టుకుని వత్తుతుంది)

**గరుడాచలం :** అబ్బా!..అక్కడే!.......విరిగిందో ఏమిటో?

**దుర్గమ్మ :** (ముంజేతులు, వేళ్ళు కదిలిస్తూ) గూడదగ్గరేనండీ!......చూడండి! ముంజేయి, వేళ్ళు భేషుగ్గా కదులుతున్నాయండీ! ఆ చేత్తో తాళం చెవులివ్వండి, చీరె మార్చుకుని వస్తాను.

**గరుడాచలం :** అబ్బా! (బాధగా, కోపంగా అరుస్తాడు)...ఒరే, హనుమంతూ! (వాకిటి తలుపు తీసిన చప్పుడు..మంత్రాలు వినిపిస్తూ ఉంటాయి)

**అవధాన్లు :** చతుస్సాగర పర్యంతం....... (నాదస్వరం) ఆ నాద స్వరాన్ని ఆపమనండి...... (నాదస్వరం అపండయ్యా అని కేకలు) మీ గోత్రం ఏమిటి నాయనా?

**పెళ్ళికొడుకు :** రెండుచింతల –

**అవధాన్లు :** రెండు చింతల గోత్రోద్భవస్య –...నీ పేరు నాయనా?

**పెళ్ళికొడుకు :** వసంత –

**అవధాన్లు :** అదేం పేరయ్యా? నా బొంద పేరు...ఆడవాళ్ళ పేర్లు పెట్టుకోవడం ఇప్పుడో ఫాషనైపోయింది –

**పెళ్ళికొడుకు :** నా పేరు – వసంత కుమార్ అండీ –

**అవధాన్లు :** అట్లాగా! మంచి పేరు.....వసంతకుమార్ నామధేయస్య – అహంభో అభివాదయే!......(పెళ్ళికొడుకు ఆ మాటలు మళ్ళీ అంటాడు)

**దుర్గమ్మ :** ఒరే! హనుమంతూ! హనుమంతూ!!

**హనుమంతు :** (తొందరగా బొళ్ళాలతో వస్తూ) అమ్మా కొబ్బరినీళ్ళు –

**దుర్గమ్మ :** నీ బొంద......మన డాక్టరుగారు లేరూ – ప్రసాదరావుగారు...... పెళ్ళిపందిట్లో ఉంటారు......తొందరగా రమ్మను.

**గరుడాచలం :** ఒరే హనుమంతూ!.........తొందరలేదని చెప్పు.........

**హనుమంతు :** అయ్యా! మీకు కొబ్బరి బొళ్ళాం –

**గరుడాచలం :** దాన్ని నా నెత్తి మీద కొట్టి పోరా –

**హనుమంతు :** బాబుగారూ –

**గరుడాచలం :** మా అహోబిలాన్ని ఒకసారి పిలు.

**హనుమంతు :** అట్టాగేనండీ......(పోబోతాడు)

**గరుడాచలం :** ఆ బొళ్ళాం ఇటిచ్చిపో –

**హనుమంతు :** (అనుమానాస్పదంగా) బాబుగారూ!

**గరుడాచలం :** ఇవ్వరా (అని అరుస్తాడు)

(గరుడాచలం ఒక్క చేత్తో అది లాగుతూ వుంటాడు.....మంత్రాలు, నాదస్వరం)

(వాకిట్లో)

**సావిత్రమ్మ :** ఏర్రా వీళ్ళు?...వీళ్ళ ఇల్లు నేలగట్టా!.....వస్తున్నాం వస్తున్నాం అంటూనే పుష్కరాలు దాటించేస్తున్నారు!..... అమ్మాయ్, దుర్గా!

**దుర్గమ్మ :** (వాకిట్లోకి వస్తుంది) వస్తున్నాం అక్కయ్యా.........ఇదుగో! అమ్మాయి చిరిగి.....కాదు కాదు.....నా చీరె చిరిగిపోతేనూ......మార్చుకుని వస్తున్నాను......

**శకుంతల :** (నవ్వుతూ) మరి మీ ఆయనేం చేస్తున్నాడు? నీకు చీరె సింగారిస్తున్నాడా? చాలాగాని తొందరగా పీటల మీదకు రండర్రా.... ఎవరెదురుగుండా కనిపిస్తే వాళ్ళనల్లా అడుగుతున్నాడు అవధాన్లుగారు.....

(నాదస్వరం ఉధృతంగా)

(ఒక కుర్రాడు తాతగారిని నడిపించుకుంటూ వస్తాడు)

**కుర్రాడు :** రండి, తాతగారూ! రండి! (గరుడాచలంతో) మరేనండి..... పెళ్ళికొడుకు నాన్నగారండీ......ఈ తాతగారు కాసేపు పడుకుంటారు..... ఆ సంగతి చూడమన్నారండీ......(గరుడాచలం కదలడు) ఈయన పెళ్ళికొడుకు తాతగారండీ! (గరుడాచలం వెంటనే లేస్తాడు, 'రండి, రండి' అంటూ)

**తాత :** (కుర్రాడితో) ఈ ఇల్లు పెళ్ళికూతురు స్వంతమేనట్రా? బాగానే కట్టించారే! పెళ్ళికూతురు తండ్రి గవర్నమెంటు ఇంజనీరా ఏమిట్రా?.....మా బావమరిది ఒహడున్నాడులే! వాడంతే! ఇంజనీరు చేస్తూ లోకుల డబ్బుతో మూడు ఇంద్రభవనాల్లాంటి ఇళ్ళు కట్టించాడు.

**గరుడాచలం :** (నమస్కారం పెడుతూ) పెళ్ళికూతురు తండ్రిని నేనేనండీ......నా పేరు గరుడాచలం... నేను గవర్నమెంటు ఇంజనీరుని, కాంట్రాక్టరుని కాదు..........

**తాత :** కాంట్రాక్టరువా! అందుకే –

**గరుడాచలం :** (పెద్దగా) కాంట్రాక్టరుని కాదండీ.......ప్లీడర్ని......ప్లీడర్ని.

**తాత :** అట్లాగా నాయనా! బాగా, భారీ ఎత్తున ఏర్పాట్లు చేయించావ్! బావుంది......పెద్ద ముండా వాడినా, ఎక్కువ సేపు కూర్చోలేను...

కాసేపు నడుం వాలుద్దామని......ముహూర్తం టైంకి పిలవమన్నాను మా చలపాయిని...

**గరుడాచలం :** (ఇబ్బందిగా) అయ్యో! అట్లాగే! మిమ్మల్ని పిలవకుండా పెళ్ళి అవుతుందా? మీరు విశ్రాంతి తీసుకోండి....

**తాత :** మీ పనులకేం అడ్డం కాదుగదా!

**గరుడాచలం :** అబ్బే! (అని తలను నుదురు కేసి కొట్టుకుని) మీర హాయిగా పడుకోండి.....

**తాత :** చూడు నాయనా! ఇక్కడ bath room ఎక్కడ వుందో చూపించండి....... పెద్ద ముండావాడినా, అస్తమానం......

**కుర్రాడు :** అదుగో! ఆ మూల వుంది .............(అని చూపిస్తాడు)

**గరుడాచలం :** బాత్‌రూమా?......ఇదుగో! క్షణంలో ఏర్పాటు చేయిస్తాను.

**తాత :** ఏమిటి అంటున్నావ్?

**కుర్రాడు :** క్షణంలో ఏర్పాటు చేయిస్తామంటున్నారు.

**తాత :** ఏర్పాటు చేయించడమేమిటిరా? ఇప్పటికిప్పుడు నా కోసం ......... కట్టిస్తాడా ఏమిట్రా? నువ్వంత ఘటికుడిలాగే ఉన్నావులే! (తన జోక్‌కి తానే నవ్వుకుని, పడుకుంటూ) శ్రీరామ చంద్రా! ఆపద్బాంధవా! అనాధరక్షకా!

(పడుకుంటాడు)

**అవధాన్లు :** (పెళ్ళి పందిట్లో) ఓం భూర్భువస్సువ: ఓం తత్సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధీయోయోన: ప్రచోదయాత్......
(లేచి వచ్చి) అయ్యా! ఉత్తర దంఝాలు, భటువు తీసుకురండి..(అని నడవలోకి వెడుతున్న అహోబిలాన్ని పిలుస్తూ) ఏమండీ! ఇక వధువు తాలూకూ మాతా పితలు పీటలమీదికి రావాలి..

**అహోబిలం :** ఇదుగో! క్షణంలో పంపిస్తాను.

**అవధాన్లు :** ముహూర్తం దగ్గరకొచ్చింది. అమ్మాయిని తీసుకురావడానికి మేనమామలు తయారుగా ఉన్నారా? కట్నాలిక్కడ పెట్టాలి..... మంగళ సూత్రానికి పసుపురాసి ముత్తయిదుల్ని ఎవరినైనా తెమ్మని చెప్పండి.....ఒరేయ్ నాయనా! ఆంజనేయులూ! ఒక కొబ్బరి బొళ్ళాం

నీళ్ళు ఇవ్వరా! పరమశ్రేష్టంగా ఉన్నాయి..... (అహోబిలంతో) అయ్యా! మీరు కదలరేం?

**అహోబిలం :** క్షణంలో అన్నీ జరిపిస్తానుగా!.....మీరు గట్టిగా మంత్రాలు చదువుతూ వుండండి...

**అవధాన్లు :** ఏమిటో! అన్నిటికీ ఒక్క క్షణం ఒక్క క్షణం అంటున్నారు. ఆ క్షణం మాత్రం ఊడిపడుతున్నట్టు కనపడ్డం లేదు. తొందరగా తెమలమనండి. అవతల నాకింకో పెళ్ళి, సాయంకాలం అభిషేకం.... ఇన్నున్నాయి...మళ్ళీ రాత్రికి ఇక్కడేమన్నా తతంగం ఉందా? దాని కథా, కమామీషు అడగాలి, ఆయన గారు కనిపిస్తే-

**అహోబిలం :** కథ నేను చెబుతాను. కమామీషు మా వాడు రాగానే చెప్పిస్తాను... ఇప్పటికి మీరు కానివ్వండి....

**అవధాన్లు :** అలాగే!.....ఆ! కానివ్వు నాయనా! ఎక్కడున్నాం! ఆ!
ఓం భూర్భువస్సువ: ఓం తత్స వితుర్ వరేణ్యం.......

(అహోబిలం లోపలికి వచ్చి తలుపు దగ్గరగా లాగుతాడు)

**అహోబిలం :** ఏరా, గరుడాచలం! ఎందుకు పిలిచావట!...పొరపాటున ఇంకో కొబ్బరి బొళ్ళాం కావాలా అని అడిగాను మీ వియ్యంకుణ్ణి, బుద్ధి తక్కువై.....అంతే! ఆయనొక పక్కా, ఆ అవధాన్లు ఒక పక్కా ఎడాపెడా వాయించేస్తున్నార్రా...... ఈ సారి నిన్ను తీసుకు పోకపోతే నా పెడరెక్కలు విరిచి పెళ్ళి పందిరికి కట్టి నీ ఆచూకీ అడుగుతార్రా...

**గరుడాచలం :** అయిపోయిందిరా!.......ఒక్క క్షణం......అమ్మాయి గౌరి పూజ అయిపోతోంది.......

**అహోబిలం :** (దీనంగా) అయిపోయిందా! .....ఎక్కడ?

**గరుడాచలం :** (బాత్ రూమ్ వైపు చూపుతాడు)

**అహోబిలం :** (ఆశ్చర్యంగా) బాత్ రూమ్‌లోనా?

**గరుడాచలం :** (అతని నోరు నొక్కి, పక్కకు తీసుకువెళ్లి, ఏదో చెప్పి, ముసలాయన్ని చూపిస్తూ వుండగా, ముసలాయన లేస్తాడు)

**తాత :** నాయనా! ముహూర్తానికి ఇంకా ఆలస్యం ఉందా?

**గరుడాచలం :** ఇంకా చాలా ఆలస్యం ఉంది బాబుగారూ! మీరు పడుకోండి –

**తాత :** పెద్దముండావాడినా – (అని లేచి, బాత్ రూం వైపు పోతూ) ఇదేనా బాత్ రూం అన్నారు? (అని దాని దగ్గరకు వెడతాడు)

(గరుడాచలం, అహోబిలం పరిగెత్తుకుపోయి ఆయనకు అడ్డంగా నిలబడతారు) ఏం, నాయనా నాకు ఇద్దరి సాయం అక్కర్లేదు.......నా పనులు నేను చేసుకోగలను..ఇది కొత్త ఇల్లు కనుక అడిగాను.....

**అహోబిలం :** బాబుగారూ! ఆ బాత్‌రూంలో ఆడవాళ్ళు ఉన్నట్టున్నారు...లోపల మరొకటి ఉంది.....అక్కడికి పోదాం....

**తాత :** అంత మరీ తొందరలేదులే, నాయనా! కాసేపు ఆగే –

**అహోబిలం :** అమ్మో! అట్లా అనకండి..వియ్యకులవారి తండ్రికి సరైన సౌకర్యాలు కలిగించలేదంటే మాకెంత అప్రదిష్ట?....మీరు రండి......

**తాత :** మీ అసాధ్యం కూలా! నా కంత తొందర లేదంటుంటే అట్లా లాక్కుపోతారేమిటయ్యా?..(ఇద్దరూ బలవంతంగా ఆయన్ని దొడ్డి వైపుకు తీసుకుపోతారు)

(పేరయ్య పెరట్లో ఉండిపోయాడు.....గరుడాచలం వస్తాడు)

**దుర్గమ్మ :** అరగంట నుంచీ తన్నుకుంటుంటే దిక్కులేదు. ఒక్క క్షణంలో వస్తున్నామన్నారు....తీసుకెళ్ళండి...

**గరుడాచలం :** మరి? రెండు గంటల్లో వస్తున్నామని చెప్పనా? ఆ సరికి పందిరి గుంజలు కూడా పీక్కుపోతాడు, పేరు సాయెబు. అప్పుడు నువ్వూ నేనూ చెరోమూల ఏడుస్తూ కూర్చోవాలి.

**దుర్గమ్మ :** ఎందుకూ?

**గరుడాచలం :** ఎందుకా? పరువు పోయినందుకు......ఇంత జరిగాక ఇంకా తలెత్తుకు తిరగ్గలమా ఈ వూళ్ళో – ?

**దుర్గమ్మ :** నిజమే! మన ఎదురింటి సుబ్బలక్ష్మలాంటి వాళ్ళు మరీను!... ఇదంతా దాని దిష్టే! ఈ సంబంధం కుదిరిన దగ్గర్నుంచీ కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నది.

**గరుడాచలం :** మన బంగారం మంచిదయితే ఉంకోరి ననడం ఎందుకు? (తలుపు బాది) అమ్మడూ! నేను ఒకటి, రెండు, మూడు అనే సరికి బయటకు రావాలి. లేకపోతే నేనేం చేస్తానో నాకే తెలియదు. ఒకటి.......

రెండు.....అమ్మడూ! నా కోపం నీకు తెలుసు....నేనసలే తిక్క మనిషిని, నాకు కోపంరానే రాదు. ఒచ్చిందా, నేను మనిషినే కాను.

**దుర్గమ్మ :** నిజమేనే అమ్మడూ! ఇప్పుడు నాన్నగారికి నిజంగానే కోపం వచ్చిందే!

**గరుడాచలం :** ఒకటి......రెండు......(నీరసంగా) మూడు......ష్ (కూర్చుండిపోయాడు)

(అహోబిలం దొడ్డి వాకిలి నుంచి వస్తాడు)

**అహోబిలం :** అమ్మయ్య! ఆ ముసలాణ్ణి అక్కడ కూలేసి వచ్చే సరికి నా తాతలు దిగొచ్చారు. అట్లా కూర్చున్నావేమిట్రా? లే,లే....నువ్వు పందిట్లోకి వెళ్ళి నలుగుర్నీ పలకరిస్తూ ఉండు.....ఈలోగా మన ఆడవాళ్ళని పంపి అమ్మాయిని తీసుకురమ్మంటాను.......లే – (ఇద్దరూ వాకిట్లోకి వెడతారు)

(సావిత్రమ్మ, సన్యాసిరావు వస్తారు)

**సావిత్రమ్మ :** ఏమే దుర్గా! ఏమయింది? అమ్మాయి ఏది?

**దుర్గమ్మ :** ఏం చెప్పను అక్కయ్యా! ఏం జరిగిందో ఎవ్వరికీ తెలియదు. ఆ గదిలోకి వెళ్ళి తలుపులు బిడాయించుకుంది. ఈ పెళ్ళి వద్దుట –

**సావిత్రమ్మ :** పిచ్చి పిల్ల! ఏం రఘడుసుకుందో ఏమిటో? నువ్వెళ్ళి ఆ మంగళసూత్రం భాషికాలు ఆ బ్రాహ్మడికివ్వు.... ఈ లోగా నేను తీసుకొస్తానుగా అమ్మాయిని.

(దుర్గమ్మ లోపలికి వెడుతుంది)

అమ్మాయ్! పల్లవీ! భయంలేదమ్మా! మేమంతా ఇట్లా భయపడ్డ వాళ్ళమే! మా అమ్మవుగదూ, బయటకు రా

**సన్యాసిరావు :** అబ్బా! సత్యభామా దేవిగారు నడుం బిగించి రంగంలోకి దిగిందండీ! వాళ్ళ అమ్మా, నాన్నా చెప్పినా వినని మనిషి నీ మాట వింటుందా?

**సావిత్రమ్మ :** దానికి నా దగ్గర చనువెక్కువ....చూడండి.....అమ్మాయ్! తొందరగా రా అమ్మా! ఎందుకే నీ అలక? నాన్న ఇంకా ఏమన్నా నగా నట్రా చేయించాలా? నాతో చెప్పు.......క్షణంలో చేయించేట్లు చేస్తాను.

**సన్యాసిరావు :** ఆహా! యుగంధరమంత్రిని చంపి పుట్టిందండీ! నువ్వు వాళ్ళ నాన్నకి సిఫార్సు చేసి నగలు చేయిస్తావ్! వడ్డాణం పెడితేగాని పెళ్ళిపీటల

మీదికి రానని మొరాయించిన దానివి; నీ కంతకంటే ఏం తెలుస్తుందిలే!

**సావిత్రమ్మ :** మీరు మాత్రం! సైకిలిస్తేగాని పెళ్ళికి తరలి రామని మొరాయించలా?

**సన్యాసిరావు :** మీ నాన్న ఇస్తానన్నాడు...మేం అడిగాం......చేతగాని వాళ్ళు అనవసరమైన ఆర్భాటాలకు పోవడం ఎందుకు? మమ్మల్ని ఆడిపోసుకోవడమెందుకు?

**సావిత్రమ్మ :** మా నాన్నేగా మాకు లోకువ....పెళ్ళయి ముప్ఫయ్ ఏళ్ళయింది. ఇంకా దెప్పుళ్ళే! (ఏడుపు గొంతుతో) అమ్మా! పల్లవీ! మొగాళ్ళంతా ఇంతేనే! నీ కెందుకు, నువ్వురా అమ్మా! (అని కళ్ళు ఒత్తుకుంటుంది. ఈలోగా విశాల, వెనక విశ్వం లోపల నుంచి వస్తారు.)

**విశాల :** ఏమిటి దొడ్డమ్మగారూ?

**సావిత్రమ్మ :** మా అమ్మే! వచ్చావా! చూడమ్మా, నీ స్నేహితురాలు! గంట అనగా లోపలికి పోయి తలుపులు బిడాయించుకుంది....బయటకు రాదట, ఈ పెళ్ళి చేసుకోదుట!

**విశాల :** మీరేం గాబరా పడకండి. అవన్నీ నేను చూసుకుంటానుగా!...గంట క్రితం రావలసింది....ఆయన తెమిలితేనా? మీరు పదండి దొడ్డమ్మగారూ! (సావిత్రమ్మ, సన్యాసిరావు వెడతారు) ఏమండోయ్, మిమ్మల్నే –

**విశ్వం :** వస్తూనే వున్నానుగా! ఇహ పెళ్ళి అయ్యేవరకు నీ వెనకాలే ఉంటానని చెప్పానుగా!

**విశాల :** ఉద్ధరించారుగాని.......అవతల పల్లవి ఆ బాత్‌రూంలోకి వెళ్ళి తలుపు వేసుకుని బయటకు రానంటోందిట!....ఒసే, పల్లవీ! నేనే, విశాలని. త్వరగా, రా! (భర్తతో) ఈ పెళ్ళి చేసుకోదుట!!

**విశ్వం :** భేష్! ఏం తెలివైన నిర్ణయం! ఆ అమ్మాయి తొందరగా మేలుకుని పెళ్ళికి ముందే ఆ నిర్ణయానికి వచ్చేసింది; నీ మాదిరిగా పెళ్ళి అయిన తర్వాత కాకుండా.

**విశాల :** ఏం? జోక్ చేశాననుకుంటున్నారా?..మీకు ఎక్కడ ఎట్లా మాట్లాడాలో

కూడా తెలియదేమండీ!...పల్లవీ! నా మాట వినవూ? అమ్మా, నాన్నా, అందరం దిగులు పడుతున్నాం.......కాళ్లూ చేతులూ ఆడ్డం లేదు.....

(విశ్వం ఆవిడ చెయ్యి పైకి ఎత్తి మళ్ళీ కిందికి జారుస్తాడు)

చాల్లెండి, మీ పరాచకాలు –

**విశ్వం :** అమ్మా! నిన్ను అభినందిస్తున్నాను. నీ వంటి వీరవనితలు ఉన్నంతవరకు బ్రహ్మచారులు రక్షింపబడుదురుగాక!

**విశాల :** అవ్వ! ఇప్పుడుటండీ వేళాకోళాలు! ముహూర్తం ఇంకా 15నిమిషాలు కూడా లేదు....పల్లవీ, పల్లవీ –

**విశ్వం :** అమ్మాయ్! నీకు ఇష్టం లేకపోతే ధైర్యంగా బయటకు వచ్చి చెప్పేయమ్మా......వీర నారీమణులందరూ అట్లాగే చేస్తారు...మీ స్నేహితురాల్ని చూడు –

**విశాల :** మీరు కొంచెం వాకిట్లోకి వెడతారా?

**విశ్వం :** అరె! నాకు స్వేచ్ఛ నిచ్చిన యజమానురాలికి –

**విశాల :** అబ్బా!

(దుర్గమ్మ లోపలనుంచి వస్తుంది. విశ్వం వెళ్ళిపోతాడు వాకిట్లోకి)

**దుర్గమ్మ :** రాలేదు కదమ్మా! ఎందుకొస్తుందీ.....నా తలరాత బావులేదు.....ఆ వంట వాళ్ళ కేవోకావాలని అరుస్తున్నారు.....కాస్త చూడమ్మా.....

(విశాల వెడుతుంది)

(తలుపు తడుతూ) అమ్మాయ్! ఏమిటమ్మా! ఈ రభస! మన ఇంటా వంటా లేదు.......

(గరుడాచలం వస్తాడు వాకిట్లోనుంచి)

(గబగబా తలుపు కొడుతూ) అమ్మాయ్! నువ్వు రావాలి......అదుగో! ముహూర్తానికి వేళయింది....రాకపోతే నా మీద ఒట్టే!

**గరుడాచలం :** ఊరికే తలుపుల బాదితే మన చేతులు నొప్పులేగాని అది బయటకు వస్తుందా?

**దుర్గమ్మ :** మరేం గతండీ?

**గరుడాచలం :** ఇహ లాభం లేదు......ఈ సారి అమ్మల్ని లాక్కొస్తాను...

(అని ధోవతి ఎగదోపుతాడు)

**దుర్గమ్మ :** అట్లా ధోవతీ ఎగ్గడతారేమిటండీ? ఏం చేస్తారు?

**గరుడాచలం :** ఏం చేస్తానా? చెబుతా......చెబుతా.........

(అంటూ ఉండగా ఇన్‌స్పెక్టర్ గోవిందయ్య వస్తాడు)

**ఇన్‌స్పెక్టర్ :** గరుడాచలం గారూ! (ఆయన్ని ఆ వేషలో చూసి) ఏమిటి? ఏమయింది? Anything wrong?

**గరుడాచలం :** (ధోవతి కిందికి లాగుతూ) అబ్బే.......ఏమీ లేదండీ......మా ఆవిడ అటక మీద మంగళసూత్రాలు దాచానంటేనూ –

**ఇన్‌స్పెక్టర్ :** ఏం హాస్యాలాడతారు గరుడాచలంగారూ! మరి, నన్ను క్షమించాలి.

**గరుడాచలం :** (పరధ్యానంగా) అట్లాగే!

**ఇన్‌స్పెక్టర్ :** (నవ్వి) మీరేదో పరధ్యానంలో ఉన్నారు...నేను investigation ఉందని చెప్పానుగా! Time అయింది.... వెళ్ళొస్తాను.

**గరుడాచలం :** అదా!......మరో పదినిమిషాలులో లగ్నం –

**ఇన్‌స్పెక్టర్ :** మళ్ళీ వస్తానుగా!

**గరుడాచలం :** అమ్మో! అట్లా అనకండి.......భోజనం వేళకి ఇక్కడ ఉండాలి.......

**ఇన్‌స్పెక్టర్ :** అట్లాగే!...........వస్తాను (వెడతాడు)

**గరుడాచలం :** (గట్టిగా నిట్టూర్చి) ఇప్పుడు చెబుతా (అటూ ఇటూ ఎవరూ రావడం లేదని నిశ్చయం చేసుకుని, మళ్ళీ ధోవతి ఎగ్గడతాడు)

**దుర్గమ్మ :** ఎందుకండీ? ఏం చేస్తారు?

**గరుడాచలం :** ఏం చేస్తానా?......మన మెట్ల మీదగా, ఆ గోడ ఎక్కి, గోడవారగా పైకి వెళ్ళి, పైకి కిటికీ లోంనుంచి బాత్‌రూంలోకి దూకి –

**దుర్గమ్మ :** అయ్యో వద్దండీ!........చెబితే వినరుగదా! నే చెప్పిన మాట వింటే ఇంత వరకు ఎందుకు వస్తుంది?

**గరుడాచలం :** ఇది మనం పోట్లాడుకునే సమయం కాదని పస్తాయిస్తున్నాను... నువ్వేం సవ్యంగా చెప్పేడ్చావ్? నేనేం వినలేదు?

**దుర్గమ్మ :** వెళ్ళొద్దండీ –

**గరుడాచలం :** వదులు.....చొక్కా వదులు –

**దుర్గమ్మ :** వద్దండీ –

**గరుడాచలం :** వదలమంటుంటే

**దుర్గమ్మ :** వద్దండీ – (దుర్గమ్మ చొక్కా గుంజుతుంది....చొక్కా చిరిగింది)

**గరుడాచలం :** అయిందా? చొక్కా చిరిగిపోయిందా? పీలికలై పోయిందా? ఇప్పుడు నీ కళ్లు చల్లబడ్డాయా? (అని నిస్పృహతో కూర్చుండిపోతాడు)

**దుర్గమ్మ :** (బాత్‌రూం దగ్గరకు వెళ్ళి) అమ్మా! ఏమిటమ్మా ఇది? మా కిట్లా రాసి పెట్టాడా భగవంతుడు?

(లేచి తలుపు దగ్గరకి వెళ్ళి గబగబా కొడుతూ) అమ్మడూ! నువ్వు వెంటనే రాకపోతే నేను ఇక్కడే అన్నాహారాలు మాని పడుకుంటాను... సరా?...అమ్మడూ! (తలుపు బాదుతుంది)

అయ్యో! (అని మంజేయి చూసుకుంటుంది)

**గరుడాచలం :** ఏమయింది? నీ చెయ్యి కూడా విరిగిందా?

**దుర్గమ్మ :** కాదండీ!

**గరుడాచలం :** మరేమిటి?

**దుర్గమ్మ :** మీరు కోప్పడనంటే –

**గరుడాచలం :** కోప్పడ్డం కాదు.....నా బొంద....చెప్పేడు –

**దుర్గమ్మ :** ఉంగరంలో పగడం పగిలిందండీ!

**గరుడాచలం :** అయిందీ! చీరె చిరిగింది......గూడ విరిగింది.....చొక్కా చిరిగింది..... పగడం పగిలింది....ఇహ మగ పెళ్ళివారు పరువు నష్టానికి కోర్టు కెక్కడంతో కాని ఇది పూర్తి కాదు.

**దుర్గమ్మ :** అమ్మాయిని బయటకు రప్పించాలంటే దానికేం కావాలో అడగాలి కాని నా మీద ధూం ధాంలు చేస్తే వస్తుందా?

**గరుడాచలం :** (ఆవిడకేసి చూసి) అదీ చూద్దాం.......(సౌమ్యంగా) అమ్మడూ! నేను డాడీనమ్మా! నువ్వు మనసు విప్పి చెప్పకపోతే నీకేం కావాలో మాకేం తెలుస్తుంది? ......నీ సంతోషం కన్నా మాకేం కావాలి, చెప్పు...... నీఏం కావాలి?

**దుర్గమ్మ :** మీరు ఆగండి.....ఆడపిల్లలు అన్ని విషయాలూ తండ్రుల్తో చెప్పుకోలేరు......అమ్మడూ! పోనీ నన్ను లోపలికి రమ్మంటావా? నీ బాధ ఏమిటో చెబుతావా?

**గరుడాచలం :** అదుగో! ఏదో కాగితం తలుపు కింది నుంచి తోసింది చూడు.....

**దుర్గమ్మ :** గోళ్ళ రంగుతో రాసినట్టుందండీ!

**గరుడాచలం :** ఏమని రాసింది?

**దుర్గమ్మ :** "నేను డాడీతో మాట్లాడుతాను"

**గరుడాచలం :** అదుగో! చూశావా! నా తల్లి! She is my daughter! అది నా కూతురు! ఇదుగో! ఇప్పుడే వచ్చేస్తున్నానమ్మా!

(తలుపు ఓర వాకిలిగా తీస్తుంది.....గరుడాచలం లోపలికి వెడతాడు)

**దుర్గమ్మ :** (నిట్టూర్చి) నేను డాడితో మాట్లాడుతాను అందీ! అంతే! అడ్డాలనాడు బిడ్డలుకాని గడ్డాలనాడు కాదని.......

(శకుంతల వస్తుంది లోపలనుంచి)

చూశావా! చూశావా శకుంతలా! అమ్మాయి ఆయన్తో మాట్లాడు తుందిట! నేను పరాయి దాన్నయిపోయాను చూశావా! దాన్ని ఎట్లా పెంచానమ్మా! దానికేం కావాలో అది అడక్కుండానే అమర్చేదాన్నా? ఏడు వారాల నగలు పెట్టలేదు కాని, బంగారం సెట్టు, రవ్వల సెట్టు చేయించానా? నాకు ఏయే సొమ్ములున్నాయో, దానికీ అవన్నీ చేయించానా? బజారున ఇద్దరం వెడుతూంటే అప్పాచెలెళ్ళా అని అడిగేవాళ్ళు ....అంత స్నేహంగా ఉండాలని తాపత్రయ పడ్డాను...... ఇప్పుడేమో – "నేను డాడీతో మాట్లాడుతాను" అంటుందా?

(తలుపు తెరుచుకుంది..గరుడాచలం ఒక్కడే వాకిట్లోకి వస్తాడు)

**దుర్గమ్మ :** అమ్మాయి ఏదండీ?......ఏమన్నదండీ?

**గరుడాచలం :** అహోబిలం.......అహోబిలం.......(శకుంతలతో) అహోబిలాన్ని ఒక్కసారి అర్జంటుగా రమ్మనమ్మా! (శకుంతల వెడుతుంది)

**దుర్గమ్మ :** నాకు చెప్పరుటండీ?......అప్పుడే అంత కానిదాన్నయిపోయానా?

**అహోబిలం :** (త్వరగా వస్తూ) ఏమిట్రా?.....అమ్మాయి ఏమంది? ఏమిటిట? తొందరగా తెమలండిరా.....కాసేపాగితే మన ఆబోరు దక్కదు...

**గరుడాచలం :** అయిన ఆలస్యం ఎలాగూ అయింది....ఒక్కసారి......ఒక్క నిమిషం కోసం అబ్బాయిని – అదే, పెళ్ళికొడుకుని – ఇక్కడికి తీసుకురావాలి.

**అహోబిలం :** పీటల మీద కూర్చున్న పెళ్ళికొడుకు – లేచి రావచ్చుట్రా?

**గరుడాచలం :** ఈ గండం గడవాలంటే అదొక్కటే మార్గం.....ఎట్లా గయినా – అమ్మాయి – కాదు; కాదు – నేనొక్కసారి వచ్చిపొమ్మన్నానని అతనికి రహస్యంగా చెప్పు.

**అహోబిలం :** ఒరే! అసలే ఆ వియ్యంకుడు చాదస్తం ముండా కొడుకు – ఇప్పటికే కథలూ కాకరకాయలూ చెప్పి దాటించేస్తున్నాను....ఇహ ఇది కూడా జరిగితే మన మొహం చూడడు......

**గరుడాచలం :** ఏదో మిషమీద ఆయన్ని అక్కణ్ణుంచి తీసుకుపో......ఏదో ఒక పెద్ద కేసు వచ్చిందని చెప్పు.....ఎవరికో Accident అయిందని చెప్పు...ఏదో ఒకటి.....అబ్బాయి ఒక్క నిమిషం ఇక్కడికి రావడం చాలా అవసరం.

**అహోబిలం :** సరే! పెళ్ళి పెద్దంటే మంత్రసాని వతు.....తప్పుతుందా?

(గరుడాచలం బతిమిలాడుతున్నట్టు అహోబిలం గడ్డం పట్టుకుంటాడు....అహోబిలం వెడతాడు.... నాదస్వరం)

**దుర్గమ్మ :** అమ్మాయి ఏమన్నదో చెప్పరేమండీ?...నిమ్మకు నీరెత్తినట్టు ఉండి పోతారేం?

**గరుడాచలం :** ఏం చెప్పమంటావ్? మెత్తని చెప్పుతో కొట్టింది?

**దుర్గమ్మ :** మిమ్మల్నే?

**గరుడాచలం :** నీ బొం –....ఇద్దర్నీ – సమానంగా..........దానికి మనల్ని, మన సంసారాన్ని చూస్తే భయం పుట్టిందట... అది ఈ రోజున ఇంకా విశ్వరూపంలో కనిపించిందట!

**దుర్గమ్మ :** ఏంగాడు, మన సంసారానికి? పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కని, హాయిగా, మన మాదిరిఆనే –

(ఒక్కసారి దుర్గమ్మకు – Flash backలో – తమ మొగుడు పెళ్ళాల పోట్లాట.....వినిపిస్తుంది)

నేనా సంగతి ఆలోచించలేదు సుమండీ!

**గరుడాచలం :** దాంతోపాటు ఏ ఒక్క మొగుడూ పెళ్ళా జంటని చూసినా ఆ జన్మ విరోధుల్లా నిత్యమూ పోట్లాడుకుంటూనే కనిపించారట! సావిత్రమ్మ వదిన, సన్యాసిరావు; విశ్వం, విశాల; ఒకరేమిటి? ఈ ప్రపంచంలో

అందరూ అట్లాగే తయారవుతారని, అట్లా అయితే అటువంటి పెళ్ళితనకు ససేమిరా వద్దని –

(వసంత్ వచ్చాడు)

రావోయ్, రా......నిన్ను రప్పించక తప్పలేదు.

(ఆదుర్దాగా విశ్వం, విశాల, సావిత్రమ్మ, సన్యాసిరావు, శకుంతల అందరూ తలో మూలనుంచి వస్తారు)

**వసంత్ :** ఏమిటి?...పల్లవేదీ?

**గరుడాచలం :** ఆదుర్దా ఏమీలేదు....అమ్మాయి తన భావి జీవితం ఎట్లా గడుస్తుందా– అని భయపడిపోతోంది..అంటే మీరిద్దరూ ఏ అరమరికలు లేకుండా, ప్రతివిషయాన్ని సంప్రదించుకుని ఒక్క మాటమీద ఉంటారు – లేక చీటికీ మాటికీ ఒకర్నొకరు కసురుకుంటూ

**దుర్గమ్మ :** గిల్లుకుంటూ, రక్కుకుంటూ –

**గరుడాచలం :** ఉంటారా – అని.

**వసంత్ :** ఆ అనుమానం ఇప్పుడెందుకొచ్చిందీ?

**గరుడాచలం :** కొంతవరకు మేమే కారణమని చెప్పొచ్చు. అమ్మాయికి ఏం కావాలంటే అది ఇచ్చాం అనుకున్నాంకాని జీవితాన్ని గురించిన అవగాహన ఇచ్చే వాతావరణాన్ని సృష్టించలేకపోయాం. పెళ్ళంటే, సంసారమంటే ఉండాల్సిన ఆహ్లాదకరమైన పరిస్థితుల్ని సృష్టించలేకపోయాం..... ఇంట్లో పోట్లాడుకునే తల్లిదండ్రులుంటే, అది పిల్లల మనస్సుల్లో ఎటువంటి విషబీజాన్ని నాటుతుందో గ్రహించలేకపోయాం... దానికి తోడు తన చుట్టూ, తాను చూసిన ప్రతి మొగుడూ పెళ్ళాంకూడా అట్లానే ప్రతి నిత్యం పోట్లాడు కుంటారని గమనించిందట. అందుకని –

**వసంత్ :** ఓ! Silly girl! (పిలుస్తూ) పల్లవీ! Oh dear! no fears! మనం ఇదివరకే అన్నివిషయాలు మాట్లాడుకున్నాంగా! అటువంటివేవీ మన జీవితాల్లో ఉండవు....సరా? Come on, quick అందరూ మన కోసం కాచుక్కూర్చున్నారు...వచ్చేసేయ్......(గరుడాచలంతో) వచ్చేస్తుంది లెండి.....త్వరగా రండి – నాన్నగారితో bath roomకు వెళ్ళొస్తానని చెప్పి వచ్చాను...ఆయనేం అనుమానపడతారో?

(వెళ్ళిపోతాడు..ఆహ్లాదకరమైన సంగీతం......పల్లవి తలుపు తీసి బయటకు వస్తుంది)

**పల్లవి :** డాడీ!...నేను రెడీ......

**గరుడాచలం :** ఏమిటీ! నువ్వు రెడీనా? గంటన్నరాయె, కంఠశోషతో – పిలిచి, పిలిచి – ఇప్పుడతనను వచ్చి No fears, come on అంటే – బయటకు వచ్చి నేను రెడీ అంటావా?

**పల్లవి :** Sorry Daddy...........Sorry Mummy.........

**దుర్గమ్మ :** మా అమ్మే! భలే బుద్ధి చెప్పావే!

**సావిత్రమ్మ :** మగాళ్ళ గుణాన్ని సరిగ్గా పోల్చావమ్మా!

**సన్యాసిరావు :** చెప్పావులే, మహా!

**విశాల :** నువ్వెందుకు దాక్కోవాలే! అట్లా పోట్లాడే మొగాళ్ళని గదిలో పెట్టి తాళం వెయ్యాలిగాని –

**విశ్వం :** నోటికి తాళాలు వేశారు....అది చాల్లేదనా?

**దుర్గమ్మ :** పోన్లే అమ్మా! ఇప్పటికయినా మాకు బుద్ధి వస్తే –

**గరుడాచలం :** ఆ బుద్ధి రావలసింది నీకే!

**దుర్గమ్మ :** రెండు చేతులూ కలిస్తేనే చప్పట్లు!

**గరుడాచలం :** ఆ చప్పట్లు మోయించే పెళ్ళి ఆపు చేయించేదాకా తెచ్చావ్?

**దుర్గమ్మ :** మీరా? నేనా?

**గరుడాచలం :** ఎవరో వేరే చెప్పాలా? మొహం ఉంది, అద్దం ఉంది....

(మృదంగం ఘటం తన్యావర్తనం.......)

**పల్లవి :** (బిక్కగా) డాడీ......మమ్మీ....(మళ్ళీ బాత్‌రూం వైపుకు నడుస్తుంది)

**గరుడాచలం, దుర్గమ్మ :** అమ్మా! ఒద్దొద్దు...పొరపాటయిపోయింది.....

**అహోబిలం :** వాయిచండయ్యా, భజంత్రీలు....పెళ్ళికూతుర్ని పీటలమీదికి తీసుకొస్తున్నారు...

**శృంగారకవి :** అయ్యా!........నేను రాసిన పంచరత్నాలు....

**గరుడాచలం :** పంచరత్నాలేం ఖర్మా.......దశరత్నాలు చదువుదువు గాని –

(నాదస్వరం గట్టిగా.......అందరూ పెళ్ళిపందిరిలోకి)